RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 216 మేడ్చల్ మల్కాజ్‌గిరి 28 ఆగష్టు 2024 బుధవారం పేజీలు : 4

## జార్ఖండ్ మాజీ సీఎం చంపాయ్ సోరెన్ బీజేపీలో చేరేందుకు తేదీ ఖరారు

జార్ఖండ్‌లో మరికొన్ని నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న క్రమంలో కీలక పరిణామాలు చోటుచేసు కుంటు న్నాయి. ఈ క్రమంలోనే జార్ఖండ్ మాజీ సీఎం చంపాయ్ సోరెన్ ఆగస్టు 30న రాంచీలో అధికారికంగా భారతీయ జనతా పార్టీలో చేరనున్నారు. అస్సాం సీఎం హిమంత బిస్వా శర్మ తన అధికారిక ఖాతాలో ఓ పోస్ట్ చేసి ఈ సమాచారాన్ని పంచుకున్నారు. చంపై సోరెన్ హెూంమంత్రి అమిత్ షాతో సమావేశమయ్యారని ఆయన తన పోస్ట్‌లో తెలిపారు. చంపై సోరెన్ న్యూఢిల్లీకి చేరుకుని బీజేపీ సీనియర్ నేతలతో భేటీ అయ్యారు. గత మంగళవారం నుంచి ఆయన ఢిల్లీకి వెళ్లడం ఇది రెండోసారి.

## అధికారులే మీ ఇంటికొస్తారు..

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో రైతు రుణమాఫీపై గందరగోళం నెలకొంది. కొన్నిచోట్ల బ్యాంకుల తప్పిదం వల్ల రుణమాఫీ జరగలేదు. మరికొన్ని చోట్ల అధికారుల మిస్టేక్స్ జరిగాయి. ఆ క్రమంలో రైతు భరోసా పేరుతో యాప్‌ను తెలంగాణ ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చింది. యాప్ డిజైన్ ఆదివారం పూర్తి కాగా.. మంగళవారం (ఈ రోజు) నుంచి గూగుల్ ప్లే స్టోర్‌లో అందుబాటులో ఉంది. యాప్‌కును క్షేత్రస్థాయి సిబ్బందికి పంపించి, అందులో వివరాలు ఎలా నమోదు చేయాలనే అంశంపై శిక్షణ కూడా ఇచ్చారు.

**అందుబాటులోకి యాప్..** కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు రుణం అమలు కాని రైతుల కోసం తెలంగాణ ప్రభుత్వం యాప్ తీసుకొచ్చింది. అర్హత కలిగి రుణమాఫీ కాని వారి ఇళ్లకు



వ్యవసాయ శాఖ అధికారులు వెళతారు. వారి ఇంటి వద్ద యాప్‌లో వివరాలు నమోదు చేస్తారు. ఈ రోజు నుంచి రుణమాఫీ అమలు కాని రైతుల ఇంటికి వ్యవసాయ సిబ్బంది వెళతారు.

**తొలుత వారి ఇంటికే..** రుణమాఫీ కాలేదని పలువురు రైతులు అధికారులకు ఫిర్యాదు చేశారు. తొలుత వారి ఇంటికి వ్యవసాయ శాఖ సిబ్బంది వెళతారు. అక్కడ వారి రేషన్ కార్డ్, ఆధార్ కార్డ్, ఇతర డాక్యుమెంట్స్ పరిశీలిస్తారు. కుటుంబ సభ్యుల వివరాలు, ఫొటోలు కూడా తీసుకుంటారు. రుణమాఫీకి సంబంధించిన వివరాలు, ఫోన్ నంబర్ ధృవీకరణ పత్రం రూపొందిస్తారు. కుటుంబ యజమాని సంతకం తీసుకుంటారు. ఆ యజమాని రుణానికి సంబంధించి పంచాయతీ కార్యదర్శి ధృవీకరించాల్సి ఉంటుంది. అర్హులైన వారిని గుర్తించి రైతులకు రుణమాఫీ చేస్తామని తెలంగాణ ప్రభుత్వం స్పష్టం చేసింది.

**కారణమిదే..? :** కొందరు రైతులకు రుణమాఫీ ఎందుకు కాలేదనే అంశంపై ఉన్నతాధికారులు వివరించారు. రైతుల రేషన్ కార్డు లేకపోవడం, కుటుంబ వివరాలు సరిగా నమోదు కాలేదని పేర్కొన్నారు. ఆయా కారణాలతో రుణమాఫీ కాలేదని వివరించారు. ఆ క్రమంలో రైతుల ఇంటి వద్దకొచ్చి వివరాలు నమోదు చేసి, అర్హత ఉంటే రుణమాఫీ చేస్తామని ప్రభుత్వం స్పష్టం చేసింది.




దిల్లీ : మద్యం కుంభకోణం కేసులో నిందితురాలిగా ఉన్న ఎమ్మెల్సీ కవితకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఆమె దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ విశ్వనాథన్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. కవిత తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ, ఈడీ తరఫున ఏఎస్‌జీ వాదనలు వినిపించారు. ఇరువైపుల వాదనలు విన్న ధర్మాసనం కవితకు బెయిల్ మంజూరు చేసింది. ఈడీ, సీబీఐ కేసుల్లో బెయిల్ ఇస్తున్నట్లు ధర్మాసనం పేర్కొంది. బెయిల్ మంజూరుకు సుప్రీంకోర్టు మూడు ప్రధానమైన కారణాలు చెప్పింది. సీబీఐ తుది ఛార్జిషీట్ దాఖలు చేసిందని.. ఈడీ కూడా దర్యాప్తు పూర్తిచేసిందని పేర్కొంది. నిందితురాలు జైలులో ఉండాల్సిన అవసరం లేదంది. మహిళగా కూడా పరిగణించాల్సి ఉందని అభిప్రాయపడింది. అందుకే బెయిల్ మంజూరు చేస్తున్నట్లు ధర్మాసనం వెల్లడించింది.

**కవిత బెయిల్ పిటిషన్‌పై సుప్రీంకోర్టులో వాదనలు సాగాయిలా..**
కవితను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) ఈ ఏడాది మార్చి 15న అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. మనీ లాండరింగ్ నిరోధక చట్టం కింద అరెస్ట్ చేసినట్లు ఈడీ అసిస్టెంట్ డైరెక్టర్ జోగేందర్ అప్పట్లో ప్రకటించారు. అరెస్ట్ వారెంట్‌తో ఆమె ఇంటికి వెళ్లిన ఈడీ అధికారులు తొలుత సోదాలు నిర్వహించి, మనీ లాండరింగ్ నిరోధక చట్టం ప్రకారం విచారించి కవిత వాంగ్మూలం నమోదు చేశారు. ఆమె నుంచి ఐదు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కవితను తిహాడ్ జైలుకు తరలించారు.

**ఇదీ నేపథ్యం :** దిల్లీ మద్యం విధానంలో అక్రమాలు చోటు చేసుకున్నాయంటూ 2022 ఆగస్టులో సీబీఐ కేసు నమోదు చేసింది. ఇదే కేసులో హైదరాబాద్‌కు చెందిన మద్యం వ్యాపారి అరుణ్ రామచంద్రపిళ్లై వాంగ్మూలాన్ని సేకరించిన అనంతరం కవితకు నోటీసులు జారీ చేసింది. మరోవైపు దిల్లీ మద్యం టెండర్ల వ్యవహారంలో సౌత్ లాబీ తరఫున రూ.కోట్లు చేతులు మారాయనే కోణంలో ఈడీ దర్యాప్తు ప్రారంభించింది. అరుణ్ రామచంద్రపిళ్లై రిమాండ్ నివేదికలో అతడిని కవిత బినామీగా పేర్కొంది. ఈ సౌత్ గ్రూప్ ద్వారా రూ.100కోట్ల ముడుపులు ఆప్‌కు హవాలా మార్గంలో అందాయని అభియోగం మోపింది. గతేడాది మార్చిలో కవితకు నోటీస్ జారీ చేసి విచారించింది. ఆ తర్వాత మరోమారు కూడా సమన్లు జారీ చేసింది. అవి మహిళలకు ఉన్న హక్కులను ఉల్లంఘించేలా ఉన్నందున వాటిని కొట్టేయాలని ఆమె గత ఏడాది మార్చి 15న సుప్రీంకోర్టును ఆశ్రయించి అప్పట్లో ఉపశమనం పొందారు. సరిగ్గా ఈ ఏడాది అదే రోజు ఆమెను ఈడీ అరెస్టు చేసింది.

## థాంక్యూ సుప్రీంకోర్టు: కేటీఆర్ పోస్ట్

హైదరాబాద్: భారాస ఎమ్మెల్సీ కవితకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసిన నేపథ్యంలో ఆమె సోదరుడు, పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ హర్షం వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. "థాంక్యూ సుప్రీంకోర్టు. ఊరట లభించింది.. న్యాయం గెలిచింది" అని కేటీఆర్ పేర్కొన్నారు. కవితకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేయటంపై కేంద్ర మంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలను కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. సుప్రీంకోర్టుకు ఉద్దేశాలు ఆపాదించేలా కామెంట్స్ చేశారని బండి సంజయ్ తీరును తప్పుబట్టారు.



కేంద్రమంత్రిగా ఉంటూ ఇంత చౌకబారుగా మాట్లాడుతారా అని విమర్శించారు. దురుద్దేశపూర్వకంగా బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలను కోర్టు ధిక్కారంగా పరిగణించి తగిన చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టుకు కేటీఆర్ విజ్ఞప్తి చేశారు.

**బండి సంజయ్ ఏమన్నారంటే..? :** కవితకు బెయిల్ మంజూరవడంపై కేంద్రమంత్రి బండి సంజయ్ 'ఎక్స్' వేదికగా స్పందించారు. "భారాస ఎమ్మెల్సీకి బెయిల్ లభించినందుకు కాంగ్రెస్ పార్టీకి, ఆ పార్టీ న్యాయవాదులకు అభినందనలు. మీ అలుపెరగని ప్రయత్నాలు చివరకు ఫలించాయి. ఈ బెయిల్ భారాస, కాంగ్రెస్ రెండింటికీ విజయం. భారాస లీడర్ బెయిల్‌పై బయటకు రాబోతున్నారు. కాంగ్రెస్ వ్యక్తి రాజ్యసభకు ఎంపికయ్యారు. బెయిల్ కోసం మొదట వాదించిన వ్యక్తి పోటీ చేస్తే.. ఆ అభ్యర్థికి (అభిషేక్ మను సింఘ్వీని ఉద్దేశిస్తూ) మద్దతు ఇచ్చి కేసీఆర్ రాజకీయ చతురత ప్రదర్శించారు" అని బండి సంజయ్ విమర్శలు గుప్పించారు.



## సెప్టెంబర్ 17 నుంచి రెండో విడత ప్రజాపాలన: సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: సెప్టెంబర్ 17 నుంచి 10 రోజుల పాటు రెండో విడత ప్రజాపాలన కార్యక్రమం నిర్వహించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. రేషన్‌కార్డులు, హెల్త్ కార్డుల కోసం వివరాలు సేకరించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. పూర్తి హెల్త్ ప్రొఫైల్‌తో రాష్ట్రంలో ప్రజలందరికీ హెల్త్‌కార్డులు జారీ చేయాలని, క్షేత్రస్థాయిలో అధికారులను సన్నద్ధం చేయాలని సూచించారు.

## కేసీఆర్ సారూ.. ఎక్కడ మీరు..?



భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) అధినేత కేసీఆర్ ఎక్కడ..? చివరిసారిగా గత నెల ఆఖరులో జరిగిన తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు హాజరైన ఆయన ఆ తర్వాత మళ్లీ కనిపించలేదు. ఇక కేసీఆర్ శాసనసభకు 20 ఏళ్ల తర్వాత ప్రతిపక్ష నేతగా వచ్చారు. ప్రధాన ప్రతిపక్ష నాయకుడు అయిన ఆయన.. కేవలం ఒక్క రోజే సభకు హాజరయ్యారు. హామీల అమలు విషయంలో అధికార పార్టీని చీల్చిచెండాడుతానని ప్రకటించారు. కానీ.. మీడియా పాయింట్ లో ఆ ప్రకటన తర్వాత కేసీఆర్ మళ్లీ కనిపించలేదు. ఇంతకూ ఆయన ఎక్కడ ఉన్నారు?

**హైదరాబాద్ లోనా? ఫాం హౌజ్ లోనా?...** కేసీఆర్ తెలంగాణ ఎన్నికలలో ఓటమి అనంతరం నేరుగా ఎర్రవల్లిలోని ఫాంహౌజ్ కు వెళ్లిపోయిన సంగతి తెలిసిందే. అక్కడే అనూహ్యంగా గాయపడ్డారు. ఇక ఆ తర్వాత హైదరాబాద్ నందినగర్ లోని ఇంట్లోనే ఉంటున్నారు. లోక్ సభ ఎన్నికల నాటికి గాయం నుంచి కోలుకున్న కేసీఆర్

### చీల్చి చెండాడేది ఎప్పుడు?

ప్రచారం కూడా చేశారు. ఇక జూలై ఆఖర్లో అసెంబ్లీకి తొలిసారిగా వచ్చారు. అంటే సరిగ్గా నెల రోజులు అవుతోంది. కానీ, ఆ తర్వాతి నుంచి బీఆర్ఎస్ అధినేత ప్రజలకు కనిపించలేదు. దీంతోనే కేసీఆర్ ఫాంహౌజ్ లో ఉన్నారా? హైదరాబాద్ లో ఉన్నారా? అని ప్రశ్నలు వేస్తున్నారు.

**ఏం వ్యూహాలు పన్నుతున్నారో?...** ఎన్ని విమర్శలు ఉన్నా కేసీఆర్ వ్యూహ చతురతను మెచ్చుకోకుండా ఉండలేం. తెలంగాణ ఉద్యమం తీవ్ర స్థాయిలో ఉన్న సమయంలో మెదక్ ఎంపీగా కూడా ఉన్న కేసీఆర్ తన ఫాంహౌజ్ నుంచే మొత్తం వ్యూహాన్ని నడిపించారు. ప్రత్యేక రాష్ట్రం ఖరారైన దశలోనే పార్లమెంటుకు వెళ్లారు. అందుకే కేసీఆర్ మౌనం.. ఓ భారీ వ్యూహానికి నేపథ్యం అనుకోవాలేమో..? అంతేకాదు.. కేసీఆర్ ఇప్పుడు చక్రబంధంలో ఉన్నారు. ఆయన పార్టీ నుంచి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వెళ్లిపోతున్నారు. స్వయంగా కుమార్తె కవిత జైల్లో ఉన్నారు. రాజకీయంగానూ కేసీఆర్ ను రేవంత్ ప్రభుత్వం టార్గెట్ చేసింది. మరోవైపు బీజేపీలో విలీనం చేస్తున్నారనే ఆరోపణలకు దిగుతున్నారు. ఇలాంటి సమయంలో ఒక అడుగు వెనక్కు వేయడమే ఉత్తమం అని ఆయన భావిస్తున్నట్లు సమాచారం. మరి కేసీఆర్ మళ్లీ ఎప్పుడు మనకు కనిపిస్తారో.. తనదైన శైలిలో మీడియా ముందు ప్రత్యర్థులను ఎలా ఆడుకుంటారో చూద్దాం..




## అధికార... ప్రతిపక్ష నేతలెవరు అడ్డుపడినా...

# తగ్గేదే లే..!

### దడ పుట్టిస్తున్న హైడ్రా నాన్‌స్టాప్ కూల్చివేతలు..

హైదరాబాద్: నగరంలో హైడ్రా కూల్చివేతలు ఆక్రమణదారుల గుండెల్లో దడపుట్టిస్తున్నాయి. వరసగా కూల్చివేతలు చేస్తూ అక్రమార్కుల గుండెల్లో హైడ్రా నిద్రపోతోంది. పేద, ధనిక, సినిమా స్టార్లు, రాజకీయ నేతలు ఇలా ఎవరినీ వదిలిపెట్టకుండా కబ్జాలకు అడ్డుకట్ట వేస్తోంది. ప్రభుత్వ స్థలాన్ని అంగులం ఆక్రమించిన తీవ్రంగా స్పందిస్తోంది. తాజాగా శేరిలింగంపల్లి మండలం రాయదుర్గంలో ప్రభుత్వ భూముల్లో వెలిసిన అక్రమ నిర్మాణాలను హైడ్రా అధికారులు కూల్చివేశారు. రాయదుర్గం సర్వే నంబర్ 3, 4, 5, 72లోని ప్రభుత్వ స్థలాల్లో అక్రమంగా కట్టిన భవనాలను కూల్చివేస్తున్నారు. అయితే తమకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా చర్యలు చేపట్టారంటూ జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులను స్థానికులు అడ్డుకున్నారు. తమ ఇళ్లను కూల్చవద్దంటూ ఆందోళనకు దిగారు. అధికారులతో స్థానికులు వాగ్వాదానికి దిగారు.

దీంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. అధికారుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి పోలీసులు భారీగా చేరుకున్నారు. పోలీసుల ఆధ్వర్యంలో కూల్చివేతల పర్వం సాగుతోంది. తెలంగాణ ప్రభుత్వ ఆస్తుల రక్షణ కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైడ్రా వ్యవస్థను తీసుకువచ్చారు. ప్రభుత్వ ఆస్తుల సంరక్షణే లక్ష్యంగా ఆ వ్యవస్థను ఏర్పాటు చేశారు. నగరంలో జనాభా పెరిగిపోతుండడంతో ఇష్టాను సారంగా చెరువులు, ప్రభుత్వ భూములు ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారు. సరైన పర్యవేక్షణ వ్యవస్థ లేకపోవడంతో ఇన్నాళ్లూ ఆక్రమణదారులు ఆడిందే ఆటగా, పాడిందే పాటగా సాగింది. హైడ్రా రావడంతో నగర పరిధిలో చర్యలు చేపడుతోంది. ఇటీవల సినీనటుడు నాగార్జునకు చెందిన మాదాపూర్‌లోని ఎన్ కన్వెన్షన్‌ను అధికారులు కూల్చివేశారు. కూల్చివేతలను అడ్డుకునేందుకు ఆయన హైకోర్టును సైతం ఆశ్రయించారు. అయితే ఈ లోపే అధికారులు దాన్ని నెలమట్టం చేశారు. మరోవైపు బీఆర్ఎస్ నేత, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డికి చెందిన అనురాగ్ యూనివర్శిటీపై కూడా ఆరోపణలు వచ్చాయి. అక్రమంగా భూములు కబ్జా చేసి నిర్మాణాలు చేశారంటూ ఆయనపై ఇప్పటికే పలు కేసులు నమోదు అయ్యాయి. మరోవైపు అధికార పార్టీ నేతలను సైతం హైడ్రా వదిలిపెట్టడం లేదు. ఇలా చిన్నా, పెద్ద తేడా లేకుండా హైడ్రా ఆక్రమణదారుల బెండు తీస్తోంది.

# సంపాదకీయం

## మోడీ అమిత్ షా కార్యకర్తలకు ఏమీ చేయలేదా
## అందుకే ఈ రిజల్ట్ ?

ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ బాగా దెబ్బ తింది. ఎక్కడ 370 సీట్ల టార్గెట్ మరెక్కడ 240 సీట్లు ఏకంగా 130 సీట్లు తేడా కొట్టింది. అంతే కాదు మ్యాజిక్ ఫిగర్ కి సరిపడా 273 సీట్లు కూడా తెచ్చుకోలేక చతికిలపడింది. దానికి కారణం బీజేపీ మీద జనాలకు మొహం మొత్తిందని అంతా అనుకున్నారు. అంతే కాదు బీజేపీ విధానాలను కూడా నచ్చుకోవడం లేదు అనుకున్నారు. పదేళ్ళ పాటు అధికారంలో ఉన్న బీజేపీ పెద్దగా ప్రజలకు చేసింది ఏదీ లేదని భావించి ఈ ఫలితాలు వచ్చాయని కూడా అంతా విశ్లేషించారు. అయితే ఇది కూడా నిజమే దీనితో పాటు మరో నిజం కూడా ఆలస్యంగా వెలుగు చూస్తోందా అన్న చర్చ సాగుతోంది. బయట జనాలతో పాటు పార్టీ జనాలు కూడా బీజేపీ పెద్దల మీద గుస్సా అయ్యారా అందుకే ఈ రిజల్ట్ వచ్చిందా అన్న కొత్త చర్చకు తెర లేస్తోంది. బీజేపీ జనాలు ఎపుడూ పార్టీని అమితంగా ప్రేమిస్తారు. వారు ఎపుడూ పార్టీ స్టాండ్ కి భిన్నంగా పోరు. కానీ నరేంద్ర మోడీ అమిత్ షా జమానాలో బీజేపీ రూపూ షేపూ మారిపోయాయని చర్చ కూడా సాగింది. బీజేపీలో వ్యక్తి పూజ అధికం అయింది. దాంతో పాటు బీజేపీలో పార్టీ జనాలను కీలక నేతలను కూడా పెద్దగా పట్టించుకోలేదు అన్న మాట ఇప్పటిదాకా అక్కడక్కడ వినిపిస్తూ వచ్చింది. మరి పదేళ్ల బీజేపీ ఏలుబడి మీద పార్టీ జనాలకు కూడా ఈ తీరు వ్యహారం చూసి విసుగెత్తిందేమో ఈసారి ఎన్నికల్లో కొంచెం తేడాగానే పనిచేసారు అని అంటున్నారు. దానికి నిదర్శనమే సోషల్ మీడియాలో బీజేపీ సైన్యం బాగా నీరసించింది అని అంటున్నారు. అది కూడా సరిగ్గా ఎన్నికల వేళ అంతా కురుక్షేత్ర యుద్ధానికి సమాయత్తం అవుతున్న వేళ డూ ఆర్ డై బాటిల్ కి రంగం సిద్ధం అయిన వేళ బీజేపీ సోషల్ మీడియా మిలటరీ పెద్దగా ఫోకస్ పెట్టలేదా అన్న చర్చ సాగుతోంది. ఎందుకు అంటే కాంగ్రెస్ సోషల్ మీడియా సైన్యం అయితే వీర విహారమే చేసింది. అందులో నాలుగవ వంతు మాత్రమే బీజేపీ సైన్యం సోషల్ మీడియా ఫైట్ ఇచ్చింది అంటే అశ్చర్యపోవాల్సిందే. బీజేపీకి సోషల్ మీడియా అతి పెద్ద ఊపిరి. మోడీ 2014లో అధికారంలోకి అలాగే వచ్చారు. 2019లో అయితే దేశానికి రక్షకుడిగా సోషల్ మీడియా చితీకరించింది. ఇపుడు 2024 ఎన్నికల్లో మాత్రం మోడీ ప్రభుత్వాన్ని సరిగ్గా కాస్కో లేకపోయింది అని అంటున్నారు. దాంతో కాంగ్రెస్ అప్పర్ హ్యాండ్ అయింది. ఆ వివరాలు చూస్తే ఏడాది మార్చి 16 నుంచి మే 30 వరకూ అంటే నోటిఫికేషన్ వచ్చిన దగ్గర నుంచి దాదాపుగా ఎన్నికలు పూర్తి అయ్యేంతవరకూ ఒక నెలన్నర రోజులలో కాంగ్రెస్ సోషల్ మీడియాలో అదర గొట్టేసింది. ఈ సమయంలో కాంగ్రెస్ కి యూట్యూబ్ లో 61.3 కోట్ల వ్యూస్ వచ్చాయి. అదే బీజేపీకి మాత్రం 15 కోట్ల వ్యూస్ మాత్రమే వచ్చాయి. అలాగే ఎక్స్ లో కాంగ్రెస్ 2500 నుంచి 3000 దాకా లైక్స్ వచ్చాయి. ఇక బీజేపీకి ఎక్స్ లో 260 నుంచి 300 మాత్రమే లైక్స్ వచ్చాయంటే ఇది పది శాతంగా ఉంది అన్న మాట. ఇక ఇన్స్టాగ్రాం లో కాంగ్రెస్ కి 1.22 లక్షల లైక్స్ రాగా బీజేపీకి వచ్చినవి కేవలం 22,945 లైక్స్ మాత్రమే. దీనిని బట్టి చూస్తే కాంగ్రెస్ సోషల్ మీడియా సైన్యం ఎంత సిన్సియర్ గా పనిచేసింది అన్నది అర్థం అవుతోంది. అదే బీజేపీ మాత్రం వెనకబడిపోయింది అని నటున్నారు. దీనిని చూసిన వారు మోడీ అమిత్ షా బీజేపీ కార్యకర్తలకు ఏమీ చేయలేదా అని సెటైర్లు వేస్తున్నారు. బీజేపీ అంటేనే సిద్ధాంత బద్ధమైన పార్టీ. అలాంటి పార్టీలో ఈ నీరసత్వం నిస్సత్తువ కచ్చితంగా చర్చనీయాంశాలు. ఇదే తీరున బీజేపీ సోషల్ మీడియా వైఖరి కనుక ఉంటే రానున్న రోజులలో మరింత దెబ్బ పడుతుంది అని అంటున్నారు. దీనిని బట్టి బీజేపీ పెద్దలు చక్కదిద్దుకునేలా చర్యలు చేపడతారేమో చూడాల్సి ఉంది.



## జైలు నుంచి కవిత విడుదల



దిల్లీ: తిహాడ్ జైలు నుంచి ఎమ్మెల్సీ కవిత విడుదలయ్యారు. దిల్లీ మద్యం పాలసీ కేసులో ఆమెకు సుప్రీంకోర్టు ద్విసభ్య ధర్మాసం బెయిల్ మంజూరు చేసింది. పూచీకత్తు బాండ్లను ఆమె భర్త అనిల్, భారాస ఎంపీ వద్దిరాజు రవిచంద్ర దిల్లీ రౌస్ అవెన్యూ కోర్టుకు సమర్పించారు. ఈ పూచీకత్తులను ఆమోదించిన రౌస్ అవెన్యూ కోర్టు.. కవితను విడుదల చేయాలంటూ తిహాడ్ జైలు అధికారులకు వారెంట్ జారీ చేసింది. దీంతో మంగళవారం రాత్రి జైలు నుంచి విడుదలయ్యారు. మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, భారాస నాయకులు జైలు వద్దకు చేరుకుని స్వాగతం పలికారు. కవితను హత్తుకుని ఆమె భర్త అనిల్, కుమారుడు, కేటీఆర్ భావోద్వేగానికి గురయ్యారు. బుధవారం మధ్యాహ్నం 2.45 గంటలకు కవిత హైదరాబాద్ రానున్నారు.

**జైలుకు పంపి నన్ను జగమొండిని చేశారు: కవిత...** తిహాడ్ జైలు నుంచి విడుదలైన తర్వాత కుటుంబ సభ్యులు, భారాస నేతలను చూసి కవిత భావోద్వేగానికి గురయ్యారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడారు. పిల్లలను వదిలి ఐదున్నర నెలలు జైలులో ఉండటం ఇబ్బందికర విషయమన్నారు. "నేను కేసీఆర్ బిడ్డను.. తప్పు చేసే ప్రసక్తే లేదు. మొండిదాన్ని.. మంచిదాన్ని. అనవసరంగా నన్ను జైలుకు పంపి జగమొండిని చేశారు. నన్ను నా కుటుంబాన్ని ఇబ్బందులకు గురిచేసిన వారికి వడ్డీతో సహా చెల్లిస్తాం. చట్టబద్ధంగా నా పోరాటం కొనసాగిస్తా. క్షేత్ర స్థాయిలో మరింత నిబద్ధతగా పనిచేస్తాం" అని కవిత అన్నారు. కష్ట సమయంలో తన కుటుంబానికి తోడుగా ఉన్నవారికి ధన్యవాదాలు తెలిపారు.

## సామాజిక మాధ్యమం.. నేరాల వలయం



హైదరాబాద్: రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు.. పరువు తీసేలా మార్ఫింగ్ ఫొటోలు.. కన్నీరు కురిపించే కట్టుకథలు. ఆపదలో ఉన్నానంటూ కల్లబొల్లి కబుర్లు.. అంశం ఏదైనా లక్ష్యం మాత్రం అందినంత దండుకోవటం. కుదరకుంటే అవతలి వారిని మానసికంగా దెబ్బతీయటం. వీటికి సామాజిక మాధ్యమాలు వేదికగా మారాయి. దూరాలను దగ్గర చేసిన ఈ వేదికలు ప్రస్తుతం నేరవలయంగా తయారయ్యాయి. సామాన్యుల నుంచి సంపన్నుల వరకు అందరూ బాధితులవుతున్నారు. నగర సైబర్ క్రైమ్ ఠాణాలో ఈ ఏడాది ఇప్పటివరకూ 1400కుపైగా సైబర్‌నేరాల కేసులు నమోదు చేశారు. వీటిలో 400కుపైగా ఫిర్యాదులు సామాజిక మాధ్యమాల వేదికగా చోటుచేసుకున్నవే.

**రూటు మార్చిన మాయగాళ్లు**

రాజస్థాన్ భరత్‌పూర్ కేంద్రంగా సైబర్ నేరస్థులు గతంలో సినీ, రాజకీయ, ప్రభుత్వ ఉన్నతాధికారుల ఫోన్‌నెంబర్లు, ఫొటోలను ఉపయోగించుకొని సొమ్ము కొట్టేసేవారు. ప్రముఖుల ఫొటోలను వాట్సాప్ డీపీగా ఉపయోగించి ఫేస్‌బుక్, వాట్సాప్ ద్వారా వారి పేర్లతో తాము అత్యవసర పరిస్థితుల్లో ఉన్నామని.. డబ్బు కావాలంటూ నగదును తమ బ్యాంకు ఖాతాల్లోకి జమ చేయించుకునేవారు. వీటిపై అవగాహన పెరగటంతో ఇప్పుడు రూటు మార్చారు. అందమైన యువతుల నగ్న వీడియోల లింక్‌లను వాట్సాప్ నెంబర్లకు పంపుతున్నారు. పూర్తి వీడియో చూడాలనే ఆసక్తితో లింక్‌లను క్లిక్ చేసిన వారి వాట్సాప్ ఖాతాలు సైబర్ నేరస్థుల చేతుల్లోకి వెళుతున్నాయి. బాధితులు తమ ఖాతాలను పునరుద్ధరించుకునే అవకాశం లేకపోవటాన్ని అవకాశంగా చేసుకుంటున్నారు. అందులోని కాంటాక్టు నెంబర్లకు సందేశాలు పంపి ఆసుపత్రిలో ఉన్నామని, దూరప్రాంతాలకు వెళితే అక్కడ నగదు చోరీ అయినట్టు మాయమాటలతో బాధితుల స్నేహితులు, బంధువుల నుంచి నగదు కాజేస్తున్నారు. తెలిసిన నెంబర్ నుంచే సందేశం రావటంతో తేలికగా నమ్ముతున్నారు.

**ఫేస్‌బుక్ ఖాతాలతో విచిత్రాలెన్నో**

వాడకంలోని లేని ఫేస్‌బుక్ ఖాతాలు మరుగున పడుతుంటాయి. వీటిని హ్యాక్ చేసిన నైజీరియన్లు ఫ్రెండ్స్ జాబితాలోని వారి నుంచి నగదు వసూలు చేస్తున్నారు. కొన్నిసార్లు నగ్న ఫొటోలు, వీడియోలు ఉంచి బెదిరింపులకు పాల్పడుతున్నారు. ఖాతాలను తొలగిస్తే చాలంటూ బాధితులు పోలీసులను ఆశ్రయిస్తున్నారు. దుబాయ్, సింగపూర్ తదితర దేశాల్లో ఉంటూ స్థానిక యువతకు డబ్బు పంపి సామాజిక మాధ్యమాలు, యూట్యూబ్ ఛానళ్లు నడుపుతున్న ప్రబుద్ధులున్నారు. సున్నితమైన విషయాలను రెచ్చగొట్టేలా వీడియోలు, పోస్టులు రూపొందించడమే వీరి ఎజెండా. గతేడాది నగరంలో రెండు వర్గాల మధ్య గొడవలు పెట్టేందుకు దుబాయ్ నుంచి ఇదే తరహా ఎత్తులు వేసిన పాతబస్తీ యువకుడిని ఇటీవలే పోలీసులు అరెస్ట్ చేశారు. టెలిగ్రాం, ఇన్‌స్టా ఉపయోగించేవారు క్రమంగా పెరుగుతున్నారు. ఈ యాప్‌లను వేదికగా మలచుకొని ముంబయి, బెంగళూరు, దిల్లీకి చెందిన డ్రగ్స్ ముఠాలు లావాదేవీలు నిర్వహిస్తున్నాయి. ఇటీవల టీజీన్యాబ్‌కు పట్టుబడిన ముఠాల్లో అధికభాగం వీటి ద్వారా డ్రగ్స్ సరఫరా చేస్తున్నట్టు అంగీకరించారు.

## శునకం.. జనములో కలవరం



కరీంనగర్ : ఒకప్పుడు వీధుల్లో కుక్కలు కనిపిస్తే పెద్దగా పట్టించుకోని జనం ఇప్పుడు అవి కనిపిస్తే భయపడుతున్నారు.. వాటి పక్క నుంచి వెళ్లడానికి జంకుతున్నారు.. రోడ్డుపై నడిచే వారిని.. ద్విచక్ర వాహనదారులపై అవి క్రూరంగా దాడి చేస్తుండటమే అందుకు కారణం.. ఉమ్మడి జిల్లాలో రోజూ ఎక్కడో ఒకచోట కుక్కల దాడి ఘటనలు జరుగుతున్నా.. స్థానిక సంస్థల పాలకవర్గాలు.. అధికారులు చూసీచూడనట్లు ఉంటున్నారు.. ఈ నేపథ్యంలో వీధి కుక్కలను నియంత్రించాలని.. వాటి దాడి నుంచి జనాన్ని రక్షించే చర్యలు చేపట్టాలని హైకోర్టు ఆదేశాలివ్వడంతోనైనా పరిస్థితి మారేనా అని ఉమ్మడి జిల్లావాసులు ఆశగా ఎదురు చూస్తున్నారు.. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు కరీంనగర్ జనరల్ ఆస్పత్రికి 570 మంది కుక్క కాటు బాధితులు వచ్చి చికిత్స అందుకున్నారు. ఇక ప్రైవేటు ఆస్పత్రులతోపాటు పల్లెల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వెళున్న వారి సంఖ్య మరో 600కుపైగా ఉంటోంది. ఒక్క జిల్లాలోనే గడిచిన ఆరు నెలలుగా 1,170 కేసులున్నాయి. నాలుగు జిల్లాల పరిధిలో దాదాపుగా 4500ను దాటుతున్నాయి. అనధికారికంగా ఈ సంఖ్య దాదాపుగా రెండింతలుంటోంది. సగటున రోజుకు 50 మంది వరకు ఏదో ఒక చోట గ్రామసింహాల కారణంగా గాయపడుతున్నారు.

కుక్క కరిచినప్పుడు కచ్చితంగా 5 ఇంజక్షన్లు తీసుకోవాల్సి వస్తుంది. దీంతో ఆర్థికంగా పలు కుటుంబాలు నష్టపోతున్నాయి. తీవ్రగాయాలైనప్పుడు హుటాహుటిన ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్తున్నారు. కుట్లు వేయాల్సిన సందర్భాల్లో చికిత్స ఖర్చు రూ.వేలల్లో ఉంటోంది. ప్రభుత్వాసుపత్రిలో ఉచితంగా యాంటీ రేబిస్ వ్యాక్సిన్ ఇస్తున్నా అందుబాటులో ఉన్న ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్తుండటంతో ఒక్కో ఇంజక్షన్‌కు రూ.300 నుంచి రూ.350 వరకు వెచ్చించాల్సి వస్తోంది. తీవ్రంగా గాయమైనప్పుడు యాంటీరాబిస్ ఇమినోగ్లోబిన్ సూది మందుకు రూ.6 వేల వరకు ఖర్చవుతోంది.

**నియంత్రణ లేదు.. టీకా రాదు**

కుక్కల సంతాన నియంత్రణకు శస్త్ర చికిత్సలు జరగడం లేదు. దీంతో వాటి సంతతి విపరీతంగా పెరుగుతోంది. గతంలో కొన్నిచోట్ల వీటి సంతతి పెరగకుండా చర్యలు చేపట్టినా.. నిధుల లేమితో నిలిపేశారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో ఎక్కడా ఈ ప్రక్రియ జరగడం లేదు. మరోవైపు వీధుల్లో సంచరించే శునకాలకు ముందస్తు వ్యాక్సిన్ వేస్తే జనం రేబిస్ బారిన పడకుండా ఉంటారు. ఒక శునకానికి మొదటి, రెండు డోసుల వ్యాక్సిన్ వేస్తే ఏడాది వరకు పనిచేస్తుంది. పంచాయతీలు, పురపాలికల్లో ఇందుకు ప్రత్యేక నిధులు లేవు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల నుంచి నిధులు రావు. దీంతో స్థానిక ప్రతినిధులు పట్టించుకోవడం లేదు. పురపాలిక, పంచాయతీ, వెటర్నరీ అధికారులు సమన్వయంతో సాగి కుక్కల సంతాన నియంత్రణ, వ్యాక్సిన్‌పై నిర్ణయం తీసుకుంటే జనానికి ఇబ్బంది తగ్గుతుంది.

**వీధి కుక్కలతో ప్రమాదం**

ఇటీవల వీధి కుక్కల వల్ల ప్రమాదం పెరుగుతోంది. పెంపుడు కుక్కలకు యజమానులు కచ్చితంగా వ్యాక్సిన్ వేయిస్తున్నారు. దీంతో వాటితో ముప్పు ఉండటం లేదు. బయట తిరిగే వాటితో జనం జాగ్రత్తగా మెలగాలి. వర్షాలు పడిన తరువాత వాటి మానసిక పరిస్థితిలో మార్పు వస్తుంటుంది. అందుకనే అవి కనిపించిన వారిని కరుస్తుంటాయి.డాక్టర్ కిరణ్, వెటర్నరీ వైద్యుడు, కరీంనగర్

**సత్వర చికిత్స మేలు**

కుక్క కరిచిన వెంటనే నిర్లక్ష్యం చేయకుండా ఆస్పత్రికి తరలించాలి. అలా చేయడం వల్ల రేబిస్ ముప్పును చాలావరకు తప్పించుకునే వీలుంది. గతంలో పోలిస్తే చిన్నారులపై కుక్కల దాడులు పెరుగుతున్నాయి. వాటిని చూడగానే పరుగెత్తొద్దు. దీంతో మరింత క్రూరంగా ప్రవర్తిస్తూ గాయపరుస్తున్నాయి. రేబిస్ సోకిన కుక్కలతో జాగ్రత్తగా ఉండాలి. శరీరంపై పుండ్లు ఉన్న వ్యక్తులను కుక్క నాకినా.. కచ్చితంగా వ్యాక్సిన్ తీసుకోవాలి.
డాక్టర్ అజయ్, పిల్లల వైద్య నిపుణులు, కరీంనగర్ జనరల్ ఆస్పత్రి

**ఎందుకింత క్రూరంగా..**

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మాంసం విక్రయాలు విపరీతమయ్యాయి. పట్టణాల్లో మాంసం దుకాణదారులు ఇష్టం వచ్చినట్లుగా వ్యర్థాలను పడేస్తుండగా కుక్కలు వాటికి అలవాటు పడుతున్నాయి. ఆ ఆహారం దొరకని సమయంలో పిచ్చిగా ప్రవర్తిస్తూ మనుషులపై దాడికి పాల్పడుతున్నాయి.
గ్రామాల్లో కోళ్ల ఫారాల సంఖ్య పెరిగింది. అక్కడ నిత్యం మృతి చెందిన కోళ్లను ఇవి తింటూ ఆ ఆహారానికి అలవాటు పడ్డాయి. వరుసగా రెండు, మూడు రోజులు దొరకని సమయంలో ఆకలి తీర్చుకునేందుకు కనిపించిన వారిని కరుస్తున్నాయి.
నీడ పట్టున సేద తీరుతున్న వాటిని వెళ్లగొడితే అవి వికృతంగా ప్రవర్తిస్తుంటాయి. నిద్రలో నుంచి లేచి ఆ కసితో కనిపించిన వారిపై ప్రతీకారాన్ని తీర్చుకుంటాయని వెటర్నరీ వైద్య నిపుణులు చెబుతున్నారు.





## శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద ఘనంగా అన్న ప్రసాద వితరణ

శామీర్ పేట, (గరుడ వార్త) : శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద ఘనంగా అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. మండల కేంద్రం శామీర్ పేట లోని శ్రీ రేణక ఎల్లమ్మ ఆలయం వద్ద మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద సిద్దిపేట జిల్లా వర్గల్ మండలానికి చెందిన తాళ్ల శ్రీనివాస్ గౌడ్, మంజులత దంపతులు, అల్వాల్ ప్రాంతానికి చెందిన ప్రేమలత, తుంకుంటకు చెందిన నర్సింగ్ గౌడ్, రమేష్ ప్రసాద్ రాజు, శామీర్ పేట గౌడ సంఘంల ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు. వివిధ గ్రామాల భక్తులు, మాజీ ప్రజా ప్రతినిధులు, రాజీవ్ రహదారి పై వెళ్లే భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు.

## సర్వేలతోనే సరి.. విస్తరణ ఎప్పుడో మరి?

వేములవాడ: ఆధ్యాత్మిక క్షేత్రమైన వేములవాడ పట్టణంలోని రోడ్లు విస్తరణకు నోచుకోవడం లేదు. దీంతో ఏ మార్గంలో వెళ్లినా ఎక్కడ ట్రాఫిక్‌లో చిక్కుకుంటామోనని భక్తులు, స్థానికులు భయపడుతున్నారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కావడంతో ప్రతిరోజు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల భక్తులతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి స్వామివారి దర్శనానికి వస్తుంటారు. దీంతో ఆలయ పరిసరాల రోడ్లు పద్మవ్యూహాన్ని తలపిస్తుంటాయి. భక్తులు, స్థానికులు పడే ఇబ్బందులను తొలగించేందుకు రాజన్న ఆలయం నుంచి వంతెన వరకు, మరో వైపు పోలీస్ స్టేషన్ వరకు రహదారి విస్తరించాలనే ప్రతిపాదనకు మోక్షం లభించడం లేదు. ఇందుకు సంబంధించి 2023 ఫిబ్రవరిలో ప్రధాన రహదారిని సర్వే చేసి నివేదిక సిద్ధం చేసినా ఇప్పటి వరకు పనుల్లో కదలిక లేదు. ఆర్టీసీ బస్టాండ్‌లో దిగిన భక్తులు వంతెన మీదుగా ఆలయానికి చేరుకోవడం.. స్వామివారి దర్శనం అనంతరం ఇదే ప్రధాన దారి మీదుగా బస్టాండ్‌కు వెళ్తుంటారు. ఇలాంటి రోడ్డు ఇరుకుగా ఉండటంతో తరచూ ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతుంటాయి.

**పరిహారం పంపిణీకి అంచనాలు..**



గత ప్రభుత్వ హయాంలో రాజన్న ఆలయం నుంచి మూలవాగు వంతెన వరకు దాదాపు 80 అడుగుల వెడల్పుతో రోడ్డును విస్తరించాలని ఆర్‌అండ్‌బీ, రెవెన్యూ, వేములవాడ టెంపుల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (వీటీఏడీఏ), సర్వే బృందం సర్వే చేసి ఏ మేరకు గృహాలు నష్ట పోతున్నాయనేది గుర్తించి మార్కింగ్ చేశారు. దాదాపు 255 గృహాల వరకు నష్టపోతున్నట్లు అధికారులు గుర్తించారు. రోడ్ల విస్తరణలో నష్టపోయే గృహాల యజమానులకు పరిహారం అందించేందుకు దాదాపు రూ.35 కోట్లతో అధికారులు అంచనాలు సిద్ధం చేశారు. నిధులు రాకపోవడంతో పనులు మొదలు కావడం లేదు. సర్వే చేసి ఏడాదిన్నర కాలం కావస్తున్నా పనుల్లో జాప్యంతో పట్టణ ప్రజల్లో తీవ్ర నిరసన వ్యక్తం అవుతోంది. ఇప్పటికైనా రోడ్ల విస్తరణ పనులు చేపట్టాలని ప్రజలు, భక్తులు కోరుతున్నారు.

నిధులు విడుదలవక పనుల్లో జాప్యం రాజన్న ఆలయం ముందు నుంచి వంతెన వరకు రోడ్డు విస్తరణకు సర్వే చేసి అంచనాలు సిద్ధం చేశాం. దాదాపు 255 ఇళ్ల వరకు నష్టపోతున్నాయి. వాటికి రూ.35 కోట్ల వరకు పరిహారం ఇవ్వాల్సి ఉంది. నిధులు విడుదలవుతేనే పనులు చేపట్టడానికి అవకాశం ఉంది. అందుకే విస్తరణ పనుల్లో జాప్యం జరుగుతోంది.సత్యనారాయణ, ఎస్టేట్ అధికారి వీటీఏడీఏ

# చిన్న మార్పుతో చిన్ని ప్రాణులకు మేలు

హైదరాబాద్: విద్యుత్తు అంతరాయాలకు సాంకేతికత లోపాలు, గాలులు, వర్షాలతోపాటు కొన్నిసార్లు చిన్ని మూగజీవాలు కారణమవుతున్నాయి. బల్లి, పిల్లి, పావురం, ఉడతల వంటివి విద్యుత్తు లైన్లపై పాకినప్పుడు, గెంతినప్పుడు విద్యుదాఘాతంతో అవి చనిపోవడంతోపాటు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుంది. విద్యుత్తు పరికరాల్లో చిన్న మార్పుతో చిన్ని ప్రాణులకు ముప్పు తప్పించడంతోపాటు కరెంట్ చిక్కులు తొలగించే ప్రయత్నం చేసింది విద్యుత్తు పంపిణీ సంస్థ. విద్యుత్తు ఫీడర్ల ట్రిప్పింగ్‌కు గల కారణాలపై విద్యుత్తు పంపిణీ సంస్థ చేపట్టిన సమీక్షల్లో విస్తుపోయే విషయాలు వెల్లడయ్యాయి. లైన్లపై చిన్ని జీవుల కదలికలే 14 శాతం అంతరాయాలకు కారణమవుతున్నాయని



గ్రహించిన దక్షిణ తెలంగాణ విద్యుత్తు పంపిణీ సంస్థ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ చిన్న మార్పును సూచించారు. విద్యుత్తు పరికరాల్లో హార్న్ గ్యాప్(హెచ్‌జీ) ఫ్యూజ్ వద్ద మెటల్ క్లాంప్‌లు వినియోగిస్తున్నారు. దీనిపై కొంత అధ్యయనం, ఇంజినీర్లతో చర్చించిన అనంతరం వీటి స్థానంలో ప్రత్యేకంగా రూపొందించిన ఫైబర్ రీఇన్‌ఫోర్స్‌డ్ పాలిమర్(ఎఫ్ఆర్‌బీ) సిలికాన్ క్లాంప్‌లను ఏర్పాటు చేయాలని సీఎండీ సూచించారు. ఇవి విద్యుత్తు వాహకంగా పనిచేయనందున మూగజీవాలు వాటి మీదుగా పాకినా వాటితోపాటు లైన్లకు సమస్య ఉండదని సూచించి వీటిని ఏర్పాటు చేస్తున్నారు. ముందుగా ఈ చిన్నిజీవుల బెడద అధికంగా ఉన్న ప్రాంతాల్లో 3 వేల సిలికాన్ క్లాంప్‌లను ఫ్యూజ్, బ్రేకర్లు, లింబ్స్ వంటి చోట ఏర్పాటు చేయనున్నారు.

# జిల్లాకు కావాలి ఓ హైడ్రా

సిరిసిల్ల: గొలుసుకట్టు చెరువుల శిఖం.. వాటి కాల్వల కబ్జాలకు అడ్డులేదు. దీంతో చెరువుల విస్తీర్ణం కుంచించుకుపోతోంది. భారీ వరదలకు లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయి. జిల్లాలో సిరిసిల్ల, వేములవాడ రెండు పురపాలికల్లో 25 చెరువులు ఆక్రమణలకు గురయ్యాయి. కొన్నిచోట్లయితే ఏకంగా మట్టితో చదునుచేసి ప్లాట్లుగా విక్రయించేశారు. ఇదంతా అధికారుల దృష్టికి వెళ్లినా.. చర్యలు ఉండవు. ఇలాంటివి నియంత్రించేందుకు హైదరాబాద్ మహానగరంలో హైడ్రా (హైదరాబాద్ డిజాస్టర్ రిలీఫ్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ)ని నియమించారు. దీని నిర్వహణకు ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.200 కోట్లు కేటాయించింది. జిల్లాలోనూ హైడ్రా లాంటి కఠిన చర్యలు తీసుకునే స్వయంప్రతిపత్తి సంస్థ అవసరమనే డిమాండ్ వినిపిస్తోంది. పరిరక్షణ వదిలేశారు

మిషన్ కాకతీయ పథకంలో గత ప్రభుత్వం ప్రతి చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిని గుర్తించింది. ప్రతి చెరువుకు జియో ఐడీలను నమోదు చేసి వాటి విస్తీర్ణం, ఆయకట్టు వివరాలను నమోదు చేశారు. తర్వాత వీటి నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో, అభివృద్ధిపేరుతో ఆక్రమణలు పెరిగి చెరువుల్లో నిర్మాణాలు వెలుస్తున్నాయి. వర్షాలకు కాలనీలు ముంచెత్తడంతో పలువురు సామాజిక కార్యకర్తల నుంచి ఫిర్యాదులు వెళ్లాయి. దీనిపై రెవెన్యూ, నీటిపారుదలశాఖలు సంయుక్తంగా సర్వేచేసి హద్దులు నిర్ణయించాలని గత ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కాగా దానిలో సరైన విధివిధానాలు, దానికి అవసరమయ్యే నిధుల కేటాయింపులో స్పష్టతలేకపోవడంతో అవి బుట్టదాఖలయ్యాయి. సమస్యపై సిరిసిల్ల పురపాలిక కమిషనర్ మీర్జా ఫసహత్ ఆలీ బేగ్‌ను సంప్రదించగా.. ఆక్రమణలను గుర్తించామని, తొలగించేందుకు ప్రభుత్వానికి నివేదించామని తెలిపారు.

ఇదీ పరిస్థితి

ఈదుల చెరువులో నిర్మాణం

సిరిసిల్ల పట్టణంలోని ఈదుల చెరువు 160 ఎకరాలు. శిఖంలో నిర్మాణ వ్యర్థాలతో చదును చేస్తూ ఆక్రమించి ఇంటి నిర్మాణాలు వెలుస్తున్నాయి. ప్రస్తుతం 70 ఎకరాలకు చేరింది. పట్టణంలో రెండో బైపాస్ రహదారి నిర్మాణంతో వరదనీటి కాల్వలు నామరూపాల్లేకుండా పోయాయి. ఎగువ నుంచి భారీ వరద వస్తే రాజీవ్‌నగర్, ముష్టిపల్లిలోని లోతట్టు ప్రాంతాలు నీటమునుగుతాయి.

సిరిసిల్ల – కామారెడ్డి ప్రధాన రహదారికి అనుకుని ఉన్న కార్గిల్‌లేక్ (వర్ధనికుంట) విస్తీర్ణం 60 ఎకరాలు. దీనిలో శిఖం ఆక్రమణలతో 30 ఎకరాలకు కుంచించుకుపోయింది. దీనికి మత్తడి కాల్వపై సాయినగర్, నెహ్రూనగర్‌లో నిర్మాణాలు వెలిశాయి. ఏకధాటిగా వర్షాలు కురిస్తే వరదనీరు వెళ్లక కాలనీలను ముంచెత్తుతోంది. వెంకంపేట, నెహ్రూనగర్ మత్తడి కాల్వలపై ఉన్న ఆక్రమణలను తొలగించేందుకు 2021లో పురపాలిక చర్యలు చేపట్టింది. కొంతమేరకు రాగానే అధికారులపై రాజకీయ ఒత్తిళ్లు పెరగడంతో నిలిపేశారు.సిరిసిల్లలోని కొత్తచెరువు సుందరీకరణ కోసం అయిదెకరాల వరకు మట్టితో నింపారు. దీంతో చెరువు విస్తీర్ణం తగ్గింది. దీనికి మూడు మత్తడి కాల్వలు ఉన్నాయి. ఇవి తుమ్మలకుంట చెరువు వరకు ఉండాలి. దీనిలో రెండు కాల్వలు పూర్తిగా ఆక్రమణలకు గురయ్యాయి. ఉన్న ఒక్కకాల్వతో వరద వెళ్లలేని పరిస్థితి. మూడేళ్ల క్రితం పురపాలకశాఖ ఆధ్వర్యంలో శ్రీనగర్ కాలనీ, శాంతినగర్ మీదుగా ఒక కాల్వను తవ్వారు. ఇక్కడ రూ.15 కోట్లతో శాశ్వతంగా సీసీ కాల్వ నిర్మించేందుకు అధికారులు బడ్జెట్ కేటాయించారు. దీని పరిధిలో ప్రైవేటు ప్లాట్లు కోల్పోయిన వారికి నష్టపరిహారం ఇచ్చేలా ఉత్తర్వులు కూడా వెలువరించారు. ప్లాటు యజమానులు అభ్యంతరం చెప్పడంతో పనులు అక్కడే ఆగిపోయాయి.వేములవాడ గ్రామీణ మండలం మల్లారంలో మూలవాగు చెక్‌డ్యాం నుంచి వచ్చే వరద కాల్వ గుడిచెరువులోకి చేరుతుంది. దీని పొడువునా ఆక్రమణలకు గురైంది. పంటపొలాలు ఉన్న చోట నీరు పోలాల మీదుగా ప్రవహిస్తోంది. పట్టణంలోకి వచ్చేసరికి వరదంతా లోతట్టు ప్రాంతాలైన ఓల్డ్ అర్బన్ కాలనీ పరిసర ప్రాంతాలు ముంపునకు గురవుతాయి. మరోవైపు మర్రిపల్లి, నాగయ్యపల్లి, గొర్లకుంట చెరువు, కోనాయపల్లిలోని కొత్తచెరువుల నుంచి వచ్చే వరద కాల్వ గుడిచెరువులో కలుస్తుంది. ఇక్కడ సబ్‌స్టేషన్ సమీపంలో వరద కాల్వలను కప్పేసి ప్లాట్లుగా చేశారు.

# అఆలు నేర్చుకోవాలన్నా.. ఐఏఎస్ కావాలన్నా



సుల్తాన్‌బజార్ : కోఠి పుస్తక మార్కెట్‌ది 60 ఏళ్ల చరిత్ర. ఇక్కడ దొరకని పుస్తకమంటూ ఉండదు. వినియోగదారులకు ఇచ్చే భారీ డిస్కౌంట్‌తో పాటు పాత పుస్తకాలు దొరకడమే ప్రత్యేకత. ఎల్‌కేజీ నుంచి పీజీ, సివిల్స్, మెడిసిన్, ఇంజినీరింగ్, పోటీ పరీక్షలు, ఆధ్యాత్మికం.. ఇలా ఏది కావాలన్నా ఉంటాయి. సర్కారు జాబ్ క్యాలెండర్ విడుదల చేయడంతో డిమాండ్ పెరిగింది.

అన్నీ రకాలు అందుబాటులో..

పోటీ పరీక్షలతో పాటు మెడికల్, ఇంజినీరింగ్, పబ్లిషర్స్ పుస్తకాలు ఇక్కడ దొరకడం ప్రత్యేకత. 20 ఏళ్ల క్రితం నాటి సిలబస్ పుస్తకాలు కూడా లభిస్తాయి. పరీక్షల్లో ఫెయిలైన తర్వాత ఉద్యోగంలో చేరి... ఆ తర్వాత చదువును పక్కన పడేస్తారు. ఇలాంటి వారి కోసం కొన్నిసార్లు ప్రభుత్వాలు పరీక్షలు రాసుకునేందుకు అవకాశం కల్పిస్తాయి. అప్పుడు పరీక్షలు రాసే వారికి పాత సిలబస్ పుస్తకాలు అవసరమైతే కోఠి సెకండ్ హ్యాండ్ మార్కెట్‌ను ఆశ్రయించాల్సిందే. సివిల్స్, ఆర్ఆర్‌బీ, స్టాఫ్ సెలక్షన్ కమిషన్, టీఎస్‌పీఎస్సీ, ఏపీపీఎస్సీలతో పాటు టెట్, డీఎస్సీ పుస్తకాలు అందుబాటులో ఉంటాయి.

చిన్న దుకాణాల్లో వేల పుస్తకాలు ఎలా దొరుకుతాయి అని అనుకుంటున్నారా.. నిర్వాహకులు సమీపంలో గోదాములు ఏర్పాటు చేసుకుంటారు. కోర్సులు ప్రారంభమైనప్పుడు పుస్తకాలు ఇక్కడికి తీసుకొస్తారు.

మూడు తరాల బంధానికి.. అనుబంధం

డిగ్రీ, పీజీ విద్యార్థులు అధిక సంఖ్యలో పుస్తకాల కొనుగోలుకు మార్కెట్‌కు వస్తుంటారు. తాత, నాన్న, కుమారుడు... ఇలా మూడు తరాలకు చెందిన కుటుంబసభ్యులు పుస్తక మార్కెట్‌ను సందర్శిస్తుంటారు.

ఆదివారం అనుమతిస్తే

అప్పట్లో ఆదివారం వస్తే ఫుట్‌పాత్‌పై పాత పుస్తకాలు విక్రయించేవారు. ఏడేళ్ల క్రితం ఫుట్‌పాత్‌పై విక్రయాలను నిలిపేశారు. ఆదివారం విక్రయించే పుస్తకాల్లో అరుదైనవి ఉంటాయని వ్యాపారులు తెలిపారు.ఆదివారం విక్రయాలకు సర్కారు అనుమతించాలని వ్యాపారులు కోరుతున్నారు.

సుమారు 6 దశాబ్దాల కిందట కోఠిలోని ఉమెన్స్ కళాశాల ప్రహరీ నుంచి ఆంధ్రాబ్యాంకు చౌరస్తా వరకు సెకండ్ హ్యాండ్ పుస్తకాల విక్రయం ప్రారంభమైంది. పాదబాటపైనే పరిచి అమ్మకాలు చేస్తుంటారు.

తరువాత డబ్బాలు ఏర్పాటు చేసుకున్నారు. 2006లో 144 డబ్బాలను అధికారులు తొలగించారు. నేటికీ పాదబాటలు కొత్త, పాత పుస్తకాల దుకాణాలు, షోరూంలలో విక్రయాలు సాగుతున్నాయి.

నాడు ఒక్క మార్కెట్ ఉండగా..నేడు 10కి విస్తరించింది. లాంగ్ నోట్ బుక్స్ కిలోల చొప్పున విక్రయిస్తుంటారు. నాణ్యమైన రాత పుస్తకాలు కిలో రూ.120 చొప్పున అమ్ముతుంటారు.పుస్తకంపై ఉండే ఎమ్మార్పీ ధరకు 50 శాతం తక్కువకు విక్రయిస్తారు.

అద్దెకు పుస్తకాలు లభిస్తాయి. వీటితో పాటు పలు పబ్లికేషన్లవి అందుబాటులో ఉంటాయి. కార్పొరేట్ కళాశాలల స్టడీ మెటీరియల్స్‌నూ విక్రయిస్తారు. కళాశాలలు, కోఠి మార్కెట్ పుస్తకాల ధరలో భారీ తేడా ఉంటుంది. కళాశాలల్లో రూ.13 వేలకు విక్రయిస్తే... ఇక్కడ మాత్రం అదే మెటీరియల్ రూ.3 వేలకు దొరుకుతుంది.

స్నేహితురాలు చెబితే వచ్చా...

కోఠి పుస్తక మార్కెట్‌కు వెళ్తే పుస్తకాలు దొరుకుతాయని స్నేహితురాలు చెబితే మొదటిసారి వచ్చా. అన్ని దుకాణాలను సందర్శిస్తున్నా. చక్కటి అనుభూతి కలుగుతుంది.

# బిజినెస్ మేనేజ్‌మెంట్ పట్టభద్రుడు.. సైబర్ నేరగాళ్లకు చిక్కాడు



హైదరాబాద్: బిజినెస్ మేనేజ్‌మెంట్‌లో పీజీ పూర్తి చేసిన ప్రైవేటు ఉద్యోగి సైబర్ నేరగాళ్ల చేతికి చిక్కి రూ.62.13 లక్షలు పోగొట్టుకున్నాడు. స్టాక్ మార్కెట్లో పెట్టుబడులు.. షేర్ల కొనుగోలుకు సహకరిస్తామంటూ బురిడీ కొట్టించారు. ప్రాథమిక పెట్టుబడికి రూ.లక్ష లాభం ఇచ్చిన నేరగాళ్లు.. బాధితుడిని నమ్మించి దోపిడీ చేశారు. ఈ మోసంపై సైబరాబాద్ సైబర్‌క్రైమ్ ఠాణాలో కేసు నమోదైంది. అల్వాల్‌కు చెందిన ప్రైవేటు ఉద్యోగి(58) బిజినెస్ మేనేజ్మెంట్లో పీజీ పూర్తి చేశాడు. ప్రైవేటు సంస్థలో మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. రెండు నెలల క్రితం ఆయన ఫోన్ నంబరును బ్లాక్ రాక్ స్టాక్ క్లబ్, ఇన్వెస్ట్ ప్రో పేరుతో ఉండే రెండు వాట్సాప్ గ్రూపుల్లో కొందరు యాడ్ చేశారు. ప్రపంచవ్యాప్తంగా స్టాక్ మార్కెట్ పెట్టుబడులు, షేర్ల కొనుగోలు విక్రయాలకు సంబంధించి సలహాలిస్తామని.. సెబీలోనూ నమోదైందని ప్రొఫెసర్ కపిల్ పేరుతో ఒకతను పరిచయం చేసుకున్నాడు.

కపిల్ మార్కెట్ స్థితిగతుల గురించి వివరిస్తుంటే.. కొందరు తమకు రోజువారీగా లాభాలు వచ్చినట్లు స్క్రీన్‌షాట్లు పోస్టు చేసేవారు. నెలన్నర పాటు ఈ గ్రూపుల్ని గమనించిన బాధితుడు రెండు గ్రూపుల్లో సూచించినట్లు జులై 14 నుంచి ఆగస్టు 9 వరకూ కొంత మేర పెట్టుబడి పెట్టాడు. అందుకు రూ.2.98 కోట్ల లాభం వచ్చినట్లు వర్చువల్‌గా నేరగాళ్లు చూపించారు. డబ్బు విత్‌డ్రా చేసేందుకు ప్రయత్నించినప్పుడు 20 శాతం సర్వీసు ఛార్జీలు, పన్నులు, సెక్యూరిటీ డిపాజిట్లు పేరుతో డబ్బు వసూలు చేసేవారు. అలా బాధితుడి నుంచి 13 లావాదేవీల్లో రూ.62.13 లక్షలు జమ చేయించుకున్నారు. ఎన్నిసార్లు డబ్బు కట్టినా తిరిగి ఇవ్వకపోవడంతో బాధితుడు మోసమని గుర్తించి సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

# దూసుకొస్తున్న బుల్డోజర్లు.. అక్రమ నిర్మాణాలపై విరుచుకుపడుతున్న హైడ్రా

హైదరాబాద్ : ఏ వైపు నుంచి బుల్డోజర్లు దూసుకొ స్తాయోననే ఆందోళన.. ఏ నిర్మాణాన్ని నేలమట్టం చేస్తుందో తెలియదు మూడో కంటికి తెలియకుండా.. స్థానిక అధికారులకు సైతం సమాచారం ఇవ్వకుండా అక్రమ కట్టడాలపై విరుచుకుపడుతున్నాయి. భారీ బందోబస్తుతో.. పక్కా పకడ్బందీతో హైడ్రా అధికారులు పని కానిచ్చేస్తున్నారు. నగరంలోని పలు ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలను కూల్చేశారు. ముఖ్యంగా మాదాపూర్‌లోని ఎన్ కన్వెన్షన్ సెంటర్‌ను హైడ్రా అధికారులు పడగొట్టారు. కేవలం 4 గంటల వ్యవధిలోనే ఇక్కడి నిర్మాణాలను కూల్చడం చర్చనీయాంశమైంది. ఇప్పటికే వంద ఎకరాల విస్తీర్ణంలోని దాదాపు 200 అక్రమ నిర్మాణాలను కూల్చేశా రు. దీంతో రేపు మా వంతేమోననే ఆందోళన ఆక్రమణదారుల్లో కనబడుతోంది. ఎఫ్‌టీఎల్ నిర్ధారణే చెరువులకు రక్షణ!

ఒకవైపు చెరువుల్లోని అక్రమ నిర్మాణాలపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతుంటే.. జిల్లా యంత్రాంగం నుంచి సహకారం అందడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ పరిధిలో గత పదేళ్లుగా చెరువుల సర్వే కొనసాగుతూనే ఉంది. ఏడు జిల్లాల్లో మొత్తం 3,532 చెరువులకు ఇప్పటివరకు 3,114 సర్వే పూర్తి చేసినా పూర్తిస్థాయి నీటి నిల్వ(ఎఫ్‌టీఎల్)ను గుర్తిస్తూ ఫైనల్ నోటిఫికేషన్ జారీలో తీవ్ర జాప్యం నెలకొంది. 80శాతం చెరువుల్లో ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లు ఆక్రమణకు గురయ్యాయి. ఉప్పల్, కాప్రా, మూసాపేట, సరూర్‌నగర్, శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్, కుత్బుల్లాపూ ర్, పటాన్‌చెరు, ఎల్‌బీనగర్ ప్రాంతాల్లోని చెరువుల్లో వందల నిర్మాణాలు చేపట్టారు.

గండిపేటలో దుకాణాల కూల్చివేత

గండిపేటలో ఎలాంటి అనుమతులు లేకుండా రోడ్డు పక్కన నిర్మించిన దుకాణాలను మున్సిపల్ అధికారులు కూల్చివేశారు. గండిపేట గ్రామంలోని సర్వే నెం.60, 61లో లేక్ ఫ్రంట్ విల్లాస్ లేఅవుట్‌లో విల్లాలు నిర్మించిన బిల్డర్ రోడ్డు పక్కన భవిష్యత్తు రోడ్డు విస్తరణ కోసం వదిలిన స్థలంలో వరసగా 28 దుకాణాలను స్లాబు వేసి నిర్మించారు. మున్సిపల్ అధికారులు రెండు నోటీసులిచ్చినా స్పందన లేకపోవడంతో నాలుగు పొక్లెయిన్‌లతో కూల్చివేతలు చేపట్టారు.

అక్రమ నిర్మాణాలపై కొరడా

శంషాబాద్ మున్సిపల్ కేంద్రంలో షాద్‌నగర్ బస్టాప్ వద్ద జాతీయ రహదారికి ఆనుకుని కొంత మంది వ్యాపారులు మురుగు కాలువపై వాణిజ్య సముదాయాలను నిర్మించారు.మున్సిపల్ అధికారులు పొక్లెయిన్‌లతో అక్రమ వాణిజ్య సముదాయాలను కూల్చివేశారు.

కన్వెన్షన్ల పేరుతో కబ్జా

చెరువుల సమీపంలో కొంత భూమి ఉంటే చాలు ఇంకొంత కలిపేసుకోవడం..అక్కడ దర్జాగా కన్వెన్షన్ సెంటర్లు కట్టడం.. ఇది సిటీలోని బడా అక్రమార్కుల కమామిషు. చెరువులో మట్టిని పూడ్చి కన్వెన్షన్ ఫంక్షన్ హాళు కట్టి కబ్జా చేస్తున్నారు. వీటిలో శాశ్వత నిర్మాణాలకు అనుమతులు రావని తెలిసి తాత్కాలిక నిర్మాణాలు చేపడుతున్నారు. అనుమతులతో పనిలేకుండా కన్వెన్షన్లు సెంటర్లు, కారు షెడ్లు, గోడౌన్లు కడుతున్నారు. ఇవి కూడా కుదరకపోతే కలిపేసుకుని పార్కింగ్ కోసం వాడుకుంటున్నారు.



మాదాపూర్‌లో ఎన్ కన్వెన్షన్ హాల్ కూల్చివేతతో నగరంలో చాలా ప్రాంతాల్లో ఈ తరహా నిర్మాణాలపై చర్చ నడుస్తోంది.

సమాచారమివ్వండి: పొన్నం చెరువుల ఆక్రమణలపై తమకు సమాచారమివ్వాలని మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. ఎంత పెద్దవారైనా, ప్రముఖులైనా వదలబోమని, కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మీమీ ప్రాంతాల్లో చెరువుల ఆక్రమణలపై సమాచార హక్కు చట్టం ద్వారా తీసుకున్న వివరాలు, పూర్వీకుల నుంచి వచ్చిన వారసత్వపు తటాకాలు ఎక్కడున్నా తమకు సమాచారాన్ని అందించాలని సూచించారు. చెరువుల పరిరక్షణకు హైడ్రా చేస్తున్న కార్యక్రమాలకు మద్దతుగా గండిపేట చెరువుకట్టపై 'హైడ్రా సపోర్టు వాక్' నిర్వహిస్తున్నట్లు గండిపేట వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు వేణుగోపాల్, ఉపాధ్యక్షురాలు రాజేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. చెరువులను కాపాడాలనే ప్రధాన లక్ష్యంతో చేపడుతున్న ఈ కార్యక్రమంలో గండిపేట పరిసరాల్లోని ఆయా కాలనీల నివాసులు కుటుంబ సమేతంగా పాల్గొంటున్నారన్నారు.

ఎవరివైనా కూల్చాల్సిందే: వీహెచ్

ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో అక్రమ నిర్మాణాల కూల్చివేతకు 'హైడ్రా' ఏర్పాటు చేసి సీఎం రేవంత్‌రెడ్డి మంచి నిర్ణయం తీసుకున్నారని పీసీసీ మాజీ అధ్యక్షుడు వి.హనుమంతరావు అన్నారు. గాంధీభవన్‌లో ఆయన మాట్లాడారు. జన్వాడ ఫామ్ హౌస్ కేటీఆర్‌దైనా, ఆయన స్నేహితుడిదైనా అక్రమ నిర్మాణాలు ఎవరివైనా సరే కూల్చివేయాల్సిందేనని వ్యాఖ్యాని ంచారు. బఫర్‌జోన్‌లో బరితెగింపు.. చెరువుల ఎఫ్‌టీఎల్, వాటి బఫర్ జోన్లలో వ్యవసాయ అవసరాలకు తప్ప మరేవిధంగా నిర్మాణాలు జరపొద్దు.కానీ కొందరు యథేచ్ఛగా మట్టిని పూడ్చి చదును చేస్తున్నారు. హిమాయత్‌సాగర్ జలాలను అనుకునే ఇటీవల ఒక భారీ కన్వెన్షన్‌ను నిర్మించారు. జిల్లెలగూడ చెరువు సమీపంలో బఫర్‌జోన్‌లోనే ఓ ఫంక్షన్ హాల్ కట్టారనే ఆరోపణలు ఉన్నాయి. ఆదిభట్లలో కల్వర్టు సమీపంలో మట్టిని పోసి అక్కడున్న కుంటను మింగే ప్రయత్నం చేస్తున్నారు. నాగోల్ చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో మూడు, ఫతుల్లాగూడలో ఒకటి, బండ్లగూడ చెరువు పరిధిలో స్పోర్ట్స్ జోన్‌ను కట్టారు.

# ఈసారి టాస్క్ కు సిద్ధమా ?

ఖమ్మం : కలల కొలువు సాధించాలని యువత భావిస్తుంటే.. దానికి తగ్గట్టు నైపుణ్యాలు ఉండాల్సిందేనని కంపెనీల యాజమాన్యాలు ఆకాంక్షిస్తున్నాయి. ఈ రోజుల్లో చదువు పూర్తవగానే ఉద్యోగం రావటం అంత సులువు కాదు. ఉద్యోగాల కోసం అన్వేషిస్తున్న యువతకు అవసరమైన నైపుణ్యాలు నేర్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఐటీ శాఖ ఆధ్వర్యంలో 'తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్(టాస్క్)'ను ఏర్పాటు చేసింది.

**నమోదు తప్పనిసరి..**

'టాస్క్' ద్వారా శిక్షణ, ప్లేస్‌మెంట్స్ పొందాలంటే సంబంధిత కళాశాలలు, విద్యార్థులు ముందస్తుగా పేర్లు నమోదు చేసుకోవాలి. 2024–25 విద్యాసంవత్సరానికి సంబంధించిన నమోదు నోటిఫికేషన్ వెలువడింది. తొలుత కళాశాలలు నమోదు చేసుకోవాలి. అనంతరం ఆయా కళాశాలలు విద్యార్థుల నమోదుకు ఆస్కారముంటుంది. అప్పుడు మాత్రమే విద్యార్థులకు సంబంధిత కళాశాలల్లో 'టాస్క్' ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చి కంపెనీ ప్లేస్‌మెంట్స్‌లో అవకాశం కల్పిస్తారు. ఈ నెల 30లోపు నమోదు ప్రక్రియ పూర్తి చేసుకోవాల్సి ఉంటుంది. అదనపు సమాచారం కోసం ఖమ్మంలోని ఐటీ హబ్‌లో సంప్రదించాలి.

కళాశాలల్లో ప్రత్యేక శిక్షణ

ఇంజినీరింగ్, డిగ్రీ, పాలిటెక్నిక్, ఎంబీఏ, ఫార్మసీ తదితర కోర్సుల వారికి కళాశాలల్లోనే ప్రత్యేక శిక్షణ ఇస్తారు.

కమ్యూనికేషన్ స్కిల్స్, విషయ, సంస్థాగత నైపుణ్యాలతో పాటు సాంకేతిక మెలకువలను పెంపొందిస్తారు. సాంకేతిక అంశాలపై తాజా పరిస్థితుల



కు అనుగుణంగా దశల వారీగా కార్యశాలలు నిర్వహిస్తారు. కార్పొరేట్ కంపెనీలు కోరుకునే మానవ వనరులను పెంపొందించి ఉద్యోగాలు సాధించేలా చేస్తారు.ఉపాధికి మార్గం..ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ఎంతోమంది విద్యార్థులు 'టాస్క్' ద్వారా శిక్షణ పొంది కొన్నేళ్లుగా ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. గతేడాది 3వేల మందికి పైగా 'టాస్క్'కు నమోదు చేసుకున్నారు. వీరిలో 90 శాతం మందికి సాంకేతిక, భాషా పరిజ్ఞానంపై శిక్షణ ఇవ్వగా చాలామంది కళాశాల స్థాయిలోనే ప్లేస్‌మెంట్‌లో సత్తాచాటారు.

ఈ అంశాల్లో తర్ఫీదు

భావవ్యక్తీకరణ సామర్థ్యాలు, ఇంటర్వ్యూను సమర్థంగా ఎదుర్కోవటం, సమస్య– పరిష్కార నైపుణ్యాలు, క్యాంపస్ టు కార్పొరేట్ స్కిల్స్, 21వ శతాబ్దపు నైపుణ్యాలు.ప్రాథమిక దశలో కంపెనీలు నిర్వహించే రాతపరీక్ష కోసం అవసరమమయ్యే ఆప్టిట్యూడ్ అండ్ రీజనింగ్‌పై పట్టు.

ఇంజినీరింగ్ వారికి అవసరమయ్యే సాంకేతిక కోర్సులపై అవగాహన. జావా, డేటా బేస్, ఫ్రంట్ ఎండ్ డెవలప్‌మెంట్, ప్రోగ్రామింగ్ స్కిల్స్, పైథాన్, క్లౌడ్ కంప్యూటింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్, ఆటోకాడ్, ఈకాడ్, నెట్ వర్క్ సిగ్నలేషన్, ఎంబెడెడ్ సిస్టం లాంటి వాటిపై శిక్షణ. డిగ్రీ, ఫార్మసీ, ఎంబీఏ విద్యార్థులకు తమ కోర్సులకు తగ్గట్టుగా ట్యాలీ, సీం, బేసిక్ ప్రోగ్రామింగ్స్, ఆప్టిట్యూడ్స్ అండ్ రీజినింగ్, కమ్యూనికేషన్ అండ్ ఇంటర్వ్యూ స్కిల్స్ లాంటి అంశాలపై తర్ఫీదు ఇస్తారు.

# జాతీయ స్థాయిలో మెరిసేలా..!

పాల్వంచ : విద్యార్థుల్లో విద్యా సామర్థ్యాలను మదింపు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం మూడేళ్లకోసారి జాతీయ సాధన సర్వే (న్యాస్) పరీక్ష నిర్వహిస్తోంది. 2024–25 విద్యాసంవత్సరంలో నవంబరు 19న ఈ పరీక్ష జరపాలని ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. ఈమేరకు రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ మండలి(ఎస్ఈఆర్‌టీ) కసరత్తు చేస్తోంది. ఈసారి మంచి ఫలితాల సాధనకు విద్యార్థులను సన్నద్ధం చేసేందుకు కార్యాచరణ రూపొందించింది. తాజాగా ఎస్ఈఆర్‌టీ నమూనా పరీక్షల షెడ్యూల్ విడుదల చేసింది. సెప్టెంబరు 10, 30, నవంబరు 8న నమూనా పరీక్షల నిర్వహణకు జిల్లాల వారీగా సంబంధిత అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. 3, 6, 9 తరగతుల విద్యార్థులకు..

3, 6, 9 తరగతుల విద్యార్థులను ఎంపిక చేసిన పాఠశాలల్లో తెలుగు, ఆంగ్లం, సైన్స్, సాంఘికశాస్త్రం, గణితం సబ్జెక్టుల్లో పరీక్ష నిర్వహిస్తారు. బహుళ ఐచ్ఛిక (మల్టీపుల్ ఛాయిస్) విధానంలో పరీక్ష ఉంటుంది. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యాల పరిధిలో చదివే విద్యార్థులకు



పరీక్షలుంటాయి. ఇప్పటికే ఖమ్మం, భద్రాద్రి జిల్లాల వారీగా ఆయా తరగతుల వారీగా విద్యార్థుల వివరాలను అధికారులు సేకరించారు. ఈ విద్యాసంవత్సరం జులై 26, 27వ తేదీల్లో ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయులకు శిక్షణ సైతం ఇచ్చారు. తెలుగు, ఇంగ్లిష్ మీడియం విద్యార్థులకు నమూనా పరీక్షలను ప్రభుత్వ, జడ్పీ, కేజీబీవీల్లో నిర్వహించాలని నిర్ణయించారు. ఈ ఫలితాల ఆధారంగా ప్రాథమిక పాఠశాలల్లో మౌలిక భాషా గణిత అభివృద్ధి(ఎఫ్ఎల్ఎన్), ఉన్నత పాఠశాలల్లో అభ్యసన అభివృద్ధి కార్యాక్రమం(ఎల్ఐపీ) చేపట్టి నవంబర్ 19న దేశవ్యాప్తంగా జరిగే 'న్యాస్'కు పూర్తిస్థాయిలో సామర్థ్యాల మెరుగుదలకు చర్యలు తీసుకోనున్నారు. పరీక్ష నిర్వహణకు రెండు నెలల సమయం ఉంది. పాఠశాలల్లో విద్యార్థులను ఇప్పటి నుంచే సన్నద్ధం చేయాలి. పరీక్ష విధానం ఎలా ఉంటుంది.. ఎలాంటి ప్రశ్నలు అడుగుతారనే అంశాలపై ముందస్తుగా మాక్ టెస్ట్ నిర్వహిస్తాం. – నాగరాజశేఖర్, ఏఎంఒ, భద్రాద్రి

## కార్మిక కుటుంబాలకు మెరుగైన వైద్యం కరువు

పెద్దపల్లి: రామగుండంలో రూ.100 కోట్ల నిధులు మంజూరైనా కార్మిక రాజ్య బీమా సంస్థ(ఈఎస్ఐ) 100 పడకల ఆసుపత్రి నిర్మాణానికి ఇంకా మార్గం సుగమం కావడం లేదు. సమగ్ర కార్యాచరణ తీసుకోవడంలో ఆలస్యమవుతుండటంతో కార్మికుల ఆరోగ్యం గాలిలో దీపంగా మారుతోంది. పెద్దపల్లి జిల్లాలో బసంత్‌నగర్, ఎన్టీపీసీ టీటీఎస్, కృష్ణానగర్ ప్రాంతాల్లో మూడు డిస్పెన్సరీల ద్వారా ప్రస్తుతం అరకొరగా వైద్య సేవలు అందుతున్నాయి. కేవలం రక్త, మూత్ర పరీక్షలతో పాటు మందులు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈ మూడు డిస్పెన్సరీలే కార్మికులకు ఆధారం. సిరిసిల్ల, కోరుట్లలో కేవలం బీడీ కార్మికుల ఆసుపత్రులున్నాయి. కార్మికులకు మెరుగైన వైద్య సదుపాయాలు, నిర్మాణ పనులపై సంస్థ మేనేజర్ దిలీప్‌తో మాట్లాడగా నిర్మాణ పనులకు ఆన్‌లైన్‌లో టెండర్లు వేశామన్నారు. త్వరలో రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో నిర్మాణ పనులు చేపడతామని వివరించారు. 3.30 ఎకరాల పాత శిథిల ఆస్పత్రి ఆవరణలోనే నిర్మించేందుకు తాము సిద్ధమన్నారు. హౌసింగ్ బోర్డుకాలనీ సమీపంలో ఉండటంతో కబ్జాలు పెరిగాయని అందుకే ప్రహరీ నిర్మించామన్నారు.

జ్వరాలు.. దీర్ఘకాలిక సమస్యలు

సింగరేణి, ఎన్టీపీసీ, ఎరువుల కర్మాగారం, జెన్‌కో పరిశ్రమలతో పాటు



పెద్దపల్లిలోని బియ్యం మిల్లుల్లో పనిచేసే ఉద్యోగులు, కార్మికులు తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. పరీక్షల కోసం డిస్పెన్సరీకి వస్తే కేవలం సూదిమందు, మందులు ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీరసం ఉంటే సెలైన్ బాటిల్ ఎక్కించేందుకు కూడా అవకాశం ఇక్కడ లేదని తెలిపారు. జ్వరం, జలుబు, ఒళ్లునొప్పులకు మాత్రమే చికిత్స ఉంటోందని.. దీర్ఘకాలిక వ్యాధులకు వరంగల్, హైదరాబాద్‌కు వెళ్లమని చెబుతున్నారని పలువురు వాపోతున్నారు. ఎక్స్‌రేలు, స్కానింగ్ సదుపాయాలే లేవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డెంగీ, మలేరియా జ్వరాలు వస్తే రక్తపరీక్షలు చేస్తునప్పటికీ సరైన మందులు ఇవ్వడం లేదని చెబుతున్నారు.

ఎన్టీపీసీ డిస్పెన్సరీలో ఒకరు ప్రభుత్వ, ఒకరు తాత్కాలిక వైద్యురాళ్లు, 13 మంది ఆరోగ్య సిబ్బంది ఉన్నారు. ఈఎస్ఐ ఔషధాలయం, శాఖా కార్యాలయాలు ప్రస్తుతం రామగుండ ంలోని క్రిష్ణనగర్ కాలనీలో ఏర్పాటు చేశారు. ప్రతి సోమవారం నుంచి  వరకు ఉదయం 9 నుంచి 4 గంటల వరకు, ఒంటి గంట వరకు మాత్రమే సేవలు అందిస్తున్నారు. ఆరోగ్య పరిస్థితులు విషమంగా ఉంటే వరంగల్, హైదరాబాద్ నాచారం ఈఎస్ఐ ఆసుపత్రికి సిఫార్సు చేయాల్సిన పరిస్థితులున్నాయి. ఎన్టీపీసీ ప్రాంతంలో రూ.20లక్షలకు పైగా ప్రతి నెలా ఈఎస్ఐకి సభ్యత్వ రుసుము జమ అవుతుంది. మిగిలిన పరిశ్రమలన్నీ కలిపి రూ.కోట్లలో ఈఎస్ఐకి జమఅవుతుంది. కార్మికులు వృత్తిపరంగా కష్టతరమైన పనులు నిర్వహిస్తున్న క్రమంలో అనారోగ్య పరిస్థితులు చుట్టుముడుతున్నాయి. ఈ ప్రాంతంలో మొత్తం 22 వేల మంది కార్మికులకు ఈఎస్ఐ కార్డులు మంజూరు చేశారు.

## బయోగ్యాస్.. నిర్వహణ తుస్!

వేములవాడ: వేములవాడలోని రాజన్న గోశాలలో కోడెల, ఆవుల పేడ వృథా పోకుండా విద్యుత్తు తయారు చేసి గోశాలతోపాటు పక్కనే ఉన్న ఏరియా ఆసుపత్రి అవసరాలకు అందించాలన్న లక్ష్యం నీరుగారుతోంది. కోడెలు, ఆవులు వందల సంఖ్యలో ఉండటంతో ప్రతి రోజు 25 టన్నుల పేడ సమకూరుతుంది. దీంతో దాదాపు 24 కిలోవాట్లకు పైగా విద్యుత్తు ఉత్పత్తి అయ్యే అవకాశం ఉండడంతో బయోగ్యాస్ విద్యుత్తు ప్లాంట్ నిర్మాణాన్ని చేపట్టాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా ఏడాది క్రితమే ప్లాంట్‌ను ప్రారంభించారు కానీ.. ఆలయ అధికారుల నిర్లక్ష్యం కారణంగా నిరుపయోగంగా మారింది.

విమర్శల వెల్లువ

బయోగ్యాస్ విద్యుత్తు ప్లాంట్‌లో పేడను మిక్సింగ్ చేసే పరికరం అతి ముఖ్యమైనది. ఇది మరమ్మతుకు గురైనా తగిన మరమ్మతు నిర్వహించకుండా వదిలేశారు. ఫలితంగా రోజుల తరబడి ప్లాంట్ పనిచేయకుండానే ఉంటోంది. దీని మరమ్మతును తమిళనాడులో చేయించాల్సి ఉండగా.. అధికారులు వేగంగా ఆ దిశగా తగిన చర్యలు చేపట్టడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రూ.లక్షలు వెచ్చించిన యంత్రంలో సాంకేతిక లోపం తలెత్తితే సరిచేయకుండా వదిలేయడం సరికాదని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ప్లాంట్‌ను వినియోగంలోకి తీసుకొచ్చి పకడ్బందీ నిర్వహణ చేపట్టాలని కోరుతున్నారు.

ఇదీ పరిస్థితి

వేములవాడ మున్సిపల్ అధికారులు రూ.31.60 లక్షలతో తిప్పాపూర్‌లోని శ్రీ రాజరాజేశ్వరస్వామి దేవస్థానం గోశాలలో బయోగ్యాస్ విద్యుత్తు ప్లాంట్‌ను ఏర్పాటు చేసి నిర్వహణను దేవస్థానానికి అప్పగించారు. ఈ ప్లాంట్‌కు రోజూ దాదాపు 24 కిలోవాట్లకు పైగా విద్యుత్తును ఉత్పత్తి చేసే సామర్థ్యం ఉంది. ప్లాంట్ ప్రారంభంలో మొదట ఉత్పత్తి అయిన విద్యుత్తును గోశాలకు వినియోగించారు. ఆ తరువాత ప్లాంట్‌లో విద్యుత్తు ఉత్పత్తి పెరిగింది. దీంతో సమీపంలోని ప్రాంతీయ ఆసుపత్రికి సైతం వినియోగించేందుకు నిర్ణయించారు.

ప్లాంట్ మరమ్మతుకు గురవడంతో విద్యుత్తు ఉత్పత్తి నిలిచిపోయింది. మరమ్మతులపై ఆలయ అధికారులు పట్టించుకోకపోవడంతో ప్లాంట్ నిరుపయోగంగా మారింది.

వారంలో పునరుద్ధరణ

బయోగ్యాస్ విద్యుత్తు ప్లాంట్‌లోని యంత్రంలో ముఖ్యమైన విడిభాగం మరమ్మతుకు గురైంది. దానికి తమిళనాడులో మరమ్మతు చేయించి మళ్లీ బిగించాల్సి ఉంది. ఇప్పటికే ఆ పరికరాన్ని మరమ్మతుకు పంపాం. మరో వారం రోజుల్లో బయోగ్యాస్ ప్లాంట్‌లో విద్యుత్తు ఉత్పత్తిని తిరిగి ప్రారంభించడానికి అవకాశం ఉంది.

రఘునందన్, డీఈఈ రాజన్న ఆలయం

## ఎఫ్‌టీఎల్ నిర్ధారణ.. చెరువులకు రక్షణ!



హైదరాబాద్: ఒకవైపు చెరువులను ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతుంటే.. ఆ మేరకు జిల్లాల యంత్రాంగం నుంచి సహకారం అందడం లేదనే విమర్శలు విన్పిస్తున్నాయి. హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థలోని ఏడు జిల్లాల పరిధిలో గత పదేళ్లుగా చెరువుల సర్వే కొనసాగుతోంది. మొత్తం 3,532 చెరువులకు ఇప్పటివరకు 3,114 సర్వే పూర్తి చేసినప్పటికీ.. పూర్తిస్థాయి నీటి నిల్వ(ఎఫ్‌టీఎల్)ను గుర్తిస్తూ ఫైనల్ నోటిఫికేషన్ జారీలో తీవ్ర జాప్యమవుతోంది. హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ(హెచ్ఎండీఏ) నుంచి ఎన్నిసార్లు ఆదేశాలు వెళ్లినప్పటికీ ఆయా జిల్లాల యంత్రాంగంలో చలనం కన్పించడం లేదు. ఒకరిపై ఒకరు నెపం నెట్టుకుంటూ చోద్యం చూస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రతి చెరువుకు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లు కీలకం. వాటి పరిధిలో ఎలాంటి నిర్మాణాలకు ప్రభుత్వం అనుమతించదు.

సిద్దిపేట జిల్లాలో ఒక్క చెరువుకూ ఇవ్వలేదు: మహానగర పరిధిలో 80 శాతం చెరువుల్లో ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లు ఆక్రమణలకు గురైన సంగతి బహిరంగ రహస్యమే. ఉప్పల్, కాప్రా, మూసాపేట, సరూర్‌నగర్, శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్, కుత్బుల్లాపూర్, పటాన్‌చెరు, ఎల్‌బీనగర్ ఇలా అనేక ప్రాంతాల్లో చెరువుల్లోకి చొచ్చుకెళ్లి వందల నిర్మాణాలు చేపట్టారు. ప్రస్తుతం హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో ఆయా జిల్లాల యంత్రాంగం ఈ చెరువులను సర్వే చేస్తోంది. ఇందుకు సర్వే ఇండియా, రెవెన్యూ, గ్రామ పంచాయతీ మ్యాపులు, గత రెండు దశాబ్దాల్లో చెరువుల్లోకి వరద నీటిని పరిగణలోకి తీసుకొని ఎఫ్‌టీఎల్ నిర్ధారిస్తోంది. ఒకసారి ఎఫ్‌టీఎల్ గుర్తింపు పూర్తయ్యాక దీనిపై ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేసి అభ్యంతరాలు కోరతారు. వాటిని పరిగణలోకి తీసుకొన్న అనంతరం తుది నోటిఫికేషన్ జారీ చేస్తారు. తర్వాత ఆక్రమణల తొలగింపునకు మార్గం సుగమవుతుంది. హెచ్ఎండీఏ పరిధిలో ఇప్పటివరకు 2,540 చెరువులకు ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేసి.. 230 చెరువులకు తుది నోటిఫికేషన్ జారీ చేశారు. సిద్దిపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో ఒక్క చెరువుకు తుది నోటిఫికేషన్ ఇవ్వలేదు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం దృష్టి సారించాలని పర్యావరణ వేత్తలు కోరుతున్నారు.

## నిర్వహణ లోపం.. కూడళ్లు కళావిహీనం



పరిగి: పరిగి మున్సిపాలిటీ కొత్తగా ఏర్పడి తక్కువ కాలమే అయినా దినదినాభివృద్ధి చెందుతోంది. పంచాయతీ నుంచి మున్సిపాలిటీగా హోదా పెరగడంతో గృహ నిర్మాణ పరంగా ఆకట్టుకుంటోంది. కానీ కూడళ్లు మాత్రం కళావిహీనంగా దర్శనమిస్తున్నాయి. వీటి అభివృద్ధి పట్ల పాలకవర్గం దృష్టి సారించాల్సి ఉంది. ప్రధానంగా బీజాపూర్ –హైదరాబాద్ జాతీయ రహదారిపైనే ఉండటం ప్రత్యేక ప్రాధాన్యం సంతరించుకుంది. పట్టణంలోని అమర వీరుల చౌరస్తా (కొడంగల్ కూడలి) వద్ద నాటిన మొక్కల కంటే గడ్డిపోచలే అధికంగా కనిపిస్తున్నాయి.

2018లో మున్సిపాలిటీగా ఏర్పాటు

మేజర్ గ్రామ పంచాయతీగా ఉంటూ 2018 జూన్ 2న నూతనంగా ఏర్పడిన పరిగి మున్సిపాలిటీ క్రమక్రమంగా ఆదాయాన్ని పెంచుకుంటోంది. ప్రభుత్వం సైతం వివిధ రకాల సెస్సులను వసూలు చేస్తోంది. గతంలో హరిత నిధి కూడా ఒక్కో వ్యాపారి నుంచి రూ.వెయ్యి వరకు అదనంగా వసూలు చేస్తోంది. పచ్చదనం, పరిశుభ్రతకు పెద్దపీట వేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛదనం –పచ్చదనం కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. గతంలోనూ పట్టణ పార్కులు ఏర్పాటయ్యాయి. ఇదే క్రమంలో ఫౌంటెయిన్లతో కూడళ్లను ఆకర్షణీయంగా తీర్చిదిద్ది అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు. 15వార్డుల పరిధిలో ఏటా రూ.2.8కోట్లు రావాల్సి ఉండగా గతేడాది 89శాతం మేర పుర అధికారులు వసూలు చేశారు. పన్నుల వసూళ్లపై శ్రద్ధ చూపుతున్న అధికారులు కూడళ్ల బాగుపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

సరికొత్త అందాలకు అవకాశం

బస్టాండు సమీప వివేకానంద , అంబేడ్కర్ కూడలి, కోర్టు సమీపాన ఉన్న ఇందిరాగాంధీ కూడలి, గంజ్‌రోడ్డు వద్ద ఉన్న గాంధీచౌక్, నూతనంగా తహసీల్దారు కార్యాలయం సమీపాన ఏర్పాటు చేసిన శివాజీచౌక్‌లను అభివృద్ధిచేసి పట్టణానికి సరికొత్త అందాలు తెచ్చే విధంగా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రత్యేక దృష్టి సారిస్తాం

కూడళ్ల అభివృద్ధితోనే నిజానికి పట్టణానికి ప్రత్యేక అందాలు రానున్నాయి. నిధుల కొరత కారణంగా కొన్ని ఇబ్బందులు తలెత్తుతున్నా పాలకవర్గ సమావేశంలో చర్చిస్తాం. అందరి ఆమోదంతో దశల వారీగా అభివృద్ధి చేస్తాం. త్వరలోనే 15వ ఆర్థిక సంఘం నిధులను ఇందుకు వెచ్చించేందుకు కృషి చేస్తాం.

అశోక్‌కుమార్, ఛైర్మన్, మున్సిపాలిటీ.

## పట్టణాలు, పల్లెలకూ పాకిన.. 'చరవాణి'జ్యం




మెదక్ : ఒకప్పుడు.. ఆన్‌లైన్ ఆర్డర్లు నగరాలకే పరిమితం. ఇప్పుడు.. పల్లెలకూ వ్యాపించింది. ఈ–కామర్స్ సంస్థల విస్తృతి.. ఇంట్లో కాలు కదపకుండా కొనుగోళ్లు చేసే విధానం. ఒకేసారి అనేక రకాలు, నచ్చిన వస్తువులు సులువుగా పొందే వెసులుబాటు రావడంతో ఆన్‌లైన్ కొనుగోళ్లు జోరుగా సాగుతున్నాయి. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు వినియోగించుకోవడం విశేషం. చేతిలో చరవాణి ఉంటే సరిపోతుంది. గతంలో మహానగరాలకే పరిమితం కాగా, ఇప్పుడు పట్టణాలు, పల్లెల్లకూ ఈ విధానం పాకింది. జిల్లాలో ఆన్‌లైన్ కొనుగోళ్ల ట్రెండ్ కొత్త పుంతలు తొక్కుతున్న తరుణంలో కథనం.

ఆన్‌లైన్ వ్యాపారం.. పల్లెలను తాకిన తరుణంలో పట్టణాలు వేదికలుగా మారుతున్నాయి. పెన్ను, పుస్తకం మొదలు.. ల్యాప్‌టాప్‌ల వరకు.. ఇంట్లో అవసరమైన అన్ని వస్తువులు.. వ్యాపారాల నిర్వహణకు ఉపకరించే సామగ్రి.. గృహోపకరణ, వస్త్ర, యంత్ర, సాంకేతిక సామగ్రి కొనుగోలుకు.. వివిధ ఈ–కామర్స్ సంస్థలు వేదికలుగా నిలుస్తున్నాయి. ఆయా సంస్థలకు అనుబంధంగా జిల్లా కేంద్రం, ప్రధాన పట్టణాల్లో కార్యాలయాలు, ఏజెన్సీలు, కొరియర్ సంస్థలు సైతం వెలిశాయి. వీటి ద్వారా గ్రామీణ ప్రాంతాలకు విస్తృతంగా సేవలు అందిస్తున్నాయి. దీనివల్ల స్థానిక యువతకు ఉపాధి లభిస్తోంది. నిర్వాహకులు ద్విచక్ర వాహనాలున్న వారిని నియమించుకుంటున్నారు. నేరుగా వినియోగదారులకు అందిస్తున్నారు.

అధికంగా యువత

చరవాణి, అనుబంధంగా అంతర్జాలం ఉంటే చాలు ప్రపంచాన్ని చుట్టేయెచ్చు. నచ్చిన సామగ్రి.. ఉపకరణాలను ఇట్టే కొనుగోలు చేయవచ్చనది నేటి యువత మాట. కరోనా ముందు.. ఆ తర్వాత చూస్తే.. గణనీయ మార్పులు చోటుచేసుకున్నాయి. ఎక్కువగా యువత ఈ తరహా కొనుగోళ్లపై దృష్టి సారిస్తున్నారు. అత్యధిక శాతం ఇంట్లో ఉదయం నుంచి రాత్రి వరకు ఉపయోగపడే ప్రతి వస్తువు కొనుగోలు చేస్తున్నారు.

నేరుగా ఇంటికే..

అంతర్జాలం పని చేసే చోట, పిన్‌కోడ్ ఉన్న ప్రతి ప్రాంతానికి నచ్చిన వస్తువు ఇంటికే చేరుతుంది. విద్యావంతులు, మహిళలు, వివిధ వ్యాపార సంస్థలు ఆన్‌లైన్ వైపు మళ్లుతున్నారు. చిన్నపాటి వస్తువులకు వినియోగించేస్తున్నారు.

తస్మాత్ జాగ్రత్త

ఆన్‌లైన్ కొనుగోళ్లలో తప్పుడు సైట్లతో జాగ్రత్తగా వ్యవహరించాలి. అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి. ప్రముఖ సంస్థలను ఎంచుకోవడం ఉత్తమం. బహిరంగ విపణి, సదరు సైట్ ధర వ్యత్యాసాన్ని పోల్చుకోవాలి. కొన్ని సైట్లలో తక్కువ ధర అంటూ మోసం చేస్తున్నారు. రివ్యూను పరిగణనలోకి తీసుకోవాలి. తక్కువ ధర అంటే.. ముందుగా ఆలోచించాలని సాంకేతిక నిపుణులు చెబుతున్నా రు. అన్ని జాగ్రత్తలు తీసుకుంటే మంచిది.

వెలిసిన ఏజెన్సీలు

జిల్లాలో ప్రముఖ ఈ–కామర్స్ సంస్థలకు అనుబంధంగా కార్యాలయాలు, ఏజె న్సీలు, కొరియర్ సంస్థలు కొనసాగు తున్నాయి. వినియోగ దారులకుఅనుబంధంగా శాఖల వారీగా సేవలు అందు తున్నాయి. వికారాబాద్‌లో 7 రకాల ఆన్‌లైన్ కొరియర్ సంస్థలు ఉన్నాయి. వికారాబాద్, కొడంగల్, పరిగి, తాండూరు తదితర పట్టణాల్లో ఈ సంస్థలు అందుబాటులో ఉన్నాయి.

## శునకాలు ఇక్కడ..సంరక్షణ కేంద్రం ఎక్కడో?

కాచిగూడ: జీహెచ్ఎంసీ అంబర్‌పేట సర్కిల్–16 పరిధిలో స్టెరిలైజేషన్(సంతాన నిరోధక శస్త్ర చికిత్స) కోసం పట్టుకున్న వీధి శునకాలను ఎక్కడో దూరంగా ఉన్న జగద్గిరిగుట్ట పరిధిలోని ఎల్లమ్మ బండ సంరక్షణ కేంద్రానికి తరలిస్తున్నారు. మరోవైపు, జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ సర్కిల్‌లోని కుక్కలను అంబర్‌పేటలోని కేంద్రానికి తీసుకొస్తున్నారు. జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు అనుసరిస్తున్న వైఖరితో అనునిత్యం ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అంబర్‌పేట సర్కిల్‌లో జాగిలాలను పట్టుకున్న జీహెచ్ఎంసీ సిబ్బంది.. అనంతరం ట్రాఫిక్ ఇబ్బందుల మధ్య అనేక ప్రయాసల ర్చుతూ వాటిని ఇక్కడికి సుదూరంలో ఉన్న ఎల్లమ్మబండకు తీసుకెళ్లాల్సి వస్తోంది.

కొన్నేళ్లుగా ఇదే తంతు..

దశాబ్దం క్రితం అంబర్‌పేట అలీకేఫ్ చౌరస్తాలోని వాటర్ వర్క్స్ స్థలంలో.. జీహెచ్ఎంసీ సిబ్బంది పట్టుకున్న శునకాల కోసం స్టెరిలైజేషన్, సంరక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అయితే, దీన్ని జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ సర్కిల్ వారికి అప్పగించారు. అంబర్‌పేట సర్కిల్‌లోని కుక్కల కోసం మాత్రం జగద్గిరిగుట్ట ఎల్లమ్మబండలో సంరక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఐదు రోజుల పాటు సంరక్షణ: తొలుత పట్టుకున్న వీధి శునకాలకు సంతాన నిరోధక శస్త్రచికిత్స చేశాక 5 రోజులు సంరక్షణ కేంద్రంలోనే ఉంచి బాగోగులను చూస్తారు. వాటి చెవికి గుర్తును వేసి...తెచ్చిన ప్రాంతానికే తీసుకెళ్లి వదిలేస్తారు.

## పచ్చటి పరిశ్రమల చిరునామా

పెద్దపల్లి: కొన్నేళ్ల క్రితం ఆ ప్రాంతమంతా గుట్టలతో ఉండేది. రైతుల చేతిలో పట్టాలున్నా ఈ భూములు సాగుకు యోగ్యంగా ఉండేవి కావు. హైదరాబాద్– విజయవాడ జాతీయ రహదారిపై, ఔటర్ రింగు రోడ్డుకు చేరువలో ఉన్న దండుమల్కాపురంలోని ఈ గుట్టల ప్రాంతం ఇప్పుడు ఆసియా ఖండంలోనే అతిపెద్ద ఎంఎస్ఎంఈ హరిత పారిశ్రామిక పార్కుగా రూపుదిద్దుకుంది. టీఎస్ఐఐసీ ద్వారా ఇక్కడ 1886 ఎకరాల భూమిని సేకరించారు. తెలంగాణ పారిశ్రామిక వేత్తల సమాఖ్య (టిఫ్) ద్వారా 542.70 ఎకరాల్లో కేటాయించిన స్థలంలో కాలుష్య సమస్యలేని సూక్ష్మ, చిన్న, మధ్యతరహా 589 పరిశ్రమలు రూ.1985 కోట్ల పెట్టుబడితో ఏర్పాటవుతున్నాయి. వీటిలో ప్రత్యక్షంగా 19,495, పరోక్షంగా 15,509, మొత్తం 35,004 మందికి ఉపాధి లభించనుంది. మొత్తంగా లక్ష మందికి ఇక్కడ ఉపాధి లభిస్తుందని అంచనా.

నైపుణ్య అభివృద్ధి శిక్షణ కేంద్రం

పారిశ్రామిక పార్కులోనే నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రం సిద్ధం చేశారు. పారిశ్రామికుల అవసరాలకు అనుగుణంగా ఈ ప్రాంత యువతకు శిక్షణనిచ్చి సర్టిఫికెట్‌తో పాటు ఉద్యోగం కూడా ఇచ్చేందుకు నిర్ణయించారు. ఇక్కడి ఉత్పత్తుల ప్రదర్శనకు, ముడి సరకుల అమ్మకానికి ఉపయోగపడేలా టిఫ్ ద్వారా రూ.45 కోట్లతో కామన్ ఫెసిలిటీ సెంటర్, వన్ స్టాప్ సూపర్ మార్కెట్, రెస్టారెంట్, అతిథి గదులు, ఏటీఎం, బ్యాంక్, ఫుడ్‌కోర్టు, హాల్ తదితర వసతులు ఏర్పాటు చేస్తున్నారు.

ఏయే రకాల పరిశ్రమలు

ఎలక్ట్రిక్ వాహనాలు, రక్షణ శాఖ, అంతరిక్ష ప్రయోగ రాకెట్లకు ఉపయోగపడే పరికరాలు, ప్రెసిషన్ ఇంజినీరింగ్ పరిశ్రమలు, సోలార్ ప్యానళ్లు, సోడా, చాక్లెట్, బిస్కెట్లు తయారీ యంత్రాలు, డ్రిల్లింగ్ పరికరాలు, ఇటుకలు, టైల్స్, నిర్మాణ సామగ్రి, మౌల్డింగ్ ఫర్నిచర్,



ఎలక్ట్రిక్, ఎలక్ట్రానిక్స్, ఫుడ్ ప్రాసెసింగ్ పరికరాలు, ప్రింటింగ్ మిషన్లు.

2025 నాటికి పూర్తి

మూడేళ్ల వ్యవధిలో పరిశ్రమలను నెలకొల్పి ఉత్పత్తి ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కరోనాతో అంతరాయం ఏర్పడి కొన్ని పరిశ్రమలు మాత్రమే గడువులోగా పూర్తయ్యాయి. ప్రస్తుతం సుమారు ఆరువేల మంది ఉపాధి పొందుతున్నారు. 2025 డిసెంబరు నాటికి అన్ని పరిశ్రమల్లో ఉత్పత్తి ప్రారంభమవుతుందని భావిస్తున్నారు.

డ్రిల్లింగ్ పరికరాలు తయారు చేసే పరిశ్రమ

మౌలిక సదుపాయాలు

పార్కులో రాష్ట్ర ప్రభుత్వం రూ.236 కోట్లు ఖర్చు చేసి విద్యుత్తు, నీటి సరఫరా, డ్రైనేజీ వ్యవస్థ, తదితర మౌలిక సదుపాయాలు కల్పించింది.

పచ్చదనంతో కనువిందు

హరిత పారిశ్రామిక వాడ పేరుకు తగినట్టుగా నలభై వేల మొక్కలు నాటారు. బిందు సేద్యం పైపులు మొక్కలకు అమర్చి పెంచుతున్నారు. ఈ పారిశ్రామిక పార్కు లోకల్ అథారిటీ (ఐలా) ఏర్పాటు చేశారు. ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్ పారిశ్రామిక పార్కులో పని చేసే కార్మికులు, ఉద్యోగులు ఇంటి నుంచి పనికి వెళ్లి వచ్చేలా (వాక్ టు వర్క్) ఈ ప్రాంగణంలో నివాసం ఉండేలా ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్ నిర్మించేందుకు 194 ఎకరాల భూమిని కేటాయించారు.

విదేశాలకు ఎగుమతి

ఇక్కడ తయారయ్యే వివిధ ఉత్పత్తులు అమెరికా, కెనడా, బ్రిటన్, జర్మనీ, ఆస్ట్రేలియా, ఆఫ్రికా, న్యూజిలాండ్, అరబ్ దేశాలకు ఎగుమతి అవుతున్నాయి.

సదుపాయాలు బాగున్నాయి– రమణి, మహిళా పారిశ్రామికవేత్త

మల్కాపురం హరిత పారిశ్రామిక పార్కులో స్థలం కొనుగోలు చేశాను. ప్రజల ఆరోగ్యానికి, పర్యావరణానికి ఉపయోగపడే బయోడీగ్రేడబుల్ పరిశ్రమను ఏర్పాటు చేశాను. ఇక్కడ పరిశ్రమల నిర్వహణకు అన్ని రకాల సదుపాయాలున్నాయి. స్థానికులకు ఉపాధి లభిస్తుంది.

000 పరిశ్రమలు ఏర్పాటు కావొచ్చు

– కె.సుధీర్‌రెడ్డి,'టిఫ్' అధ్యక్షుడు

ఇది దక్షిణ భారతదేశంలో అతి పెద్ద ఎంఎస్ఎంఈ పార్కు. ఇక్కడ సేకరించిన 1886 ఎకరాల్లో సుమారు రెండు వేల పరిశ్రమలు ఏర్పాటయ్యే అవకాశముంది. పారిశ్రామిక పార్కుకు అనుబంధంగా టౌన్‌షిప్, ఈ పార్కులో 132 కేవీ విద్యుత్తు సబ్ స్టేషన్, మిషన్ భగీరథ పథకంలో కొయ్యలగూడెం నుంచి ప్రత్యేకంగా నీటి పైపులైను, పార్కు ఎదుట జాతీయ రహదారిపై ఫ్లైఓవర్ బ్రిడ్జి ఏర్పాటు చేయించాలని జిల్లా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డిలకు టిఫ్ ప్రతినిధులం వినతిపత్రాలిచ్చాం.

సేకరించిన భూమి (ఎకరాలు) – 1886

ఎంఎస్ఎంఈ పరిశ్రమలకు – 542

ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలకు – 231

టాయ్స్ పార్కు – 106

ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్ – 194

ప్లగ్ అండ్ ప్లే షెడ్లు – 74

## మత్తుతో సంపాదనకు ఎత్తు

హైదరాబాద్: అనతికాలంలో కోటీశ్వరుడై పోవాలని కలలుగన్న ఒక కెమిస్ట్.. స్నేహితుల్ని భాగస్వాములుగా చేసుకుని ఆల్ప్రాజోలం తయారీ దందా మొదలుపెట్టాడు. సరకు తయారుచేసి నిజామాబాద్‌లో విక్రయించే తరుణంలో ఆబ్కారీ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ఈ చీకటి దందా గుట్టును రట్టు చేసింది. ఐదుగుర్ని అరెస్టు చేసి రూ.30 లక్షల విలువైన 3 కిలోల ఆల్ప్రాజోలం, ముడిసరకు స్వాధీనం చేసుకున్నారు. ఘట్‌కేసర్ మండలం కాచెవానిసింగారంలో ఆబ్కారీ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వీబీ కమలాసన్‌రెడ్డి శనివారం వివరాలు తెలిపారు. స్నేహితులతో కలిసి..: సూర్యాపేట జిల్లాకు చెందిన మేన శ్రీనివాస్(49) బీఎస్సీ కెమిస్ట్రీ చదివాడు. కొన్ని ఫార్మా కంపెనీల్లో కెమిస్ట్‌గా పనిచేసిన అతడు రెండు దశాబ్దాల క్రితం హైదరాబాద్‌కు మకాం మార్చాడు. ప్రముఖ కంపెనీల్లో పనిచేసిన అతను కోటీశ్వరుడైపో వాలనుకున్నాడు. గాజులరామారం, నాగోల్, వనస్థలిపురం ప్రాంతానికి చెందిన స్నేహితులు కాకర చంద్రశేఖర్(47), పోలిశెట్టి రాంబాబు, తాటి లక్ష్మణ్‌లతో కలిసి కూకట్‌పల్లిలోని నర్మదా కెమికల్స్ యజమాని రాజేశ్వరరావు(61) దగ్గర ముడిసరకు కొన్నారు. శాస్త్రవేత్తగా పనిచేసే సీపీరెడ్డి దగ్గర రూ.2 లక్షలకు ఆల్ప్రాజోలం తయారీ ఫార్ములా, జీడిమెట్లలో ఉపకరణాలను కొనుగోలు చేశారు. ఆల్ప్రాజోలం విక్రయిం చేందుకు నిజామాబాద్ జిల్లాలోని ఓ వ్యక్తిని సంప్రదించారు. ఘట్‌కేసర్ మండలం కాచెవాని సింగారంలోని దివ్యానగర్  గేటెడ్ కమ్యూనిటీలో విల్లా అద్దెకు తీసుకున్నారు.

# ఆక్రమణల దరువు.. గుండె చెరువు

సిరిసిల్ల: జలవనరులను ఆక్రమణదారులు మింగేస్తున్నారు. నిర్మాణ వ్యర్థాలు.. మట్టితో చదునుచేస్తున్నారు. ఎప్పుడో మొదలైన ఆక్రమణలు.. ఇప్పటికీ కొనసాగుతూనే ఉన్నాయి. చెరువులు, కుంటల ఆక్రమణలతో కబ్జాదారుల పంట పండుతోంది. సమీపంలోని వ్యవసాయ, బోరుబావుల్లో భూగర్భజలాలు అడుగంటుతున్నాయి. శిఖం, మత్తడి ప్రవాహ మార్గాల కబ్జాలతో వరదనీరు వెళ్లడం లేదు. పట్టణాల్లోని కాలనీలకు ప్రవాహం చేరడంతో చెరువులను తలపిస్తున్నాయి. పంట పొలాల ముంపుతో రైతులు నష్టపోతున్నారు. నిలువరించాల్సిన అధికారులు చేపట్టడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా చెరువుల ఆక్రమణలు ఇదేమాదిరి కొనసాగుతున్నాయి. చాలారోజులుగా ఇలాంటి పరిస్థితే ఉందని అధికారులు చేతులు దులిపేసుకుంటున్నారు. ప్రస్తుతం జరుగుతున్న ఆక్రమణలను మాత్రం



పట్టించుకోవడంలేదు. సిరిసిల్ల పట్టణంలో 17, వేములవాడ పట్టణం, గ్రామీణ మండలాల చుట్టుపక్కన 8 చెరువులు, కుంటలు ఆక్రమణలకు గురైనట్లు అధికారులు ఇప్పటికే గుర్తించారు. కొన్నిచోట్ల చెరువుల్లో మట్టినింపి ఏకంగా ప్లాట్లుగా చేసి క్రయవిక్రయాలు చేపడుతున్నారు. పట్టణ ప్రాంతాల్లో ఇలాంటి పరిస్థితి ఉంటే.. గ్రామాల్లో పంట పొలాలను సాగుచేస్తూ.. భూమిని చదునుచేసుకుంటూ శిఖంలోకి వస్తున్నారు. దీంతో చెరువులు, కుంటల్లో నీటినిల్వ సామర్థ్యం తగ్గిపోతోంది. ఫలితంగా ఆయకట్టుకు నీరందని పరిస్థితి నెలకొంది. మిషన్‌కాకతీయలో చెరువుల అభివృద్ధికి ముందు అప్పటి ప్రభుత్వం ప్రతి చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిని గుర్తించింది. ప్రతి చెరువుకు జియో ఐడీలను నమోదు చేసి వాటి విస్తీర్ణం, ఆయకట్టు వివరాలను నమోదు చేశారు. తర్వాత వీటి నిర్వహణ సక్రమంగా చేపట్టలేదు. ఆక్రమణలు పెరిగి చెరువుల్లో నిర్మాణాలు వెలుస్తుండటం వల్ల పర్యావరణ సమతుల్యత దెబ్బతింటోంది. ఏడాదిన్నర క్రితం చెరువుల ఆక్రమణలపై ఫిర్యాదులు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో రెవెన్యూ, నీటిపారుదల శాఖలు సంయుక్తంగా సర్వేచేసి హద్దులు ఏర్పాటు చేయాలని ఉత్తర్వులు జారీ చేసింది. అందులో సరైన విధివిధానాలు, అవసరమయ్యే నిధుల కేటాయింపులో స్పష్టతలేకపోవడంతో అవి బుట్టదాఖలయ్యాయి. మున్సిపల్, రెవెన్యూ, నీటిపారుదల, సర్వేలాండ్ రికార్డులశాఖ మధ్య సమన్వయంలేక ఎవరూ పట్టించుకోవడంలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిని ఆసరాగా చేసుకొని అక్రమార్కులు ఇష్టారాజ్యంగా నీటి వనరులను ఆక్రమించుకుంటున్నారు.

కోనరావుపేట మండలం వట్టిమల్లలోని రాయినిచెరువు విస్తీర్ణం 50 ఎకరాలు. శిఖం ఆక్రమణలతో ప్రస్తుతం 15 ఎకరాలకు చేరింది. అటవీ ప్రాంతం నుంచి వచ్చే వరదనీటితో ఈ చెరువు నిండుతుంది. దీనికింద 200 ఎకరాల ఆయకట్టుకు రెండు పంటలకు నీరందడం తోపాటు చుట్టూ ఉన్న తండాల్లో భూగర్భజలాల వృద్ధికి ఉపయోగ పడుతుంది. ఆక్రమణలకు గురైన చెరువును పరిరక్షిస్తే మెట్టప్రాంతంలో సాగు, తాగునీటి ఇబ్బందులు తొలగుతాయి.

సిరిసిల్ల పట్టణంలోని ఈదుల చెరువు విస్తీర్ణం 160 ఎకరాలు. నిర్మాణ వ్యర్థాలు.. కొందరు ఆక్రమణదారులు మట్టితో చదును చేస్తూ ఆక్రమించేస్తూ ఇంటి నిర్మాణాలు చేపడుతున్నారు. ఈ కారణంగా ప్రస్తుతం 70 ఎకరాలు కూడా విస్తీర్ణం లేని పరిస్థితి. ఇందులోకి వచ్చే వరదనీటి కాల్వ సైతం నామరూపాల్లేకుండా పోయింది. పట్టణంలో 18 చెరువుల పరిస్థితి ఇలాగే ఉంది. ఈ కారణంగా చిన్నపాటి వర్షాలకే కాలనీల్లోకి వరద నీరు ముంచెత్తుతోంది.

అధికారులు ఏమంటున్నారంటే..సిరిసిల్ల పట్టణంలోని ఈదుల చెరువులో అక్రమ నిర్మాణాలను గుర్తించాం. వాటికి అనుమతులు ఇవ్వడం లేదని పట్టణ ప్రణాళికాధికారి అన్సారీ తెలిపారు. చెరువుల్లో జరుగుతున్న నిర్మాణాలను నిలిపివేయా లని మా సిబ్బంది వెళితే అక్కడివారంతా ఏకమై సిబ్బందిపైకి గొడవకు వచ్చారు. చెరువులు, కుంటల ఆక్రమణలను ఇప్పటికే గుర్తించామని డీఈ క్రాంతి పేర్కొన్నారు. రెవెన్యూ, సర్వేఅధికారులు సంయుక్తంగా కలిసివస్తేనే చెరువులకు హద్దులు నిర్ణయించడం సాధ్యమవుతు ఒదన్నారు.

వనరులను కాపాడితేనే మనుగడ

నరేష్, వట్టిమల్ల, కోనరావుపేట మండలం

చెరువును పూడ్చివేయకుండా అధికారులే చొరవ తీసుకోవాలి. నీటి వనరులను రక్షిస్తే మాకు ఏడాదికి రెండు పంటలకు సాగునీరు అందుతుంది. గ్రామాల్లో భూగర్భజలాలు నిలకడగా ఉండి తాగునీటికి ఇబ్బందులు లేకుండా ఉంటాయి. ఆక్రమణలు ఇలాగే కొనసాగితే చెరువులు రూపు కోల్పోయి నీటినిల్వ సామర్థ్యం పూర్తిగా తగ్గుతుంది. సాగు భూములు బీడుగా మారతాయి. చెరువును కాపాడాలని రెండేళ్లుగా జిల్లా అధికారులను కలిసి వినతి పత్రాలు ఇస్తున్నా స్పందనలేదు.

# కరుణించిన గోదారి

హైదరాబాద్: నగరానికి తాగునీటిని అందించే జలాశయాలు అడుగంటుతున్న నేపథ్యంలో పెద్ద ఊరట దక్కింది. గోదావరి పరివాహక ప్రాంతంలో వర్షాలతో ఎగువ ప్రాంతం నుంచి ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి వరద చేరుతోంది. గురువారం ఒక్కరోజే 0.109 టీఎంసీల దాకా వచ్చింది. ఈ నీళ్లు వచ్చే 93 రోజులు నగరానికి తరలించడానికి సరిపోతాయని అధికారులు తెలిపారు. మహా నగరానికి అవసరమైన తాగునీటిని నాగార్జునసాగర్, ఎల్లంపల్లి, జంట జలాశయాలు, సింగూరు, మంజీరాల నుంచి నిత్యం తరలిస్తున్న సంగతి తెలిసిందే. గతేడాది తగినంత వర్షాలు లేక ఈ ఏడాది మార్చినాటికి జలాశయాల్లో నీటి మట్టాలు తగ్గుతూ వచ్చాయి. కీలకమైన నాగార్జునసాగర్, ఎల్లంపల్లి ప్రాజెక్టుల్లో ఆందోళనకర స్థాయికి మట్టాలు తగ్గడంతో జలమండలి అత్యవసర పంపింగ్ ప్రారంభించింది. ప్రస్తుతం నాగార్జునసాగర్ నుంచి అత్యవసర పంపింగ్‌తో నిత్యం 270 మిలియన్ గ్యాలన్లు తరలిస్తున్నారు. ఎల్లంపల్లిలో ఇటీవలి వరకు అత్యవసర పంపింగ్‌తో 172 ఎంజీడీలు తరలించారు. తాజాగా ఎల్లంపల్లికి వరద రావడంతో... జలాశయంలో ఏర్పాటుచేసిన పంపులు, మోటార్లను తొలగించి ఒడ్డుకు చేర్చారు. ప్రస్తుతం పంపింగ్ లేకుండానే అప్రోచ్ ఛానల్‌లోకి వరద నీరు చేరుతోందని అధికారులు తెలిపారు. వానలు కురుస్తుండటంతో మున్ముందు వరద పెరిగే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు. సాగర్‌లో మాత్రం మరికొన్నాళ్లు అత్యవసర పంపింగ్ ఉంటుందన్నారు.

# మత్తు వదిలితేనే భవిష్యత్తు



మేడిపల్లి: గంజాయి మహమ్మారిని రాష్ట్రం నుంచి తరిమికొట్టాలని ముఖ్యమంత్రి పోలీసు శాఖకు దిశానిర్దేశం చేశారు. ఈ మేరకు అన్ని జిల్లాల్లో పోలీసులు గంజాయి నిర్మూలనకు తమవంతు ప్రయత్నాలు చేస్తున్నారు. కానీ నిందితులు వివిధ మార్గాల్లో గంజాయి తదితరాలను రవాణా, విక్రయిస్తూ ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ఉమ్మడి జిల్లాలో పలు సందర్భాల్లో నిందితులను అరెస్టు చేస్తున్నా గంజాయి ప్రభావం తగ్గడం లేదు. అధికారులతోపాటు కుటుంబసభ్యులు, స్వచ్ఛంద సంస్థలు వ్యసనపరులను త్వరగా గుర్తించి బయట పడేస్తేనే వారు జీవితంలో రాణిస్తారు. లేదంటే వారు మత్తులో జోగుతూ జీవితాన్ని నాశనం చేసుకుంటారు.

గోదావరిఖనికి చెందిన ఓ యువకుడు దుకాణంలో పని చేస్తూ కుటుంబానికి చేదోడుగా ఉండేవాడు. స్నేహితుల వల్ల అతనికి గంజాయి అలవాటైంది. కొద్ది రోజులకే ఆ మత్తు లేకుండా ఉండలేని పరిస్థితికి చేరుకున్నాడు. పనిపై ఆసక్తి తగ్గింది. ఆరోగ్యం పాడయింది. చివరికి అనారోగ్యంతో చిన్న వయసులోనే మృతి చెందాడు.

కరీంనగర్‌కు చెందిన యువతికి హైదరాబాద్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌తో వివాహం జరిగింది. ఎన్నో ఆశలతో అత్తగారింట్లో అడుగుపెట్టిన యువతికి కొన్నాళ్లకే భర్త గంజాయికి అలవాటుపడినట్లు గుర్తించి మానసికంగా కుంగిపోయింది. కొద్ది రోజులకు డ్రగ్స్ కూడా తీసుకోవడం.. వికృతంగా ప్రవర్తిస్తుండటంతో పెద్ద మనుషులు పంచాయితీ నిర్వహించి భర్తతో విడాకులు ఇప్పించారు. పచ్చని సంసారంలో గంజాయి నిప్పులు పోసింది.

నాందేడ్ నుంచి..

కోరుట్ల, మెట్‌పల్లి, జగిత్యాల ప్రాంతాలకు నాందేడ్ నుంచి గంజాయి రవాణా అవుతోంది. మహారాష్ట్రలో చాలా మంది గంజాయి సాగు చేస్తుండగా ఇటీవల మెట్‌పల్లిలో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. నాందేడ్‌లోని ఓ మురికివాడలో అమ్ముతున్న గంజాయిని పొట్లాలుగా చేసి రైలు, బస్సు మార్గాల్లో జగిత్యాల జిల్లాకు తరలించి విక్రయిస్తున్నారని తేలింది. గంజాయి కేసులో జులై 8న ముగ్గురిని, జులై 9న ఇద్దరిని అరెస్టు చేశారు. పెద్దపల్లి జిల్లా బసంత్‌నగర్ కన్నాల టోల్‌ప్లాజా సమీపంలో జులై 7న ఇద్దరిని అరెస్టు చేయగా మహారాష్ట్ర నుంచి తరలిస్తున్నట్లు తెలిపారు.

ఒడిశా..ఒడిశా నుంచి హైదరాబాద్‌కు, అక్కడి నుంచి ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు గంజాయి రవాణా జరుగుతోంది. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రూరల్ పరిధిలో పోలీసులు జులై 2న 14.59 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని ప్రశ్నిస్తే ఒడిశా నుంచి గంజాయి తరలించినట్లు ఒప్పుకొన్నాడు.

ఏపీ..

రాజమండ్రి నుంచి దిల్లీ రైలులో గంజాయి తరలిస్తుండగా పెద్దపల్లి పోలీసులు ఇటీవల పట్టుకున్నారు. ఈ ఏడాది మార్చిలో జగిత్యాలలో సంచలనం రేపిన మైనర్ల గంజాయి కేసులో పోలీసులు అయిదుగురిని అరెస్టు చేయగా ఏపీలోని సీలేరు నుంచి తరలించినట్లు తెలిపారు. మే 31న కరీంనగర్‌లో కారులో 100 కిలోల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. విశాఖపట్నం నుంచి గంజాయి తెస్తున్నట్లు నిందితులు పేర్కొన్నారు.

జీవితాన్ని చిత్తు చేస్తుంది ఇలా..

గంజాయి నేరుగా మనిషి మెదడుపై ప్రభావం చూపించడం ప్రారంభిస్తుంది. కళ్లు ఎర్రగా, మత్తుగా కనిపిస్తాయి. విపరీతంగా ప్రవర్తిస్తారు.

కోపం, చిరాకు పెరుగుతుంది.

తల్లిదండ్రులకు ఎదురు మాట్లాడుతుంటారు. గట్టిగా హెచ్చరిస్తే దాడులకు కూడా తెగబడుతుంటారు.

వినియోగం పెరిగిన కొద్దీ వారి ప్రవర్తన తీరు కూడా అలాగే మారుతూ వెళ్తుంది.

చివరికి జీర్ణ వ్యవస్థపైనా ప్రభావం చూపి ఆకలి వేయదు.

ఆహారం సరిగా తీసుకోకపోవడంతో శారీరకంగా బలహీనమై ఆరోగ్యం దెబ్బతింటుంది.

బలవుతున్న బాల్యం

ఉమ్మడి జిల్లాలో గంజాయి మత్తుకు కొందరు బాలలు కూడా బలవుతున్నారు. జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నంలో జులై 6న రెండు ద్విచక్ర వాహనాలపై వెళ్తున్న వారు పోలీసుల తనిఖీలు చూసి పారిపోయేందుకు యత్నించారు. వారిలో ఇద్దరిని పోలీసులు పట్టుకోగా ఇద్దరూ మైనర్లే కావడం.. వారి వద్ద 750 గ్రాముల గంజాయి దొరకడంతో విస్తుపోయారు. నాందేడ్‌లో విక్రేత ఉన్నట్లు గుర్తించి అక్కడికి వెళ్లిన పోలీసులకు బాలుడే నిందితుడు కావడం ఆశ్చర్యానికి గురి చేసింది. ముగ్గురినీ జువైనల్ హోంకు తరలించారు. జగిత్యాలలో సంచలనం రేపిన గంజాయి కేసులోనూ బాలికలకు గంజాయి సరఫరా చేసిన వారిలో మైనర్లు ఉన్నట్లు తెలియడంతో పోలీసులు అవాక్కయ్యారు. బాలబాలికలకు చాక్లెట్ల రూపంలోనూ విక్రయిస్తూ వారి జీవితాలను నాశనం చేస్తున్నారు. పాఠశాలలు, కళాశాలల పరిసరాల్లో గంజాయి అమ్ముతున్నట్లు ఆరోపణలున్నాయి. చాలా సందర్భాల్లో అమ్మేవారు, కొనుగోలు చేసేవారు మైనర్లే కావడం గంజాయి తీవ్రతను తెలియజేస్తోంది.

కోలుకునేందుకు మూడేళ్లు

డాక్టర్ రాము, హెల్పింగ్‌హాండ్స్ డీఅడిక్షన్ సెంటర్, హన్మకొండ

గంజాయి, కొకైన్ లాంటి మత్తు పదార్థాలు యువకులు, మైనర్ల శరీరం, మానసిక స్థితిపై తీవ్ర ప్రభావం చూపుతాయి. విపరీత మానసిక ప్రభావంతో కోపం, చిరాకు, అసాంఘిక కార్యకలాపాలు, నేరాలకు పాల్పడే అవకాశం కూడా ఉంది. డ్రగ్స్‌కు అలవాటుపడిన వారు పూర్తిగా కోలుకునేందుకు మూడేళ్లు పడుతుంది. డీఅడిక్షన్ కేంద్రంలోకి డ్రగ్స్‌కు అలవాటుపడిన వారు వస్తే మూడు నెలల్లో వివిధ స్థాయిల్లో మందులు, కౌన్సెలింగ్ ఇస్తాం. యువకులు, స్వచ్ఛంద సంస్థల వారు కలసి ముందుకు కదిలితేనే డ్రగ్స్ మహమ్మారిని తరిమేయవచ్చు.

పటిష్ఠ నిఘాఅశోక్‌కుమార్, ఎస్పీ, జగిత్యాల

జిల్లాలో గంజాయి రవాణా, అమ్మకాలపై నిఘా పెంచాం. అమ్మినవారు, కొనుగోలు చేసినవారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. జిల్లా సరిహద్దులతో పాటు అన్ని ప్రాంతాల్లో మా సిబ్బంది సోదా చేస్తున్నారు. యువకులు, మైనర్లు సహా ఎవరూ డ్రగ్స్ బారిన పడకుండా కుటుంబసభ్యులు జాగ్రత్త వహించాలి. గంజాయి అమ్మకాలపై సమీపంలోని పోలీస్ స్టేషన్‌కు సమాచారమిస్తే నిందితులపై చర్యలు తీసుకుంటాం.

# అంత మా ఇష్టం

కరీంనగర్ : ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధులు ఉద్యోగులు. సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు చేరేలా, సకాలంలో సేవలందేలా, సర్కారు కార్యక్రమాలు సరిగా అమలయ్యేలా చూడాల్సిన బాధ్యత వారిపై ఉంది. ప్రజలకు జవాబుదారీతనంగా ఉండాల్సిన చాలామంది ఉద్యోగులు వేళాపాలా లేకుండా కార్యాలయాలకు వస్తున్నారు. బయోమెట్రిక్ యంత్రాలు లేకపోవడంతో ఇష్టారాజ్యంగా విధులకు హాజరవుతున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలను పరిశీలించింది. కొందరు ఉద్యోగులు సమయానికి రాగా, చాలామంది ఆలస్యంగా వచ్చారు. పలుచోట్ల ప్రజలు అధికారుల కోసం ఎదురుచూడడం కనిపించింది.

నింపాదిగా వచ్చి...జిల్లా విద్యా శాఖ కార్యాలయంలో డీఈవో ఇక్కడికి రాకుండానే పాఠశాలల పర్యవేక్షణకు వెళ్లారు. ఒక సూపరింటెండెంట్ సెలవులో ఉన్నారు. మరొకరు సమయానికి వచ్చారు. సమగ్ర శిక్షా విభాగంలోని సెక్టోరల్ అధికారుల్లో కోఆర్డినేటర్-4 ఉదయం 10.45, కంప్యూటర్ ఆపరేటర్ 11 గంటలకు వచ్చారు. పరీక్షల విభాగంలో జూనియర్ అసిస్టెంట్ మినహా మిగిలిన వారు 11 గంటల వరకూ రాలేదు. జిల్లా విద్యాశాఖ సీనియర్ అసిస్టెంట్లలో స్కూల్ అసిస్టెంట్ సెక్షన్ ఉద్యోగి 10.45కు, ఎస్టాబ్లిష్, ఆర్‌టీఐ సెక్షన్ ఉద్యోగి 11 గంటల తర్వాత వచ్చారు. కార్యాలయంలో లేట్ రిజిస్టర్ కనిపించలేదు.

ఉదయం ఠంచన్‌గా.. మధ్యాహ్నం డీలా

కరీంనగర్ నగర పాలక సంస్థ కార్యాలయంలో బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి కావడంతో ఉద్యోగులు ఠంఛన్‌గా వచ్చారు. కమిషనర్ ఉదయం 10.58 గంటలకు రాగా, డిప్యూటీ కమిషనర్ కలెక్టరేట్ సమావేశానికి వెళ్లారు. 10.30 గంటల నుంచే ప్రజాపాలన దరఖాస్తుల పరిశీలనకు ప్రజలుబారులు తీరగా, కంప్యూటర్ ఆపరేటర్లు సేవలందించారు. అవుట్‌డోర్ స్టాఫ్ మధ్యాహ్నం మూడు గంటలకు నగర పాలికకు రావాల్సి ఉండగా ఇంజినీరింగ్ విభాగంలో ఇంజినీర్లు సాయంత్రం 4.50 గంటల వరకూ హాజరుకాలేదు.

కార్పొరేషన్‌సమయానికి ఒకరే ..కరీంనగర్ రూరల్ ఎలక్ట్రిసిటీ రెవెన్యూ ఆఫీస్ (ఈఆర్వో) కార్యాలయంలో జూనియ ర్ అకౌంట్స్ అధికారి మాత్రమే సమయానికి వచ్చారు. మిగిలిన 12 మంది పది నిమిషాలు ఆలస్యంగా వచ్చారు. ఏఏవో మాత్రం బిల్లుల వసూలును పర్యవేక్షించడానికి వెళ్లినట్లు ఉన్నతాధికారులు తెలిపారు. కరీంనగర్ ఒకటో ఈఆర్‌వో కార్యాలయంలో తొమ్మిది మందికిగాను ముగ్గురు విధులకు సకాలంలో హాజరుకాలేదు.

మధ్యాహ్నం వరకు తాపీగా..

మధ్యాహ్నం 12 గంటలకు ఖాళీగా అగ్రికల్చర్ టెక్నికల్ కార్యాలయ సిబ్బంది కుర్చీలుజిల్లా వ్యవసాయ శాఖ అధికారి కార్యాలయం ఉద్యోగులు మధ్యాహ్నం వరకు వస్తూ..నే ఉన్నారు. జిల్లా అధికారి ఉదయం పదకొండు గంటలకు వచ్చారు. ముగ్గురు 10.30 గంటలకు మరో ఆరుగురు 10.45 వరకు విధులకు హాజరై సంతకం చేశారు. ఏడీఏ పదకొండు గంటలకు, మరో ముగ్గురు 12 గంటలకు తాపీగా వచ్చారు. దీనిపై జిల్లా వ్యవసాయాధికారి బి.శ్రీనివాస్‌ను వివరణ కోరగా.. మధ్నాహ్నం వరకు హాజరు కాని వారితో క్యాజువల్ లీవ్ పెట్టిస్తానని తెలిపారు.

వాహనదారుల ఎదురుచూపులు

జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో ఉద్యోగులతోపాటు ఏవో, అటెండర్లు, ఇతర సిబ్బంది ఉదయం పది గంటలకే విధుల్లో ఉన్నారు. హోంగార్డులు, కానిస్టేబుళ్లలో కొందరు పది గంటలకు, మరికొందరు అరగంట తర్వాత వచ్చారు. ముగ్గురు ఇన్‌స్పెక్టర్లు 10.40 గంటల తర్వాత వచ్చారు. అప్పటి వరకు లెర్నింగ్, డ్రైవింగ్ టెస్ట్, వాహనాల ఫిట్‌నెస్, రిజిస్ట్రేషన్‌కు వచ్చిన వాహనదారులు ఎదురు చూడాల్సి వచ్చింది.కలెక్టరేట్‌లో 11 గంటల తర్వాతే..

పరిపాలన విభాగంలో..

కలెక్టరేట్ పరిపాలన విభాగంలో సగానికి పైగా సిబ్బంది 10.30 గంటలకు హాజరుకాలేదు. ఎన్నికల విభాగంలో 10 మంది సిబ్బంది పని చేస్తుండగా.. ఇద్దరు మాత్రమే సమయానికి వచ్చారు. సర్వే ల్యాండ్ రికార్డు కార్యాలయంలో ఉన్న సిబ్బందిలో ఇద్దరు మాత్రమే విధులకు హాజరయ్యారు. ఏడీ ఎప్పుడొస్తారని అటెండర్‌ను అడిగితే.. క్యాంపు వెళ్లారని సమాధానం ఇచ్చారు. ట్రెజరీ కార్యాలయంలో సెక్షన్ ఇన్‌ఛార్జి మినహా.. మిగిలిన సిబ్బంది కుర్చీలు ఖాళీగా కనిపించాయి.

రోగుల నిరీక్షణ ఈఎన్‌టీ వైద్యులు రాకపోవడంతో రోగుల ఎదురుచూపులు..

ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో సగానికి పైగా వైద్యులు విధులకు రాలేదు. కొందరు ఆలస్యంగా రావడంతో రోగులు ఇబ్బందులు పడ్డారు. డాక్టర్లు ఉదయం తొమ్మిది గంటలకు రావాల్సి ఉండగా 9.48 గంటల వరకూ ఓపీ గదులు మూసే ఉన్నాయి. కొందరు రెగ్యులర్ వైద్యులు రాకపోవడంతో పీజీలు, ఎస్‌ఆర్‌లు చికిత్స అందించారు. ఐసీయూలో కూడా ఎస్‌ఆర్ చికిత్స అందించడం విశేషం. ఈ విషయంపై ఆసుపత్రి సూపరింటెండెంట్ వీరారెడ్డిని వివరణ కోరగా విధులకు ఆలస్యంగా వస్తున్న వైద్యులపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తెలిపారు.విద్యుత్తు వినియోగదారుల ఇబ్బందులు

విద్యుత్తు సంస్థ ఈఆర్‌వో కార్యాలయం ఆవరణలో ప్రైవేటు విద్యుత్తు బిల్లుల వసూలు కేంద్రంలో మూడు కౌంటర్లు ఉన్నాయి. ఇద్దరు బిల్ కలెక్టర్లు సమయానికి రాగా, ఒకరు 9.48 గంటలకు వచ్చారు. అప్పటి వరకు వినియోగదారులు ఇబ్బందిపడ్డారు.పంచాయతీలు విలవిల.. నిలిచిన 15వ ఆర్థిక సంఘం నిధులు

జగిత్యాల గ్రామీణం: గ్రామ పంచాయతీల అభివృద్ధికి నిధుల విడుదలలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర జాప్యం చేస్తున్నాయి. గ్రామ పంచాయతీలలో నిధులు లేక కార్మికుల, ఆపరేటర్ల వేతనాలు కూడా చెల్లించలేని పరిస్థితి నెలకొంది. జిల్లాలో మొత్తం 380 గ్రామ పంచాయతీలు ఉండగా గ్రామీణ ప్రాంతాల్లో 9 లక్షలకుపైగా జనాభా ఉంది. పెద్ద గ్రామ పంచాయతీలకు నిధులు పుష్కలంగా ఉండగా చిన్న గ్రామ పంచాయతీలు, ఆదాయం లేని పంచాయతీలకు నిధుల కొరత ఏర్పడింది. 2023-24 సంవత్సరానికి రూ.59.45 కోట్లు 15వ ఆర్థిక సంఘ నిధులు విడుదల కాగా రాష్ట్ర ప్రభుత్వం అందించే గ్రాంట్ కేవలం రూ.3.64 కోట్లు మాత్రమే విడుదలయ్యాయి. గతేడాది నవంబర్ నుంచి 15వ ఆర్థిక సంఘం నిధులు నిలిచిపోగా రాష్ట్ర ప్రభుత్వం అందించే నిధులు 2022 నుంచి నిలిచిపోయాయి. 2019 సెప్టెంబర్‌లో గత ప్రభుత్వం పల్లె ప్రగతి కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ కార్యక్రమంలో కేంద్రం నుంచి ఎన్ని నిధులు వస్తే రాష్ట్ర ప్రభుత్వ అంతే మొత్తం నిధులు కలిపి ప్రతి నెలా ఇచ్చేది. జిల్లాకు ప్రతి నెలా రూ.6.50 కోట్ల నుంచి రూ.7.50 కోట్ల వరకు నిధులు వచ్చేవి. వచ్చిన నిధులతో పారిశుద్ధ్యం, వేతనాలు, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టే వారు. కొద్ది నెలలు సరిగా వచ్చినా ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధులు పూర్తిగా నిలిపేయగా కేంద్రం నుంచి వచ్చే 15వ ఆర్థిక సంఘ నిధులు మాత్రమే విడుదల చేస్తున్నారు. 8 నెలలుగా నిధులు రాకపోవటంతో పల్లెల్లో అభివృద్ధి కుంటుపడింది. సిబ్బందికి వేతనాలు లేవు గ్రామాల్లో 2023-2024 సంవత్సరానికి పన్నులు దాదాపు వసూలు చేసి ఖర్చు చేశారు. దీనికి తోడు ప్రభుత్వం నుంచి వచ్చే నిధులు రాకపోటంతో 380 గ్రామ పంచాయతీల కార్మికులకు మూడు నెలలుగా వేతనాలు నిలిచిపోయాయి. డాటా ఎంట్రీ ఆపరేటర్లు 70 మంది వరకు ఉండగా వారికి సైతం రెండు నెలలుగా వేతనాలు రాక అప్పులు చేయాల్సి వస్తుందని వాపోతున్నారు. పంచాయతీలు చెల్లించే వీధి దీపాల బిల్లు రూ.16.88 కోట్లకుపైగా పెండింగ్‌లో ఉంది. జిల్లాలో పల్లె ప్రగతి కార్యక్రమంలో 251 ట్రాక్టర్లను రుణం రూపంలో తీసుకున్నారు. ఇందులో కొన్ని ట్రాక్టర్ల ఈఎంఐలు పూర్తికాగా ఇంకా దాదాపు 111 వరకు ట్రాక్టర్ల ఈఎంఐలు పెండింగ్‌లో ఉన్నాయి. నిధులు లేక చెల్లింపులు నిలిచిపోయాయి. ప్రభుత్వం అందజేసే గ్రాంట్, కేంద్ర ప్రభుత్వం అందజేసే 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయాలని కోరుతున్నారు.

# ఉద్యోగ విరమణలే.. భర్తీ శూన్యం

భువనగిరి : మహిళా శిశు సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన అంగన్‌వాడీల ఉద్యోగ విరమణలతో భారీగా ఖాళీలు ఏర్పడ్డాయి. సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకం (ఐసీడీఎస్)లో భాగంగా జిల్లాలో 1982 నుంచి కేంద్రాలు నిర్వహిస్తున్నారు. వీటిలో టీచర్లు, హెల్పర్లు(ఆయాలు) సేవలు అందిస్తున్నారు. ఉద్యోగ విరమణ వయస్సును నిర్ణయించకపోవడంతో నియామకం నాటి నుంచి వారే విధుల్లో కొనసాగుతున్నారు. అక్రమాలకు పాల్పడిన వారిని తొలగించడం, ఎవరైనా మరణించడం, స్వచ్ఛందంగా తప్పుకోవడం తప్ప విరమణకు ప్రభుత్వం వయస్సు నిర్ధారించలేదు. జీవో నెంబర్ 10, తేదీ 5.9.2023 ప్రకారం ప్రతిఏటా ఏప్రిల్ 30వ తేదీ నాటికి 65 ఏళ్లు నిండిన అంగన్‌వాడీ టీచర్లు, మినీ అంగన్‌వాడీ టీచర్లు, సహాయకులు( ఆయాలకు) ఉద్యోగ విరమణ చేయాల్సి ఉంటుందంటూ ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. 65 ఏళ్లు నిండిన వారిని విధుల నుంచి తప్పించాలని తాజాగా గత జూన్ నెల 29న మెమో నెం. 1334ను జారీ చేసింది. జులై నాలుగో తేదీ నుంచి వారిని విధుల్లో రావొద్దని సీడీపీవోలు ఆదేశించారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో 19 టీచర్లు, 102 మంది ఆయాలు(హెల్పర్లు) ఉద్యోగ విరమణ పొందారు.

ఆయాల వయస్సుతో పేచీ..

65 ఏళ్లు నిండిన వారిని తొలగించాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొన్నా.. ఆయాల వయస్సు నిర్ధారణలో పేచీ నెలకొంది. టీచర్ల వయస్సు 10వ తరగతి సర్టిఫికెట్ ఆధారంగా నిర్ధారిస్తున్నా.. ఆయాల విషయంలోనే వివాదం కొనసాగుతోంది. ఆధార్‌లో వయస్సు తప్పుగా పడిందని, తమకు 65 ఏళ్లు నిండలేదని సర్వీస్‌లో కొనసాగించాలని కోరుతున్నారు. జిల్లాలో 13 మంది కొనసాగించాలని కోరుతున్నారు. 2024-25 ఎన్‌హెచ్‌టీఎస్-ఈఎంఎస్ (ఎంప్లాయిస్ మేనేజ్ సిస్టం) ప్రకారం 65 ఏళ్లు నిండితే ఉద్యోగ విరమణ చేయించాలని, తేడా ఉంటే ఆధార్, లేదా జిల్లా మెడికల్ బోర్డు సర్టిఫికెట్, ఎముకల డెన్సిటీ నిర్ధారణ ధ్రువీకరణ పత్రం ఆధారంగా వయస్సు నిర్ధారించాలని ఆదేశించారు. ఎముకల డెన్సిటీ నిర్ధారణ సర్టిఫికెట్ గాంధీ, ఉస్మానియా ఆసుపత్రుల్లో మాత్రమే అందుబాటులో ఉంది.

ఒక్కసారిగా ఉద్యోగ విరమణ జరగడంతో ఆయా కేంద్రాల నిర్వహణ భారంగా మారింది. ఇంతకు ముందే జిల్లాలో సుమారుగా వందకుపైగా పోస్టులు ఖాళీలుగా ఉన్నాయి. ఖాళీలు ఏర్పడిన చోట పక్క కేంద్రాల నిర్వాహకులకు అదనపు బాధ్యతలు అప్పగించి వాటిని నడిపిస్తున్నారు. కొన్నింటిలో ఆయాలతో, మరికొన్నింటిలో టీచర్లతోనే నెట్టుకొస్తున్నారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా మొత్తం 60 టీచర్ పోస్టులు, 233 ఆయా పోస్టులు ఖాళీలు ఉన్నాయి.

సేవలు కొనసాగేలా చర్యలు - కృష్ణవేణి, జిల్లా సంక్షేమ అధికారి, యాదాద్రి భువనగిరి జిల్లాఅంగన్‌వాడీ సిబ్బంది ఉద్యోగ విరమణతో ఖాళీలు ఏర్పడిన కేంద్రాల నిర్వహణకు ఇబ్బంది ఏమీ లేదు. ప్రత్యామ్నాయ చర్యలు తీసుకున్నాం. పక్క కేంద్రాల నిర్వాహకులకు అదనపు బాధ్యతలు అప్పగించాం. ఆయా, టీచర్లలో సేవల్లో ఇబ్బందులు ఏర్పడకుండా చర్యలు తీసుకుంటున్నాం.

# కులాంతర వివాహం.. అందని ప్రోత్సాహకం

సూర్యాపేట :చివ్వెంల మండలంలో ఎస్సీ కులానికి చెందిన శ్రీకాంత్, అదే గ్రామానికి చెందిన బీసీ కులానికి చెందిన మమతను... పెద్దలను ఒప్పించి 2023 అక్టోబరులో ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఆ మరుసటి నెలలో ప్రభుత్వం అందించే కులాంతర వివాహ ప్రోత్సాహకానికి దరఖాస్తు చేసుకున్నాడు. ఏడు నెలలు గడిచినా నేటికీ అది అందలేదు. ఈ విషయమై అధికారులను సంప్రదిస్తే ప్రభుత్వం నుంచి నిధులు రావాల్సి ఉందని చెబుతున్నారని తెలిపాడు. కులాంతర వివాహాలను ప్రోత్సహించడంలో భాగంగా ప్రభుత్వం కల్యాణలక్ష్మి తరహాలో నగదు అందిస్తోంది. ప్రస్తుతం సమాజంలో వస్తున్న మార్పుల కారణంగా చాలా వరకు కులాంతర వివాహం చేసుకుంటున్నారు. వారికి ఆర్థికంగా బాసటగా నిలవాలనే ఉద్దేశంతో వివాహం చేసుకున్న ఆ జంటకు ప్రోత్సాహకం అందిస్తున్నారు. 2011 వరకు ఇది రూ.10 వేలు ఉండగా.. 2012లో రూ.50 వేలకు పెరిగింది. ఆ తర్వాత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి దీనిని రూ.2.50 లక్షల వరకు పెంచి అందిస్తున్నారు. ఆశయం బాగున్నా.. నిధుల లేమి కారణంగా గత ఏడాది నుంచి దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.

అంతరాలు దూరం చేయాలని...కులాంతర వివాహం చేసుకున్న వారికి సమాజం నుంచి సహకారం అందదు. దీంతో వారు ఆర్థికంగా ఇబ్బందులు పడే పరిస్థితులు తలెత్తు తుంటాయి. ఈ నేపథ్యంలో వారికి రూ.2.50 లక్షల ప్రోత్సాహకం ప్రభుత్వం అందిస్తోంది. ఈ మొత్తాన్ని దంపతుల సంయుక్త ఖాతాలో మూడేళ్ల ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తున్నారు. ఇందుకు దంపతులు జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ సంచాలకుల కార్యాలయంలో దరఖాస్తులను అందించాల్సి ఉంది. దంపతుల్లో ఒకరు షెడ్యూల్డ్ కులానికి చెందిన వారై ఉండాలి. వివాహ



చట్టం - 1955 కింద నమోదై ఉండాలి. మొదటి పెళ్లికి మాత్రమే ఇది వర్తిస్తుంది. వివాహమైన ఏడాది లోపు జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది.

667 మంది ఎదురుచూపులు

ఉమ్మడి జిల్లాలో కులాంతర వివాహాలకు సంబంధించి ఇప్పటి వరకు సుమారు 667 వరకు దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటికి రూ.16.67 కోట్లు రావాల్సి ఉంది. ప్రభుత్వం నుంచి నిధులు సకాలంలో రావడం లేదు. దీంతో లబ్ధిదారులకు నిరీక్షణ తప్పడం లేదు.అప్పుడప్పుడు వచ్చే అరకొర నిధులను వరుస క్రమంలో పది మందికి చొప్పున అందిస్తున్నారు. ఏడాదికి మూడు సార్లు పది మందికి చొప్పున మంజూరు కావడంతో చాలా మంది అర్హులు ఎదురు చూస్తున్నారు. పైగా చాలా మందికి ఆర్థిక సాయంపై అవగాహన లేకపోవడంతో దరఖాస్తు చేసుకోవడం లేదు.అధికారులు గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తే అర్హులందరు సాయం పొందే అవకాశం ఉంది.

ప్రభుత్వం నుంచి నిధులు రావాల్సి ఉంది : లత, జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి, సూర్యాపేట

కులాంతర వివాహాలకు సంబంధించి ప్రోత్సాహకం మంజూరు కావడం లేదు. ప్రభుత్వం నుంచి ఒకేసారి విడుదల కావడం లేదు. నిధులు సరిపోను రాకపోవడంతో కొంత మందికి అందిస్తున్నాం. బకాయిల విషయమై ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి నివేదిస్తున్నాం.







## బెంగాల్‌లో ఉద్రిక్తంగా విద్యార్థుల ఆందోళన

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లో జూనియర్ వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటన రాష్ట్ర ప్రభుత్వాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి మమతాబెనర్జీ రాజీనామా చేయాలంటూ విద్యార్థి సంఘం 'పశ్చిమబంగా ఛాత్రో సమాజ్' మంగళవారం నిరసన చేపట్టింది. 'నబన్నా అభియాన్' పేరుతో హావ్‌డా నుంచి విద్యార్థులు ర్యాలీని ప్రారంభించారు.

అయితే, వీరిని పోలీసులు అడ్డుకోవడంతో హావ్‌డాలోని సంతర్‌గాచి వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. మార్చ్ లో పాల్గొన్న ఆందోళనకారులు బారికేడ్లను బద్దలుకొట్టేందుకు ప్రయ త్నించారు. కొన్నింటిని లాగి పడేశారు. పోలీసులపైకి రాళ్లు రువ్వారు. దీంతో పోలీసులు వీరిపై బాష్పవాయువు ప్రయోగించారు. లాఠీఛార్జ్ చేసి గాల్లోకి కాల్పులు జరిపారు. ప్రస్తుతం అక్కడ ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఈ ర్యాలీ నేపథ్యంలో సీఎం మమతా బెనర్జీ నివాసం వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. ఆందోళన నిర్వహించేందుకు అనుమతి కోరుతూ ఎలాంటి అభ్యర్థన రాలేదని పోలీసులు తెలిపారు.

**నలుగురు విద్యార్థుల అరెస్టు..** అలాగే ఈ మార్చ్ జరిగే సమయంలో హింసకు పాల్పడేందుకు కుట్ర పన్నారని ఆరోపిస్తూ నలుగురు విద్యార్థులను అరెస్టు చేశారు. ఆ విషయాన్ని ఎక్స్ వేదికగా వెల్లడించారు. ఆ విద్యార్థులు అర్ధరాత్రి సమయంలో అదృశ్యమయ్యారని భాజపా నేత సువేందు అధికారి ఆరోపించారు. విద్యార్థులు మిస్ అయ్యారంటూ కొందరు రాజకీయ నేతలు తప్పుడు ప్రచారానికి పాల్పడుతున్నారని బెంగాల్ పోలీసులు ఎక్స్ వేదికగా స్పందించారు. ఎవరూ అదృశ్యం కాలేదన్నది నిజమని తెలిపారు. దీనికి సువేందు బదులిస్తూ.. "ఆ విద్యార్థుల కుటుంబాలు హైకోర్టును ఆశ్రయించాయి. మమతా పోలీస్.. కోర్టులో కలుద్దాం" అని పోస్టు పెట్టారు.

ఈ ఆందోళన నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకో కుండా కోల్‌కతా పోలీసు విభాగం 6 వేలమందిని మోహరించింది. అలాగే ఈ పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు 26 జిల్లాల కలెక్టర్లు బాధ్యతలు అప్పగించింది. హేస్టింగ్స్‌లోని ఫోర్ట్ విలియం గేట్లకు సివిక్ వాలంటీర్లు గ్రీజ్ పూసిన దృశ్యాలు మీడియాలో వెలుగులోకివచ్చాయి. నిరసనకారుల్ని అడ్డుకునేందుకు అధికారులు ఈ విధంగా చేశారు. ఈ మార్చ్ నేపథ్యంలో ప్రజాజీవితానికి ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రభుత్వం ముందు జాగ్రత్త చర్యలు చేపట్టింది. పాఠశాలలకు సెలవులు ప్రకటించింది. నబన్నా(సచివాలయం) ర్యాలీ భాజపా-ఆర్‌ఎస్‌ఎస్ ప్రేరేపితమని వామపక్ష నాయకురాలు బృందాకారాట్ తీవ్ర విమర్శలు చేశారు.

## పక్కపక్కనే భారత్, చైనా యుద్ధ నౌకలు.. శ్రీలంక తీరంలో అనూహ్య పరిణామం

ఓ వైపు లద్దాఖ్ సరిహద్దులో సైనిక ప్రతిష్టంభన.. మరోవైపు హిందూ మహాసముద్రంలో పట్టు కోసం ప్రయత్నాలు.. ఇలా అనేక అంశాల్లో గత కొంతకాలంగా భారత్, చైనా మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఈ పరిణామాల వేళ అనూహ్య సంఘటన చోటుచేసుకుంది. శ్రీలంక తీరంలో ఇరు దేశాల యుద్ధ నౌకలు పక్కపక్కనే లంగరేశాయి. క్షిపణి విధ్వంసక భారత యుద్ధ నౌక 'ఐఎన్‌ఎస్ ముంబయి' సోమవారం అధికారిక పర్యటన నిమిత్తం కొలంబో తీరానికి చేరుకుంది. అదే సమయంలో చైనాకు చెందిన మూడు యుద్ధ నౌకలు 'హీ ఫీ', 'వుజిషాన్', 'క్విలియాన్‌షాన్' కూడా ఇదే పోర్టుకు అధికారిక పర్యటనకు వచ్చాయని శ్రీలంక నేవీ ఓ ప్రకటనలో వెల్లడించింది. మూడు రోజుల పర్యటన నిమిత్తం 'ఐఎన్‌ఎస్ ముంబయి' శ్రీలంక తీరానికి వెళ్లింది. 163 మీటర్ల పొడవైన ఈ డెస్ట్రాయర్‌లో 410 మంది సిబ్బంది ఉన్నారు. ఈ నౌకకు శ్రీలంక నేవీ సాదర స్వాగతం పలికింది. స్వదేశీ పరిజ్ఞానంతో నిర్మించిన ఈ నౌకను 2001లో భారత నేవీలోకి తీసుకున్నారు. ఈ నౌక శ్రీలంక పోర్ట్‌కు వెళ్లడం ఇదే తొలిసారి. శ్రీలంక నౌకాదళంతో కలిసి ఇది పలు కార్యక్రమాల్లో పాల్గొననుంది. ఇక, 'ఐఎన్‌ఎస్ ముంబయి' కొలంబో తీరంలో ఉన్న సమయంలోనే చైనా యుద్ధనౌకలు కూడా అక్కడకు చేరుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. 'హీ ఫీ' యుద్ధ నౌకలో 267 మంది, 'వుజిషాన్'లో 872 మంది, 'క్విలియాన్‌షాన్'లో 334 మంది చైనీస్ సిబ్బంది ఉన్నారు. ఇవి హిందూ మహాసముద్రంలోకి ప్రవేశించినప్పటికీ నుంచి వీటి కదలికలను భారత నేవీ ఎప్పటికప్పుడు నిశితంగా పరిశీలిస్తూనే ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.

## పోలీస్ స్టేషన్ ఎదుట ఎమ్మెల్యే అస్మిత్‌రెడ్డి ధర్నా.. తాడిపత్రిలో ఉద్రిక్తత





తాడిపత్రి: అనంతపురం జిల్లా తాడిపత్రి గ్రామీణ పోలీస్ స్టేషన్ ఎదుట ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి ధర్నాకు దిగారు. అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న టిప్పర్లను మంగళవారం జేసీ ప్రభాకర్‌రెడ్డి అనుచరులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో అక్రమ రవాణాదారులు, జేసీ అనుచరుల మధ్య వాగ్వాదం, తోపులాట జరిగింది. ఇసుక అక్రమ రవాణా చేస్తున్న వారిపై కేసు నమోదు చేయాలని సీఐ లక్ష్మీకాంతరెడ్డికి ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి ఫోన్ చేశారు. 'నువ్వు చెబితే నేను కేసు పెట్టాలా?' అంటూ ఎమ్మెల్యేతో సీఐ నిర్లక్ష్యంగా మాట్లాడినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో తెదేపా కార్యకర్తలతో కలిసి ఎమ్మెల్యే అస్మిత్‌రెడ్డి తాడిపత్రి పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. సీఐకి వ్యతిరేకంగా పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

## దందా చేసి దూరం కావొద్దు... జేసీ సంచలన వ్యాఖ్యలు



అనంతపురం, ఆగస్టు 27: తాడిపత్రి మున్సిపల్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నేత జేసీ ప్రభాకర్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇసుక అక్రమ రవాణాకు సంబంధించి మంగళవారం జేసీ వీడియోను విడుదల చేశారు. ఈ సందర్భంగా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న వారికి హెచ్చరికలు జారీ చేశారు. తన దగ్గర వాళ్లే ఇసుక దందా చేస్తున్నారంటూ సెన్సేషనల్ కామెంట్స్ చేశారు. "నా దగ్గరి వాళ్లే 25 మంది ఇసుక దందా చేస్తున్నారు.. ఈ పనులు ఆపండి.ఎందుకు మీరే సంపాదించుకోవాలా? నేను సంపాదించుకోవద్దా?.. కానీ నా నియోజకవర్గంలో ఇసుక దందా వద్దు. నా కోసం ఐదు సంవత్సరాలు పని చేశారు. మీకు కావాలంటే వేరే విధంగా సహాయం చేస్తా క.. నీ ఇసుక దందా వద్దు.. నాకు దూరం కాకండి" అంటూ జేసీ వీడియోలో పేర్కొన్నారు.

**మరిన్ని జేసీ కామెంట్స్...** తాడిపత్రి నియోజకవర్గంలో మొత్తం 25 మంది ఇసుక దందా చేస్తున్నారని.. వారందరూ తనకు ఆప్తులన్నారు. ఐదు సంవత్సరాలుగా తనతో పాటు కష్టపడ్డారని తెలిపారు. ఇసుక దందాను మానుకోండి అని వినతి చేశారు. నియోజకవర్గంలో 2.50లక్షల మంది ఓటర్లు ఉంటే డబ్బులు కావాల్సింది కేవలం ఈ 25 మందికేనా ప్రశ్నించారు. దయచేసి దూరం చేసుకోవద్దని కోరారు. " గత ప్రభుత్వంలో ఇసుకు అక్రమ రవాణాపై గ్రీన్ ట్రిబ్యునల్, సుప్రీంకోర్టు, హైకోర్టుకు వెళ్లి మరీ పోరాడాను. నన్ను పట్టుకుని అన్ని ఊర్లు తిప్పి, పోలీస్‌స్టేషన్‌కు తిప్పితే.. మీ దయ వల్లే బయటకు వచ్చా. కానీ ఇసుక దందా చేసి దూరం కావొద్దు. ఇటీవల ఏసీబీ విచారణ జరిగింది. మీకు వచ్చేది ఏమీ లేదు" అని స్పష్టం చేశారు. "టిప్పర్ ఓనర్లకు ఇదే నా హెచ్చరిక.. మీ బండ్లు బయటకు రావు. నా నియోజకవర్గంలో మాత్రం ఇసుక అక్రమ రవాణా చేయొద్దు. మీరే డబ్బులు సంపాదించుకోవాలా?... నేను ఎంతో పోగుట్టుకున్నాను. నేను సంపాదించుకోవద్దా?.. మీకు అమ్మడం కూడా చేతకాదు.. మీరు ఎవరిని ఉపయోగించుకుంటున్నారో నాకు తెలుసు. గత ప్రభుత్వ హాయంలోని వ్యక్తుల సాయం లేకుండా ఒక ట్రిప్పును కూడా అమ్ముకోలేరు. ఇళ్లు నిర్మించేందుకు ఇసుకను తీసుకెళ్లొచ్చన్నారు. దయచేసి దూరం కావొద్దు. ఐదేళ్లు నాకోసం కష్టపడ్డారు. మీకు వేరే విధంగా సహాయం చేయగలను. టిప్పర్‌లు నా నియోజకవర్గంలో తిరిగితే.. వదిలిపెట్టేది లేదు. ఇసుక దందా చేసి నాకు దూరం కావొద్దు. అక్రమ ఇసుక రవాణా చేయొద్దు. విచారణ జరుగుతోంది.. జాగ్రత్త'' అంటూ జేసీ ప్రభాకర్ రెడ్డి హెచ్చరించారు.

## వైసీపీ అధిష్టానంపై బాలినేని సంచలన కామెంట్స్..



అమరావతి, ఆగస్టు 27: వైసీపీ అధిష్టానంపై ఆ పార్టీ నేత, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస్ రెడ్డి సంచలన కామెంట్స్ చేశారు. పార్టీ తనను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అంతేకాదు.. తానే పార్టీకి దూరంగా ఉంటున్నట్లు ప్రకటించారు.

ఎన్నికలు ముగిసిన తరువాత నుంచి పార్టీకి దూరంగా ఉంటున్నానని అన్నారు. తనను పార్టీ పట్టించుకోకపోవడమే ఇందుకు కారణమని చెప్పుకొచ్చారు. మంగళవారం నాడు మీడియాతో మాట్లాడిన బాలినేని శ్రీనివాసరెడ్డి.. తనపై వస్తున్న అవినీతి ఆరోపణలు, వైసీపీకి దూరంగా ఉండటానికి గల కారణాలు, ఏ పార్టీలో చేరబోతున్నారనే పలు అంశాలపై కీలక వ్యాఖ్యలు చేశారు.

**వైసీపీని వీడే ఛాన్స్?...** వైసీపీని వీడుతున్నారా? అని మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా.. పార్టీనే తనను దూరం పెట్టిందని చెప్పుకొచ్చారు బాలినేని శ్రీనివాస్ రెడ్డి. ఈవీఎంలపై తాను చేస్తున్న పోరాటానికి పార్టీ నుంచి ఎలాంటి సపోర్ట్ అందడం లేదన్నారు.

ఇదే విషయాన్ని పార్టీ పెద్దలకు చెబుదామని ప్రయత్నించానని, కనీసం ఎవరూ వినే పరిస్థితిలో కూడా లేరన్నారు. పార్టీ కోసం కష్టపడి పని చేశానని.. అయినా ఎవరూ తన వైపు చూడటం లేదన్నారు. అందుకే ఎన్నికల తరువాత మాత్రం పార్టీకి దూరంగా ఉంటున్నట్లు స్పష్టం చేశారు శ్రీనివాస్ రెడ్డి.

**జనసేనలోకి వెళ్తున్నారా?...** కొందరు తనపై రకరకాల ప్రచారాలు చేస్తున్నారని, అవన్నీ అవాస్తవాలని ఖండించారు. తాను జనసేనలోకి వెళ్తున్నానని ప్రచారం చేస్తున్నారని.. బహుశా జనసేనలోకి వెళ్లకుండా ఉండేందుకు కూడా ఇలా తనపై ఆరోపణలు చేస్తున్నారేమో అని బాలినేని వ్యాఖ్యానించారు. తనకు ప్రజల మద్ధతు ఉందని.. ఎవరికీ భయపడే ప్రసక్తే లేదన్నారు. పార్టీ తనను పట్టించుకున్నా.. పట్టించుకోకున్నా తనకు ప్రజలు ఉన్నారన్నారు. వారి కోసం తాను పోరాడుతానని బాలినేని శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. ఇక అవినీతి ఆరోపణలపై స్పందించిన బాలినేని.. ప్రభుత్వం వారిదే ఉందని, నచ్చిన దర్యాప్తు సంస్థలతో తనపై విచారణ చేయించుకోవచ్చునని ఓపె ఆఫర్ ఇచ్చారు.

## తణుకు అన్న క్యాంటీన్‌పై వైసీపీ సైకో బ్యాచ్ విషప్రచారం



అమరావతి, ఆగస్టు 27: తణుకు అన్న క్యాంటీన్‌లో ప్లేట్ల అంశంపై వైసీపీ విష ప్రచారం చేస్తోందని మంత్రి నారా లోకేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. చేతులు కడిగే సింక్‌లో తినే ప్లేట్లు పడేసింది వైసీపీ మూకలే అని అన్నారు. విషప్రచారం చేసేందుకే సైకో బ్యాచ్ ఈ పనిచేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. చేతులు కడిగే స్థలంలో వైసీపీ మూకలు అన్నం ప్లేట్లు వేసి వీడియో తీశారన్నారు. సింక్‌లో ఉన్న ప్లేట్లు తీస్తుంటే.. వాటిపై దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. శుభ్రం చేయని ప్లేట్లను వాడుతున్నారంటూ విమర్శిస్తున్నారని మండిపడ్డారు. అన్న క్యాంటీన్లపై సైకో జగన్ విషం చిమ్మటం కొనసాగిస్తూనే ఉన్నారంటూ లోకేష్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కాగా.. తణుకు అన్న క్యాంటీన్లో మురికి నీటితో ప్లేట్లను శుభ్రం చేస్తున్నారంటూ ఓ వీడియో సోషల్ మీడియాలో హల్ చల్ చేస్తోంది. మురికి నీటితోనే శుభ్రం చేసి.. అందులోనే భోజనాన్ని వడ్డిస్తున్నారంటూ ఓ వ్యక్తి చెబుతున్నట్లుగా వీడియోలో ఉంది. దీంతో వైసీపీ శ్రేణులు ఆ వీడియోను వైరల్ చేయడంతో పాటు ప్రభుత్వం తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పిస్తున్న పరిస్థితి. అయితే వైసీపీ మూకలే ఇలాంటి విష ప్రచారాలు చేస్తోందని మంత్రి లోకేష్ దుయ్యబట్టారు. చేతులు కడిగే సింక్‌లో తినే ప్లేట్లు వేసింది వైసీపీ శ్రేణులే అని మంత్రి వ్యాఖ్యలు చేశారు. మరోవైపు తణుకు అన్నక్యాంటీన్ వీడియో గురించి మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ ఆరా తీశారు. అన్న క్యాంటీన్‌లో శుభ్రత విషయంపై హరేకృష్ణ మూమెంట్ ప్రతినిధులు, అధికారుల అడిగి వివరాలు తెలుసుకున్నారు. అయితే అన్న క్యాంటీన్‌లో అప్రశుభత్రకు తావు లేదని.. మురికి నీటిలో ప్లేట్లు శుభ్రం చేస్తున్నారన్న వార్త అవాస్తమవి వారు స్పష్టం చేశారు. ఎక్కువ మంది రావడంతో డస్ట్‌బిన్‌కు బదులుగా చేతులు కడిగే సింగ్ వద్ద ప్లేట్లు పెట్టారని అధికారులు తెలిపారు. ఆ వీడియో అంత అబద్ధమని హరేకృష్ణ మూమెంట్ ప్రతినిధులు, అధికారులు తేల్చిచెప్పారు. కాగా... పేదవాడికి తక్కువ ధరకే అన్నం పెట్టాలనే ఉద్దేశంలో టీడీపీ ప్రభుత్వం అన్న క్యాంటీన్లను శ్రీకారం చుట్టింది. టీడీపీ హాయంలో సాఫీగా అన్న క్యాంటీన్లు.. 2019లో వైసీపీ ప్రభుత్వం వచ్చాక అన్నీ మూతపడ్డాయి. కొన్నింటిని సచివాలయాలుగాను, కొన్నింటిని ఇతర శాఖల కార్యాలయాలుగా మార్చి వేశారు. తిరిగి మరోసారి భారీ విజయంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అన్న క్యాంటీన్ల ప్రారంభానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మొదటి సంతకం చేశారు. ఈనెలలోనే పండుగ వాతావరణంలో అన్న క్యాంటీన్ల ప్రారంభోత్సవాలు జరిగాయి. కేవలం 15 రూపాయలకే (ఉదయం, మధ్యాహ్నం, రాత్రి) పేదవాడి ఆకలి తీరుస్తోంది అన్న క్యాంటీన్. అలాగే అన్న క్యాంటీన్ల నిర్వహణ కోసం భారీగా విరాళాలు ఇచ్చేందుకు చాలా మంది ముందుకు వస్తున్నారు.

## తెల్లవారేవరకు మదనపల్లి సబ్‌కలెక్టరేట్‌లోనే సీఐడీ అధికారుల తిష్ట



అన్నమయ్య జిల్లా, ఆగస్టు 27: రాష్ట్రంలో సంచలనం సృష్టించిన మదనపల్లి సబ్‌కలెక్టరేట్‌లో అగ్నిప్రమాద ఘటనలో సీఐడీ విచారణ కొనసాగుతోంది. రాత్రి 12:30 గంటల వరకు వీఆర్‌ఏ రమణయ్య, సీనియర్ అసిస్టెంట్ గౌతమ్ తేజను అధికారులు విచారించారు. వీడియో రికార్డింగ్ మధ్య సీన్‌ను రీకన్స్ట్రక్షన్ నిర్వహించారు. ఇద్దరు అనుమానితులను విచారించారు. అగ్నిప్రమాద ఘటన సమయంలో ఎక్కడి నుంచి మంటలు వ్యాపించాయి, ఎంతవరకు ఫైళ్లు దహనమయ్యాయి అనే కోణంలో ఫైర్ అధికారులను కూడా సీఐడీ అధికారులు విచారించారు. మంగళవారం తెల్లవారుజామున 3 గంటల వరకు సబ్ కలెక్టరేట్‌లోనే సీఐడీ అధికారులు తిష్ట వేసి మరీ విచారణను చేపట్టారు. కాగా.. అగ్నిప్రమాదంలో ఫైళ్ల దగ్ధం అయిన ఘటనను రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. ఎలాగైనా నిజనిజాలు బయటపెట్టాలనే ఉద్దేశంతోకేసును ఈనెల 8న పోలీసుల నుంచి సీఐడీకి బదిలీ చేస్తూ సర్కార్ నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో గత రాత్రి అన్నమయ్య జిల్లా అదనపు ఎస్పీ రాజ్‌కమల్, సీఐడీ డీఎస్పీ వేణగోపాల్ ఆధ్వర్యంలో విచారణను మొదలుపెట్టారు. జూలై 21న రాత్రి సమయంలో మదనపల్లి సబ్‌కలెక్టరేట్ కార్యాయలంలో అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో 22-ఏ సెక్షన్లో కీలకమైన ఫైళ్లు అగ్నికి ఆహుతయ్యాయి. వైసీపీ నేతల అక్రమాలు బయటకురాకుండా ఇలాంటి చర్యలు పాల్పిడినట్లు సమాచారం. ప్రమాద సమయంలో అక్కడే ఉన్న అగ్రహారం వీఆర్‌ఏ.. ఆర్డీఏకు సమాచారం అందజేశాడు. ఆర్డీఏ సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. అయితే ఈ ఘటనను రాష్ట్ర ప్రభుత్వం తీవ్రస్థాయిలో పరిగణించింది. డీజీపీ తిరుమలారావు, సీఐడీ చీఫ్ రవిశంకర్ అయ్యన్నార్‌ను ప్రత్యేక హెలికాప్టర్‌లో ఘటనా స్థలికి ప్రభుత్వం పంపించింది. అయితే ప్రమాదస్థలిని పరిశీలించిన పోలీసులు ఉన్నతాధికారులు.. ప్రమాదవశాత్తు జరిగింది కాదని.. ఉద్దేశపూర్వకంగానే ఫైళ్లను కాల్చివేశారని తేల్చిచెప్పారు. దీంతో ఈకేసును సీఐడీకి రాష్ట్ర ప్రభుత్వం అప్పగించింది. విచారణలో భాగంగా వీఆర్‌ఏ రమణయ్య, సీనియర్ అసిస్టెంట్ గౌతమ్ తేజ, ఇద్దరు ఆర్డీవోలను పోలీసులు విచారించారు. అంతేకాకుండా మదనపల్లి తాలూకా పోలీస్‌స్టేషన్‌లో ఎనిమిది మందిపై కేసు నమోదు చేశారు. మాజీ ఎమ్మెల్యే నవాజ్ భాషా, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ జింకా వెంకటచలపతి, పెద్దిరెడ్డి ముఖ్యఅనుచరుడు వి.మాధవరెడ్డి, శశిధర్ రెడ్డి ఇళల్లో సోదాలు చేసిన పోలీసులు పలు కీలక పత్రాలను స్వాధీనం చేసుకోవడంతో పాటు.. వీరందరిపైన నాన్‌బెయిలబుల్ వారెంట్‌ను జారీ చేశారు. అయితే సీబీఐ అధికారులు ఈ కేసుకు సంబంధించి పలువురిని రహస్యంగా విచారించగా పలు పుకార్లు షికార్లు చేసినేపథ్యంలో ఈనెల 23 నుంచి ప్రత్యక్షంగా రంగంలోకి దిగారు.

## మాపై అకారణంగా పిన్నెల్లి బ్రదర్స్ దాడి



పల్నాడు : మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిపై టీడీపీ నేత బుద్దా వెంకన్న తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. పిన్నెల్లి బ్రదర్స్ అకారణంగా తమపై దాడి చేశారని అన్నారు. మంగళవారం పల్నాడు జిల్లా అడిషినల్ ఎస్పీ లక్ష్మీపతిని బుద్దా వెంకన్న కలిశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... 2020 మార్చి 11న టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు చెబితేనే తాను, బోండా ఉమా మాచర్లకి వెళ్ళామని తెలిపారు. తమపై పిన్నెల్లి బ్రదర్స్ అకారణంగా దాడి చేశారన్నారు. ఈ దాడిలో పాత్రధారి తురకా కిషోర్, సూత్రధారి పిన్నెల్లి అని చెప్పుకొచ్చారు. "మా కారుపై పెద్ద పెద్ద రాళ్లతో కొట్టి దాడి చేశారు. మాపై దాడి చేసిన వారికి మాచర్ల మున్సిపల్ చైర్మన్ పదవి ఆఫర్ చేశారు. ప్రజల్ని భయభ్రాంతులకు గురి చేయడానికి మాపై దాడి ఒక సంకేతం" అని చెప్పుకొచ్చారు. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మాచర్లని పిన్నెల్లి తయారు చేశారని మండిపడ్డారు. తమపై దాడి చేసినప్పుడు ఏ పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని అప్పటి సంఘటలను గుర్తుచేశారు. అధికారం ఉంటే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి... లేకపోతే పిల్లి రామకృష్ణారెడ్డి అంటూ వ్యాఖ్యలు చేశారు. "మమ్మల్ని చంపడానికి పిన్నెల్లి పథకం వేశారు. మాపై దాడి కేసులో పిన్నెల్లి మొదటి ముద్దాయి" అని అన్నారు. పిన్నెల్లికి సవాల్ విసురుతున్నా... "నీకు మూతి మీద మీసం ఉంటే సరే చూకుందాం. అన్ని ఆలోచించే ఈ కేసు పెట్టాను. ఈ కేసులో నీకు శిక్ష పడే వరకూ నేను పోరాడుతాను. అధికారం ఉంది కాబట్టి అప్పుడు పిన్నెల్లి తప్పించుకున్నాడు. మాపై దాడి చేసి ఆ వీడియో క్లిప్పింగ్స్ కూడా వారే బయటకు వదిలారు. ఎస్పీకి ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. పవర్ ఉంటే ఒకలా పవర్ లేకపోతే ఒకలా ఉంటారు. పిన్నెల్లి అనే వాడు ఒక పిల్లి లాంటోడు. ఒక మంచి పని కోసం మమ్మల్ని చంద్రబాబు మాచర్లకు పంపారు. పిన్నెల్లి బ్రదర్స్ ప్రజాస్వామ్యంలో తిరగడానికి అనర్హుడు. పిన్నెల్లి దుర్మాగాలను ఇప్పటికైనా పూర్తిగా అణచివేయాలి" అని బుద్దావెంకన్న పేర్కొన్నారు.

# ఆయేషా ఖాన్.. చీరలో ఆ వయ్యారం అదరహో..

అందం, అభినయం, హాట్ ప్రెజెన్స్ తో టాలీవుడ్ లో విభిన్నమైన గుర్తింపు తెచ్చుకుంటున్న కొత్త తరం తారగా ఆయేషా ఖాన్ నిలుస్తోంది. బాలీవుడ్ లో మొదటగా తెరంగేట్రం చేసినప్పటికీ, తెలుగు ప్రేక్షకులకు దగ్గర కావడం ఆమెకు కొత్త ఊపు ఇచ్చింది. మొదట్లో చేసిన కొన్ని సినిమాలు ఆమెకు ఆశించినంత పేరును ఇవ్వకపోయినా, సోషల్ మీడియా వేదికగా ఆమె తన ప్రత్యేకతను చాటుకుంటోంది. ఇన్ స్టాగ్రామ్, ట్విట్టర్ లాంటి ప్లాట్‌ఫారమ్‌లలో ఆమె తరచూ యాక్టివ్ గా ఉంటూ, తన లేటెస్ట్ ఫోటోషూట్లను పంచుకుంటూ అభిమానులను అలరిస్తుంది. ఆయేషా ఖాన్ తన అందంతో పాటు గ్లామర్ చూపుల ద్వారా ప్రేక్షకులను కట్టిపడేస్తోంది. ఇటీవలే షేర్ చేసిన ఫొటోలలో అదిరిపోయే లుక్స్ తో నెటిజన్లను కట్టిపడేస్తోంది. చీరలో సింపుల్ హెయిర్ స్టైల్ లో ఉండి సాఫ్ట్ లుక్స్ తో ఆమె ఇచ్చిన ఫోజులు ఫ్యాన్స్ ను మంత్ర ముగ్ధులను చేశాయి. సాధారణంగా ఎప్పటికప్పుడు ట్రెండింగ్ ఫ్యాషన్ ఫోటోలు షేర్ చేయడం, విభిన్న లుక్ లలో కనిపించడం ఆమె ప్రత్యేకత. సోషల్ మీడియాలో మాత్రమే కాకుండా, ఫిల్మ్ ఇండస్ట్రీలో కూడా మంచి అవకాశాలను దక్కించుకుంటున్న ఆమె, కొన్ని ప్రాజెక్ట్స్ లో చిన్న పాత్రలు చేయడం ద్వారా తక్కువ సమయంలోనే మంచి పేరు తెచ్చుకుంది. టాలీవుడ్ లో ఆమె ప్రత్యేక ఫ్యాన్ బేస్ ఏర్పడడం వల్ల,



రాబోయే కాలంలో మరిన్ని భారీ ప్రాజెక్ట్స్ లో అవకాశం రాబోతోందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఆయేషా ఖాన్ తన కెరీర్ ప్రారంభం చేసినప్పట్నుంచి ఆరడుగుల అందం, వెరైటీ ఫ్యాషన్ సెన్స్ తో ప్రేక్షకుల మనసులు గెలుచుకుంటోంది. సినిమాల్లో హీరోయిన్ పాత్రలు కాకపోయినా, ప్రత్యేక సాంగ్స్, సైడ్ రోల్స్ తో మంచి గుర్తింపు తెచ్చుకుంటోంది. బిగ్ బాస్ హిందీ సీజన్-17 లో కూడా తన విశిష్టమైన ప్రెజెన్స్ చూపిస్తూ, ప్రేక్షకులను ఆకట్టుకోవడం ద్వారా తన గుర్తింపుని మరింత బలపరిచింది. సినిమాల్లో సరైన బ్రేక్ వస్తే, ఆమె తెలుగులో మరింత మెరుగైన అవకాశాలు పొందాలని ఆమె అభిమానులు ఆశిస్తున్నారు. ప్రస్తుతం దుల్కర్ సల్మాన్ లాంటి స్టార్ హీరోలతో ఆమెకు అవకాశం దక్కడం, ఆమె కెరీర్ కు కొత్త దిశగా మారే అవకాశాలు ఉన్నట్లు కనిపిస్తున్నాయి.

# సమంతతో ఆ భామ ఫైటింగులా?

సమంత మళ్లీ బిజీ అయ్యే ప్రయత్నాల్లో ఉన్న సంగతి తెలిసిందే. దీనిలో భాగంగా ఆదిత్యారాయ్ కపూర్ తో వెబ్ సిరీస్ లో నటించడానికి రెడీ అవుతోంది. యాక్షన్ బ్యాక్ డ్రాప్ లో ఈ సిరీస్ ని 'తుంబాడ్' ఫేం రాహి అనీల్ బర్వే దర్శకత్వం వహిస్తున్నారు. రాజ్ అండ్ డీకే ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఈ సిరీస్ తో ప్రేక్షకుల్ని ఓ కొత్త వరల్డ్ లోకి తీసుకెళ్లబోతున్నారుట. ఇప్పటి వరకూ వచ్చిన వెబ్ సిరీస్ లకు పూర్తి భిన్నంగా ఉ ంటుందని సమాచారం. ఇందులో సమంత భారీ యాక్షన్ సన్నివేశాల్లో కనిపించనుందని ఇప్పటికే లీకైంది. ఆ పాత్ర వర్కౌట్ అయితే సమంత ఇమేజ్ కూడా మారిపోతుందని యూనిట్ వర్గాలు



ధీమా వ్యక్తం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో తాజాగా మరో ఇంట్రెస్టింగ్ అప్ డేట్ అందింది. ఇందులో సమంతకు పోటీగా, ఆమెని ఢీకొట్టే పాత్ర కోసం వామికా గబ్బిని ఎంపిక చేసారుట. ఇద్దరి మధ్య వచ్చే యాక్షన్ సన్నివేశాలు సిరీస్ కి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని అంటున్నారు. అదే జరిగితే సమంత రేంజ్ రెట్టింపు అవుతుంది. ఇంతవరకూ సమంత యాక్షన్ నేపథ్యంతో కూడిన సినిమాలుగానీ, వెబ్ సిరీస్ గానీ చేయలేదు. ఇండియన్ వెర్షన్ 'సీటాడెల్' లో నటించింది.

కానీ అది ఇంకా రిలీజ్ అవ్వలేదు. అందులో ఆమె పాత్ర ఎలా ఉంటుంది? అన్న ఎగ్జైట్ మెంట్ అభిమానుల్లో కనిపిస్తుంది. ఇంతలో మరో వెబ్ సిరీస్ లో ఆసక్తికర పాత్రతో సామ్ పేరు మోతెక్కుతోంది. ఈ వెబ్ సిరీస్ కి ఇంట్రెస్టింగ్ టైటిల్ పరిశీలనలో ఉంది. ఆ టైటిల్ 'రక్తబ్రహ్మాండ్'. టైటిల్ యూనిక్ గా ఉంది. ఎన్ని భాషల్లోనైనా ఇదే టైటిల్ తో రిలీజ్ చేయొచ్చు. అలాగే సమంత బాలీవుడ్ లో సినిమాలు చేయడానికి గట్టి ప్రయత్నాలు చేస్తోన్న సంగతి తెలిసిందే. అమెరికా నుంచి తిరిగొచ్చిన తర్వాత ఆ పనుల్లోనే బిజీ అయింది. ఆమె నుంచి సినిమా ప్రకటన ఎప్పుడొస్తుందా? అని అభిమానులంతా ఎదురు చూస్తున్నారు.




# 'ఉరుకు పటేలా' ట్రైలర్.. ప్రేమలో సడన్ ట్విస్ట్




హుషారు మూవీతో మెప్పించి మంచి గుర్తింపు సంపాదించుకున్న యంగ్ అండ్ టాలెంటెడ్ యాక్టర్ తేజస్ కంచెర్ల.. నటిస్తున్న లేటెస్ట్ మూవీ ఉరుకు పటేలా. గెట్ ఉరికిఫైడ్ ట్యాగ్ లైన్ తో రూపొందుతున్న ఆ మూవీ రిలీజ్ కు సిద్ధమవుతోంది. వివేక్ రెడ్డి దర్శకత్వం వహిస్తున్న ఆ సినిమాలో ఖుష్భూ చౌదరీ హీరోయిన్ గా యాక్ట్ చేస్తోంది. ఇప్పటికే మేకర్స్ రిలీజ్ చేసిన టీజర్ తోపాటు పట్నం పిల్లా, ఓరి మాయలోడా సాంగ్స్.. సినీ ప్రియులను మంచి రెస్పాన్స్ అందుకున్నాయి. సెప్టెంబర్ స్టార్టింగ్ లో ఉరుకు పటేలా మూవీ ప్రేక్షకుల ముందుకు రానుంది. దీంతో మేకర్స్ ప్రమోషన్స్ లో స్పీడ్ పెంచారు. అందులో భాగంగా సోమవారం.. మూవీ ట్రైలర్ ను రిలీజ్ చేశారు. అయితే ఉరుకు పటేలా సినిమాను పూర్తిగా గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కించినట్లు ట్రైలర్ ద్వారా తెలుస్తోంది. లవ్ స్టోరీతో పాటు హారర్ కామెడీ కూడా యాడ్ చేసినట్లు అర్థమవుతోంది. దెయ్యంతో ప్రేమ ఎలా ఉంటుందో అనే కోణంలో కథను రాసుకున్నట్లు క్లియర్ గా తెలుస్తోంది. అయితే సినిమాలో నిరక్షరాస్యుడు అయిన హీరో.. చదువుకున్న అమ్మాయిని పెళ్లి చేసుకోవాలని కలలు కనేవాడు. అనుకున్నట్లే అతడిని డాక్టర్ అయిన హీరోయిన్ లవ్ చేస్తుంది. దీంతో అంతా షాక్ అయిపోతారు. కానీ అప్పుడు హీరోయిన్ లోని మరో కోణం బయటపడుతుంది. అప్పుడు హీరో భయపడి పారిపోవాలనుకుంటాడు. అసలు ఏం జరిగింది? హీరోయిన్ లోని ఇంకో కోణం ఏంటి? చివరకు ఏమైందో తెలియాలంటే సినిమా చూడాలనుంటున్నారు ఉరుకు పటేలా మేకర్స్. ఫన్నీ ఎలిమెంట్స్, థ్రిల్లింగ్ కాన్సెప్ట్ తో ట్రైలర్.. మూవీ లవర్స్ ను ఆకట్టుకుంటోంది. సోషల్ మీడియాలో తెగ చక్కర్లు కొడుతోంది. ప్రవీణ్ లక్కరాజు బ్యాక్ గ్రౌండ్ స్కోర్, సన్నీ కుర్రపాటి విజువల్స్ ఫుల్ రిచ్ గా ఉన్నాయి. మూవీకి బిగ్ అసెట్ గా మారాయి. హీరోహీరోయిన్ల ఎనర్జీ అట్రాక్టివ్ గా ఉంది. ఇద్దరి మధ్య కెమిస్ట్రీ బాగుంది. లవ్ స్టోరీ క్లిక్ అయినట్లు కనిపిస్తోంది. సినిమాలో తేజస్, చమ్మక్ చంద్ర మధ్య కామెడీ బాగానే వర్కౌట్ అయ్యే అవకాశం ఎక్కువ కనిపిస్తోంది. లీడ్ ఎడ్జ్ పిక్చర్స్ బ్యానర్ పై కంచర్ల బాల భాను ఉరుకు పటేలా మూవీని నిర్మిస్తున్నారు. గ్రామీణ ప్రాంతంలో ప్రత్యేకమైన ఎంటర్టైనర్‌గా ఉంటుందని మేకర్స్.. ట్రైలర్ రిలీజ్ సందర్భంగా హామీ ఇచ్చారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి అయిందని, పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుపుకుంటున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 7న ప్రపంచ వ్యాప్తంగా గ్రాండ్ గా విడుదల చేయనున్నట్లు మరోసారి వెల్లడించారు. మరి ఉరుకు పటేలా మూవీ.. ఆడియన్స్ ను ఎలా ఆకట్టుకుంటుందో వేచి చూడాలి.

# మెకానిక్ రాకీ కోసం స్టైలిష్ పాప్




యువ హీరో విశ్వక్ సేన్ తన తదుపరి చిత్రం 'మెకానిక్ రాకీ'తో దీపావళి రేసులో ఉన్నాడు. ఈ మాస్ యాక్షన్, కామెడీ ఎంటర్‌టైనర్ అక్టోబర్ 31న థియేటర్లలో విడుదల కానుంది. ఈ చిత్రానికి రవితేజ ముల్లపూడి దర్శకత్వం వహించగా, ప్రముఖ నిర్మాత రామ్ తల్లూరి SRT ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై నిర్మించారు. ఇప్పటికే విశ్వక్ సేన్ డిఫరెంట్ సినిమాలతో బాక్సాఫీస్ వద్ద మంచి రిజల్ట్ అందుకుంటూ ఉన్నాడు. ఇక ఇప్పుడు ఈ సినిమాపై కూడా ఆసక్తి పెరుగుతోంది. అయితే ఈ చిత్రంలో మీనాక్షి చౌదరి మరియు శ్రద్ధా శ్రీనాథ్ హీరోయిన్లుగా నటిస్తున్నారు.

ఈ చిత్రం ఒక ట్రయాంగిల్ ప్రేమకథతో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇక శ్రద్ధా శ్రీనాథ్ కు వెల్కమ్ చెప్పే మూమెంట్ మరింత ప్రత్యేకంగా మార్చడంలో భాగంగా, మేకర్స్ ఆమె ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో ఆమె స్లిట్ మాక్సీ డ్రెస్‌లో అందంగా కనిపిస్తున్నారు. ఆమె ముఖం మీద చిరునవ్వుతో ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. 'మెకానిక్ రాకీ' సినిమా భారీ బడ్జెట్‌తో, పెద్ద కాన్వాస్‌పై నిర్మించబడింది. ఈ చిత్రంలో ప్రతిష్టాత్మక టెక్నీషియన్లు పనిచేస్తున్నారు. జేక్స్ బెజోయ్ సంగీతం సమకూర్చగా, మనోజ్ కటసాని సినిమాటోగ్రఫీ నిర్వహించారు. అన్వర్ అలీ ఎడిటర్‌గా, క్రాంతి ప్రియం ప్రొడక్షన్ డిజైనర్‌గా వ్యవహరిస్తున్నారు. సత్యం రాజేష్ మరియు విద్యా సాగర్ జె ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్లుగా ఉన్నారు. ఈ సినిమాలో విశ్వక్ సేన్ మెకానిక్ పాత్రలో కనిపించనున్నాడు. ఈ పాత్ర ఆయన కెరీర్‌లో మరో మైలురాయిగా నిలిచే అవకాశం ఉంది. శ్రద్ధా శ్రీనాథ్ మరియు మీనాక్షి చౌదరి మధ్య ఉండే కెమిస్ట్రీ, సినిమా కథకు మరింత ఉ త్కంఠతను కలిగిస్తుందని మేకర్స్ తెలియజేశారు. ఈ కథలో కమెడీ, యాక్షన్ సరికొత్తగా ఉంటాయని దీంతో ప్రేక్షకులను పూర్తిగా ఎంటర్‌టైన్ అవుతారని అని తెలిపారు. శ్రద్ధా శ్రీనాథ్ ఇప్పటికే తన నటనతో తెలుగు ప్రేక్షకులకు ఎంతగానో దగ్గరైంది. ఈ చిత్రంలో ఆమె పాత్రకు మంచి ప్రాధాన్యత ఉన్నట్లు తెలుస్తోంది. విశ్వక్ సేన్, మీనాక్షి చౌదరి, మరియు శ్రద్ధా శ్రీనాథ్ మధ్య కెమిస్ట్రీ సినిమా ప్రేక్షకులకు ప్రత్యేక అనుభూతిని కలిగించేలా ఉండనుంది.

ఇప్పటికే విడుదలైన పోస్టర్స్ ప్రేక్షకులలో మంచి అంచనాలను సృష్టించింది. దీపావళి కానుకగా విడుదలవుతున్న ఈ చిత్రం, ప్రేక్షకులను థియేటర్లకు రప్పించేందుకు సిద్ధంగా ఉంది. సినిమాటోగ్రఫీ, సంగీతం, మరియు ఇతర సాంకేతిక విభాగాలు సినిమా స్థాయిని పెంచేలా ఉంటాయని అర్థమవుతుంది. ఇప్పటివరకు వచ్చిన సమాచారం ప్రకారం, 'మెకానిక్ రాకీ' సినిమాకు మంచి రెస్పాన్స్ వచ్చే అవకాశం ఉంది. ఈ దీపావళి సీజన్‌లో ప్రేక్షకులకు మోస్ట్ అవైటెడ్ ఎంటర్‌టైనర్‌గా నిలుస్తుందని భావిస్తున్నారు.

# ఒకే దెబ్బకు రెండు పిట్టలు పట్టిన పీసీ!

గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా ఇండియాలో హల్చల్ చేస్తోన్న సంగతి తెలిసిందే. అమ్మడు న్యూయార్క్ నుంచి ఇండియాకి రాగానే పనుల్లో నిమగ్నమైంది. ఓవైపు సోదరుడు సిద్దార్థ్ చోప్రా పెళ్లి...మరోవైపు పానీ రిలీజ్ పనుల్లో బిజీగా గడుపుతున్నట్లు కనిపిస్తుంది. రెండు ఒకేసారి వచ్చేలా తన సమయం ఏమాత్రం వృధా కాకుండా ఇండియా ట్రిప్ ప్లాన్ చేసుకున్నట్లు కనిపిస్తుంది. సిద్దార్థ్ చోప్రా పెళ్లి అనంతరం అమ్మడు పానీ రిలీజ్ పనుల్లో బిజీ అవుతుంది. పానీ చిత్రాన్ని అక్టోబర్ 18న రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా అమ్మడు ముంబై పిల్మ్ సిటీని సందర్శించింది. ఇలా ఫిల్మ్ సిటీని సందర్శించడం చాలా కాలం తర్వాత జరుగుతోంది. ఈ సందర్భంగా ఓ వీడియోని పోస్ట్ చేసింది. %-%గదర్%-%లోని ఐకానిక్ 'ఘర్ అయా పరదేశి' పాటను



జోడించి ఫాలోవర్లను ఉత్సాహపరిచింది. ఈ పాటతో అమ్మడు మంచి మార్కులు కొట్టేసింది. ప్రియాంక స్వదేశానికి తిరిగి వచ్చినట్లు అనే ఫీల్ ని తీసుకొచ్చింది. తన ఇండియా జర్నీ గురించి ఎమోషనల్ ఎమోజీలను పోస్ట్ చేసింది. హాలీవుడ్ కి వెళ్లిన తర్వాత ప్రియాంక ఇండియా నుంచి ఎలాంటి వ్యతిరేకత ఎదుర్కొందో తెలిసిందే. హాలీవుడ్ సినిమాల కోసం భారతదేశ సంస్కృతి సంప్రదాయాల్ని మట్టిగలుపుతుందని తీవ్ర విమర్శలు ఎదుర్కొంది. నెట్టింట పెద్ద ఎత్తున ట్రోలింగ్ ఎదుర్కొంది. కానీ తాజాగా వీడియోతో అన్ని లెక్కలు సరి చేసింది. అయితే సోదరుడి వివాహం అనంతరం వీసీ %-%పానీ%-% రిలీజ్ వరకూ ఇండియాలో ఉంటుందా? ఉండదా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మరి ఈ సందర్భంగా గతంలో కమిట్ అయిన బాలీవుడ్ చిత్రాల గురించి ఏదైనా అప్ డేట్ ఇస్తుందా? అన్నది చూడాలి.

# ఆ పిలుపే ఉపాసనకు అదిరిపోయే గిఫ్ట్

ఏ తండ్రికి అయినా కూతురు అంటే వల్లమాలిన ప్రేమ. క్లిన్ కారాపై రామ్ చరణ్‌కి ఉన్న ప్రేమ అంతకుమించి. ఏడాది వయసున్న క్లిన్ కారా అసలు డాడీ రామ్ చరణ్ ని వదిలి ఉ ండలేదు. మమ్మీ కంటే డాడీకి బాగా చేరువైందని గుసగుసలు వినిపించాయి. ఇక క్లిన్ కారాను వదిలి చరణ్ క్షణమైనా ఉ ండలేడు. కూతురితో ప్రతిక్షణం ఆటపాటలను ఆస్వాధిస్తాడు చరణ్. అయితే కూతురిపై ప్రేమకు కారణం భార్య ఉపాసన. అందుకేనేమో నేడు బర్త్‌డే జరుపుకుంటున్న ఉపాసనను కారా మమ్మీ అంటూ పిలిచేసాడు చరణ్. భార్యపై ఎంతటి ప్రేమాభిమానం.. అలా కాకపోతే కూతురి పేరుతో పిలిచేస్తాడా? చరణ్ ఉపాసన పుట్టినరోజు సందర్భంగా విష్ చేస్తూ హ్యాపీ బర్త్ డే కారా మమ్మీ!! అంటూ పోస్ట్ చేశాడు. క్లిన్ కారా చరణ్- ఉ పాసనల గారాల కుమార్తె అని అందరికీ తెలుసు. గారాల పట్టీ



20 జూన్ 2023న జన్మించింది. ఇప్పటికే ఒక సంవత్సరం నిండింది. దంపతులు ఇద్దరూ ఎక్కడికి వెళ్లినా తమ వెంటే క్లిన్ కారా కూడా ఉంటోంది. ప్రస్తుతం లండన్ వెకేషన్ లోను చరణ్-ఉపాసనతోనే క్లిన్ కారా ఉంది. ఆగస్టులో జరిగే ఇండియన్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ మెల్‌బోర్న్‌లో చరణ్‌కి అంబాసిడర్ ఫర్ ఇండియన్ ఆర్ట్ అండ్ కల్చర్ టైటిల్‌ను అందజేయనున్నారు. ఇదే హుషారులో తన తదుపరి చిత్రం గేమ్ ఛేంజర్ ని పాన్ ఇండియాలో బ్లాక్ బస్టర్ గా మలచాలని చరణ్ తపిస్తున్నాడు. ఈ చిత్రానికి శంకర్ దర్శకత్వం వహిస్తున్న సంగతి తెలిసిందే. ఈ ఏడాది చివరిలో ఈ సినిమా విడుదల అయ్యేందుకు అవకాశం ఉంది. రిలీజ్ తేదీని ఇంకా ప్రకటించాల్సి ఉంది.




## రిజిస్ట్రేషన్ మార్కెట్ విలువల పెంపుపై లోతైన అధ్యయనం!

**తెలంగాణలో రిజిస్ట్రేషన్ మార్కెట్ విలువలు ఇప్పట్లో పెంచే అవకాశం కనిపించడం లేదు. రెవెన్యూ రాబడిపై లోతైన అధ్యయనంతోపాటు శాస్త్రీయంగా సవరణలు చేసేందుకు క్షేత్రస్థాయి మార్కెట్ ధరలపై కసరత్తు సాగుతోంది. రిజిస్ట్రేషన్లతో పాటు ఇతరత్ర సేవల ద్వారా అదనపు ఆదాయం పెంచుకునే మార్గాల అన్వేషణ జరుగుతోంది.**

## కవితకు బెయిల్.. భారాస నైతిక విజయం: ఎమ్మెల్సీ మధుసూదనాచారి



హైదరాబాద్: భారాస ఎమ్మెల్సీ కవితకు బెయిల్ ఇచ్చి సుప్రీంకోర్టు న్యాయం పక్షాన నిలిచిందని ఎమ్మెల్సీ మధుసూదనాచారి అన్నారు. కవితకు బెయిల్ ఇవ్వడాన్ని తాము స్వాగతిస్తున్నట్లు చెప్పారు. ఆమెకు బెయిల్ రావడం భారాసతోపాటు తెలంగాణ వాదులకు ఊరటనిచ్చే వార్త అన్నారు. మద్యం విధానంలో అక్రమంగా పెట్టిన కేసు అని, ఇందులో ఎలాంటి నిజాలు లేవని మొదట్నుంచి తాము చెబుతున్నామన్నారు. కవితకు బెయిల్ భారాస సాధించిన నైతిక విజయమని చెప్పారు. "కవిత పోరాటయోధురాలు. ఇవాళ బెయిల్ వచ్చింది. త్వరలో కేసు నుంచి కడిగిన ముత్యంలా బయట పడతారు. ఆమె బెయిల్ పిటిషన్ సందర్భంగా సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలు ఈడీ, సీబీఐకి చెంప పెట్టులాంటివి. దర్యాప్తు సంస్థల కక్ష సాధింపు చర్యలను సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పు పట్టింది. పాలకపక్షం రాజకీయ ప్రత్యర్థులను వేధిస్తున్న ఈడీ, సీబీఐ తీరుపై దేశవ్యాప్తంగా చర్చ జరగాలి"అని ఎమ్మెల్సీ మధుసూదనాచారి అన్నారు.

## రుణమాఫీపై రైతుల ఆందోళన.. అపోహ పడొద్దన్న మంత్రి తుమ్మల



ఖమ్మం, ఆగస్టు 27: రైతు రుణమాఫీపై కలెక్టరేట్ వద్ద రైతు సంఘాలు మంగళవారం ధర్నాకు దిగాయి. విషయం తెలిసిన వెంటనే మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అక్కడకు చేరుకున్నారు. ధర్నా వద్దకు వెళ్లి రైతు సంఘం నేతలకు రైతులకు రుణమాఫీపై స్పష్టతనిచ్చారు. ఆపై రైతులు తమ ఆందోళనను విరమించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... రైతు రుణమాఫీ అవ్వని రైతులు అపోహ పడొద్దన్నారు. కుటుంబ నిర్ధారణ కానీ రైతుల ఇళ్లకు వ్యవసాయ శాఖ సిబ్బంది వెళ్లి వివరాలు సేకరిస్తారని తెలిపారు. రైతుల ఇంటి వద్దే కుటుంబ నిర్ధారణ చేసి వివరాలు యాప్‌లో అప్‌లోడ్ చేస్తారన్నారు. బ్యాంకుల్లో మొత్తం 42 లక్షల రైతులు 31 వేల కోట్లు అప్పు ఉన్నారని తెలిపారు. రెండు లక్షల రుణమాఫీ 18 వేల కోట్ల రైతులు ఖాతాల్లో జమ చేస్తామని వెల్లడించారు. రెండు లక్షల పైన రుణాలు ఉన్న రైతుల రుణమాఫీపై క్యాబినెట్‌లో నిర్ణయం తీసుకుంటామన్నారు. గత ప్రభుత్వం చేసిన రైతు రుణమాఫీపై కాగ్ నివేదికలో వాస్తవాలు వెల్లడయ్యాయన్నారు. రైతులను గందరగోళం చేసే పనులు చేయొద్దని హితవుపలికారు. సీఎం రేవంత్ రెడ్డి వాగ్దానం చేసినట్లు 31 వేల కోట్లు రుణమాఫీ చేసి తీరుతామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మరోసారి స్పష్టం చేశారు.




హైదరాబాద్: బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు బెయిల్ దక్కడం కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల విజయమని, కాంగ్రెస్ పార్టీకి, ఆ పార్టీ లాయర్లకు అభినందనలు తెలియజేస్తున్నానంటూ కేంద్ర మంత్రి, బీజేపీ నేత బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలకు మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. " మీరు ఒక కేంద్ర హోం వ్యవహారాల సహాయ మంత్రిగా ఉండి దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టుపై నిందలు వేస్తున్నారు!!. అది మీ హోదాకు తగదు. మీ స్థానానికి తగినది కాదు" అని కేటీఆర్ విమర్శించారు. గౌరవనీయులైన భారత ప్రధాన న్యాయమూర్తి, సుప్రీంకోర్టు ఈ వ్యాఖ్యలను గమనించి కోర్ట్ ధిక్కార చర్యలను ప్రారంభించాలని తాను కోరుతున్నట్టు కేటీఆర్ పేర్కొన్నారు.

**ఇంతకీ బండి సంజయ్ ఏమన్నారంటే?...** ఎమ్మెల్సీ కవితకు బెయిల్ లభించిన వెంటనే కేంద్ర మంత్రి, కరీంనగర్ బీజేపీ ఎంపీ ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. సంచలనం సృష్టించిన ఢిల్లీ మద్యం కుంభకోణంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు బెయిల్ లభించినందుకు కాంగ్రెస్ పార్టీకి, ఆ పార్టీ లాయర్లకు అభినందనలు అని పేర్కొన్నారు. "అలుపెరగకుండా మీరు చేసిన ప్రయత్నాలు చివరకు ఫలించాయి. ఈ బెయిల్ బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండింటికీ దక్కిన విజయం. బీఆర్ఎస్ నాయకురాలు బెయిల్‌పై బయటకు వస్తున్నారు. కాంగ్రెస్ నేత రాజ్యసభకు వెళ్తారు. కవిత బెయిల్ కోసం తొలుత వాదించిన అభ్యర్థిని రాష్ట్రంలోని అధికార కాంగ్రెస్ పార్టీ ఏకగ్రీవంగా రాజ్యసభకు నామినేట్ చేయడం, దానికి మద్దతు ఇవ్వడంలో కేసీఆర్ అద్భుతమైన రాజకీయ చతురతను ప్రదర్శించారు. నేరంలో భాగస్వాములైనవారికి అభినందనలు" అని బండి సంజయ్ వ్యాఖ్యానించారు.

**ఎట్టకేలకు కవితకు బెయిల్..** ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో అరెస్ట్ అయ్యి ప్రస్తుతం తీహాడ్ జైలులో బెయిల్ కోసం ఎదురుచూస్తున్న ఎమ్మెల్సీ కవితకు ఎట్టకేలకు ఇవాళ ఉపశమనం దక్కింది. ఆమె దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై సుదీర్ఘ వాదనలు విన్న జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ విశ్వనాథన్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం బెయిల్ మంజూర్ చేసింది. ఈడీ, సీబీఐ రెండు కేసుల్లో బెయిల్ ఇస్తున్నట్టు స్పష్టం చేసింది. సీబీఐ తుది ఛార్జిషీట్ దాఖలు చేసిందని, ఈడీ కూడా దర్యాప్తు పూర్తిచేసిందని, మహిళగా కూడా పరిగణించాల్సి ఉన్నందున బెయిల్ ఇస్తున్నట్టు ధర్మాసనం కారణాలుగా పేర్కొంది. నిందితురాలు ప్రస్తుతం జైలులో ఉండాల్సిన అవసరం న్యాయస్థానం స్పష్టం చేసింది. కాగా కవిత తరఫున సీనియర్ లాయర్ ముకుల్ రోహత్గీ, ఈడీ తరఫున ఏఎస్‌జీ వాదనలు వినిపించారు.

## హుస్సేన్ సాగర్‌పై సుప్రీం ఆదేశాల అమలుకు ప్రజలు సహకరించాలి: మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్: గణేష్ ఉత్సవాల నిర్వహణ విషయంలో అందరి సహకారంతో ముందుకెళ్తామని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. అన్నిశాఖల అధికారులతో గణేష్ ఉత్సవాల సందర్భంగా ఏర్పాట్లపై హైదరాబాద్‌లో మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ సన్నాహక సమావేశం నిర్వహించారు. "నిమజ్జనం చాలా ముఖ్యమైంది. కుల మతాలకు అతీతంగా గణేష్ ఉత్సవాలు జరుపుకొంటున్నాం. ఎక్కడ ఏ చిన్న ఇబ్బంది జరగకుండా అన్ని శాఖల అధికారులను ఆదేశించాం. భక్తులకు, మండపం నిర్వాహకులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నాం. మట్టి విగ్రహాలను పెద్ద ఎత్తున వినియోగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. మట్టి విగ్రహాలు అందరికీ అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. అందరికీ వివిధ మాధ్యమాల ద్వారా అవగాహన కల్పిస్తున్నాం. హుస్సేన్ సాగర్ విషయంలో సుప్రీంకోర్టు చేసిన ఆదేశాల అమలుకు ప్రజలందరి సహకారం అవసరం" అని శ్రీధర్‌బాబు అన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల గౌరవాన్ని పెంచే విధంగా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామన్నారు. గతంలో జరిగిన ఉత్సవాలను ప్రజల సహకారంతో ఏ విధంగా పూర్తి చేసుకున్నామో, అదే విధంగా ప్రశాంతంగా పూర్తి చేస్తామని తెలిపారు. ఆర్టీసీ, మెట్రో సౌకర్యాలు మరింత పెంచుతామని, నిమజ్జనం వీలైనంత త్వరగా పూర్తి చేయాలని చూస్తున్నామని వివరించారు.



## ఓవైసీ బ్రదర్స్‌కు భయపడొద్దు.. సీఎం రేవంత్‌కు రాజాసింగ్ మద్దతు

హైదరాబాద్, ఆగస్టు 27: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ మద్దతు తెలిపారు. చెరువులను కాపాడాలని సీఎం సంకల్పం తీసుకోవటం అభినందనీయమని కొనియాడారు. సీఎం రేవంత్ రెడ్డి సంకల్పం పూర్తి కావాలని కోరుకుంటున్నానని తెలిపారు. ఓవైసీ బ్రదర్స్ బెదిరింపులకు భయపడొద్దని ఎమ్మెల్యే తెలిపారు. వేల మంది యువత మద్దతు ఉందని అక్బరుద్దీన్ బెదిరిస్తున్నారన్నారు. మాజీ ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి మాదిరి భయపడకుండా రేవంత్ రెడ్డి ముందుకెళ్ళాలని సూచించారు. ఓవైసీ బ్రదర్స్‌ను బొక్కలో వేసిన సీఎంగా కిరణ్ కుమార్ రెడ్డికి పేరుందని గుర్తుచేశారు. ఉచిత విద్య పేరుతో ఓవైసీ సోదరులు కోట్లు దోచుకుంటున్నారని ఆరోపించారు. చెరువులో 12ఎకరాలు ఆక్రమించి ఫాతిమా కాలేజ్‌ను నిర్మించారన్నారు. అసదుద్దీన్ ఓవైసీ బంగ్లా కూడా ప్రభుత్వ స్థలంలోనే ఉందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంఐఎంకు గులాంగిరి చేసిందని విమర్శించారు. కలెక్టర్ సాయంతో గోషామహల్ నియోజకవర్గంలో ప్రభుత్వ భూములు మాయమవుతున్నాయని రాజాసింగ్ పేర్కొన్నారు.

**అక్బరుద్దీన్ ఏమన్నారంటే..** అక్రమ నిర్మాణాలు కూల్చివేస్తూ హైడ్రా ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. అయితే హైడ్రాపై మజ్లిస్ ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ సంచలన వ్యాఖ్యలు చేశారు. బండ్లగూడలో గల ఫాతిమా ఓవైసీ కాలేజీని హైడ్రా కూల్చివేస్తుందనే వార్తలపై స్పందించారు. చెరువు కబ్జా చేసి ఓవైసీ బ్రదర్స్ స్కూల్ నిర్మించారని హైడ్రాకు ఫిర్యాదులు వచ్చాయి. ఆ క్రమంలో అక్బరుద్దీన్ కీలక వ్యాఖ్యలు చేశారు. "కావాలంటే నాపై మళ్లీ బుల్లెట్ల వర్షం కురిపించండి. ఆ స్కూల్ కూల్చకండి.

పేదలకు ఉచిత విద్య అందించేందుకు 12 బిల్డింగులు నిర్మించా. వీటిని కావాలని కొందరు తప్పుగా చూపిస్తున్నారు. గతంలో నాపై కాల్పులు జరిగాయి. కావాలంటే మళ్లీ బుల్లెట్ల వర్షం కురిపించండి. కత్తులతో దాడి చేయండి. పేదల విద్యాభివృద్ధి కృషికి అడ్డుపడకండి అని" అక్బరుద్దీన్ సూచించారు.

**హాట్‌టాపిక్‌గా సల్కం చెరువు కబ్జా...** అయితే ఇప్పుడు ఎమ్మెల్యే అక్బరుద్దీన్ వ్యాఖ్యలతో సల్కం చెరువు కబ్జా విషయం హాట్ టాపిక్‌గా మారింది. ఎవరి నోట విన్నా ఇదే చర్చ నడుస్తోంది. రేవంత్ రెడ్డి సర్కార్.. ఓవైసీ బ్రదర్స్‌కు చెందిన విద్యాసంస్థలను కూల్చుతుందా? లేదా? అనేది సస్పెన్స్‌ను తలపిస్తోంది. ఓవైసీ బ్రదర్స్ నిర్మించిన అక్రమ నిర్మాణాలు కూల్చాలంటూ హైడ్రాకు ఫిర్యాదుల మీద ఫిర్యాదులు అందుతున్నాయి. చెరువును మట్టితో పూడ్చేసి భారీ భవనాల నిర్మాణం గావించారు . 2016 - 2021 లో కబ్జాకు గురైనట్టు నిర్ధారణ అయ్యింది. హీరో నాగార్జునకు చెందిన ఎన్ కన్వెన్షన్ కూల్చివేత అనంతరం ప్రముఖంగా వినిపిస్తున్న కబ్జాల్లో సల్కం చెరువు కబ్జా ఒకటి. పైగా అక్బరుద్దీన్ ఒవైసీ వ్యాఖ్యలతో ఇది రాష్ట్రంలో మరింత హాట్ టాపిక్‌గా మారింది. బండ్లగూడలోని ఫాతిమా ఓవైసీ కాలేజీని హైడ్రా కూల్చివేస్తుందన్న వార్తలపై అక్బరుద్దీన్ ఓవైసీ ఫైర్ అయ్యారు.

## అక్బరుద్దీన్ వ్యాఖ్యలతో హాట్ టాపిక్ గా సల్కం చెరువు కబ్జా..



హైదరాబాద్: ఇప్పుడు తెలంగాణలో ఏదైనా హాట్ టాపిక్ ఉంది అంటే.. ఒకటి హైడ్రా.. రెండు సల్కం చెరువు. ఓల్డ్ సిటీలోని సల్కం చెరువు దాదాపుగా కబ్జా కోరల్లో చిక్కుకున్నట్టు తెలుస్తోంది. చెరువు మధ్యలో ఎంఐఎంకు నేతలు ఓవైసీ బ్రదర్స్‌కు చెందిన ఫాతిమా విద్యాసంస్థలు ఉన్నట్టు తెలుస్తోంది. 70% చెరువు కబ్జాకు గురైనట్లు హైడ్రా ఇప్పటికే తేల్చింది. ఎమ్మెల్యే అక్బరుద్దీన్ వ్యాఖ్యలతో సల్కం చెరువు కబ్జా విషయం హాట్ టాపిక్ గా మారింది. ఎవరి నోట విన్నా ఇదే చర్చ నడుస్తోంది. రేవంత్ రెడ్డి సర్కార్.. ఒవైసీ బ్రదర్స్‌కు చెందిన విద్యాసంస్థలను కూల్చుతుందా? లేదా? అనేది హాట్ టాపిక్‌గా మారింది. ఓవైసీ బ్రదర్స్ నిర్మించిన అక్రమ నిర్మాణాలు కూల్చాలంటూ హైడ్రాకు ఫిర్యాదుల మీద ఫిర్యాదులు అందుతున్నాయి. చెరువును మట్టితో పూడ్చేసి భారీ భవనాల నిర్మాణం గావించారు . 2016 - 2021 లో కబ్జాకు గురైనట్టు నిర్ధారణ అయ్యింది. హీరో నాగార్జునకు చెందిన ఎన్ కన్వెన్షన్ కూల్చివేత అనంతరం ప్రముఖంగా వినిపిస్తున్న కబ్జాల్లో సల్కం చెరువు కబ్జా ఒకటి. పైగా అక్బరుద్దీన్ ఒవైసీ వ్యాఖ్యలతో ఇది రాష్ట్రంలో మరింత హాట్ టాపిక్‌గా మారింది. బండ్లగూడలోని ఫాతిమా ఓవైసీ కాలేజీని హైడ్రా కూల్చివేస్తుందన్న వార్తలపై అక్బరుద్దీన్ ఓవైసీ ఫైర్ అయ్యారు. కావాలంటే తనపై మళ్లీ బుల్లెట్ల వర్షం కురిపించాలని.. కానీ ఆ స్కూల్‌ను మాత్రం కూల్చవద్దన్నారు. మాపై కక్షగట్టి, మాకు నోటీసులు ఇచ్చి, మా విద్యా సంస్థలను కూల్చడానికి ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. పేదలకు ఉచిత విద్యనందించేందుకు 12 బిల్డింగ్‌లు నిర్మించానని.. వీటిని కావాలని కొందరు తప్పుగా చూపిస్తున్నారన్నారు. కత్తులతో దాడి చేయాలని.. కానీ పేదల విద్యాభివృద్ధి కృషికి అడ్డుపడవద్దని పేర్కొన్నారు. తమపై కక్షగట్టి, తమకు నోటీసులు ఇచ్చి, విద్యా సంస్థలను కూల్చడానికి ప్రయత్నం చేస్తున్నారని ఓవైసీ ఆరోపించారు. ఒకవేళ కూల్చినా కూడా కుతుబ్‌మినార్ కంటే ఎత్తయిన భవనాలు నిర్మిస్తానని అక్బరుద్దీన్ పేర్కొన్నారు. ఇప్పటికే 50 మంది ప్రముఖుల చిట్టాను హైడ్రా సిద్ధం చేసిందని సమాచారం. నెక్స్ట్ కూల్చివేతల జోలికి వెళితే మాత్రం అది సల్కం చెరువు కబ్జాల జోలికే వెళతారని తెలుస్తోంది.

కూల్చివేతల కోసం అదనంగా బలగాలను సైతం సిద్ధం చేసిందని ప్రచారం అయితే జోరుగానే నడుస్తోంది. కానీ హైడ్రా కమిషనర్ రంగనాథ్ మాత్రం మూడు రోజులుగా బుద్ధ భవన్ హైడ్రా కార్యాలయంలోనే ఉండిపోయారు. అన్ని శాఖల అధికారులతో కమిషనర్ రంగనాథ్ నాన్ స్టాప్ సమావేశాలు నిర్వహిస్తున్నారు. మరి ఈ సమావేశాల సారాంశం ఏంటన్నది మాత్రం బయటకు రావడం లేదు. మొత్తానికి మాస్టర్ ప్లాన్‌తో రంగంలోకి దిగుతారని అంతా చెప్పుకుంటున్నారు. సల్కం చెరువు కబ్జాలపై మాత్రం పెద్ద ఎత్తున సీఎం రేవంత్‌తో పాటు హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కి ఫిర్యాదులు అందుతున్నాయి. దీనిపై హైడ్రా ఏం చేస్తుందో చూడాలి.

## కవిత పర్మినెంట్‌గా జైల్‌లో ఉండాలా?...తలసాని ఆగ్రహం



హైదరాబాద్, ఆగస్టు 27: ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసింది. దాదాపు ఐదు నెలలుగా తీహాడ్ జైలులో ఉన్న కవిత.. సుప్రీం బెయిల్ మంజూరు చేయడంతో విడుదలకానున్నారు. కవితకు సుప్రీం బెయిల్ మంజూరు చేయడంపై ఆ పార్టీ నేత, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ...కవితకు బెయిల్ రావడం సంతోషంగా ఉందన్నారు. ఇది మోటివేటెడ్ కేసని స్పష్టత వచ్చిందన్నారు. 11మందిని అప్రువర్స్‌గా మార్చారన్నారు. వందల కోట్ల కేసని చెప్పి ఒక్క రూపాయి రికవరి చేయలేదని జడ్జిలే స్పష్టంగా చెప్పారన్నారు. బెయిల్ వచ్చిన తర్వాత కొందరు చేస్తున్న కామెంట్స్ మంచిది కాదన్నారు. సుప్రీంకోర్టు తీర్పును అవమానించేలా మాట్లాడటం సరికాదన్నారు. బాధ్యతగల వ్యక్తులు మాట్లాడటం మంచిదికాదన్నారు. కేసులో ఉన్నవారందరికీ బెయిల్ వచ్చిందని.. కవితకు ఎలా బెయిల్ వచ్చింది అనడం హాస్యాస్పదమన్నారు. అంటే కవిత పర్మనెంట్‌గా జైల్‌లో ఉండాలా? అంటూ మండిపడ్డారు. న్యాయమూర్తులను అవమానించేలా మాట్లాడటం బాధాకరమని తలసాని శ్రీనివాస్ అన్నారు.

**సుప్రీం కోర్టుకు ధన్యవాదాలు: దాసోజు...** దాసోజు శ్రవణ్ మాట్లాడుతూ.. కవితకు బెయిల్ మంజూరు చేసిన సుప్రీం కోర్టుకు ధన్యవాదాలు తెలిపారు. విచారణ సందర్భంగా సుప్రీం కోర్టు న్యాయమూర్తులు ఈడీ ,సీబీఐల దర్యాప్తు తీరును తీవ్రంగా ఆక్షేపించాయని.. వారి వ్యాఖ్యలతో ఈ కేసు నిలవదని స్పష్టమైందన్నారు. కవిత ఓ ఫైటర్ అని చెప్పుకొచ్చారు. జైలు నుంచి విడుదలయ్యాక పార్టీ బలోపేతం కోసం ఆమె పోరాటం కొనసాగుతుందన్నారు. బీజేపీతో పొత్తులో భాగంగానే కవితకు బెయిల్ వచ్చిందని కాంగ్రెస్ నేతలు మతి స్థిమితం కోల్పోయి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ నేతల వ్యాఖ్యలు వాదనకు నిలవవన్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ ఇండియా కూటమిలో భాగస్వామి అని..ఆ పార్టీ నేత సిసోడియాకు ఇదే కేసులో బెయిల్ వస్తే కాంగ్రెస్ స్వాగతించి కవిత విషయం వచ్చే సరికి వేరే విధంగా మాట్లాడటం ద్వంద్వ ప్రమాణాలకు నిదర్శనమని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిసోడియాకు బెయిల్ వస్తే బీజేపీ ఆప్ కుమ్మక్కయినట్టాఅని ప్రశ్నించారు. తప్పుడు వాదనలతో కాంగ్రెస్ ప్రజల్లో మరింత పలుచన కావొద్దని హితవుపలికారు.బీఆర్ఎస్‌కు బీజేపీతో ఎలాంటి పొత్తు ఉండదని దాసోజు శ్రవణ్ మరోసారి స్పష్టంచేశారు.

## కొనసాగుతున్న కాళేశ్వరం కమిషన్ విచారణ

హైదరాబాద్, ఆగస్టు 27: కాళేశ్వరం లిఫ్టుల్లో అవినీతి, అక్రమాలు, నాణ్యతా లోపాలపై తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు జస్టిస్ పీసీ చంద్రఘోష్ కమిషన్ విచారణ కొనసాగుతోంది. మేడిగడ్డ ప్రాజెక్టు కుంగుబాటుకు కారణం రాఫ్ట్ కింద పలు సమస్యల వల్ల జరిగింది అన్నట్లు మిషన్ ముందు ఇంజనీర్లు చెప్పారు. సికెండ్ ఫైల్స్, అలాట్మెంట్ డివియేషన్ వల్ల సమస్య వచ్చింది అన్నట్లు ఇంజనీర్ సత్యనారాయణ రెడ్డి తెలిపారు. డిజైన్ల అప్రూవల్ తర్వాత అన్నారం గ్యారేజీ మోడిఫికేషన్ జరిగిందని కమిషన్‌ముందు ఇంజనీర్ ఒప్పుకున్నారు. అయితే రామగుండం ఈసీ లేఖపై మాత్రం కమిషన్ ముందు ఇంజనీర్ దయాకర్ రెడ్డి స్పష్టత లేని సమాధానం చెప్పినట్లు తెలుస్తోంది. హై పవర్ కమిటీలో సీడీఓ అధికారులు సభ్యులుగా ఉన్నారు అని ఇంజనీర్లు ఒప్పుకున్నారు. డిజైన్లు తయారు చేసే ముందు సైట్ విజిట్ ఖచ్చితంగా చేయనక్కర్లేదు అని కమిషన్ ముందు వారు చెప్పారు. అన్నారం సుందిళ్ల బ్యారేజీల లొకేషన్ మారినట్లు కమిషన్‌కు అధికారులు చెప్పారు. అయితే మేడిగడ్డ లొకేషన్ మారలేదని తాజా మాజీ ఇంజనీర్లు.. కమిషన్ ముందు స్పష్టం చేశారు. సీడీఓ - ఎల్అండ్‌టీ వేరువేరుగా డిజైన్లు తయారుచేసి ఫైనల్ అప్రూవల్‌కు అన్ని ఒకే దగ్గర చేసినట్లు ఇంజనీర్లు తెలిపారు. మూడు బ్యారేజీలకు సంబంధించి డిజైన్లలో ఎలాంటి సమస్య లేదని నిబంధనల ప్రకారమే డిజైన్లు ఉన్నాయని ఇంజనీర్లు వెల్లడించారు. మరోవైపు మాజీ జల వనరుల అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మెన్ వి ప్రకాష్ బీఆర్‌కే భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. 37 లక్షల ఎకరాలకు నీళ్లు ఇచ్చేందుకు కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం జరిగిందన్నారు. రఘు, వేధిర్ శ్రీరామ్ సీడబ్ల్యూసీ అంశాలను వక్రీకరించారని తెలిపారు. తాను కమిషన్ ముందు అఫిడవిట్ దాఖలు చేశానన్నారు. తుమ్మిడిహట్టి నిర్మాణం సాధ్యం కాదు అని వివరాలు ఇచ్చినట్లు తెలిపారు. తుమ్మడిహెట్టిపై కాగ్ ఆక్షేపాలను కమిషన్‌కు తెలియజేసినట్లు చెప్పారు. అఫిడవిట్ పరిశీలన తరువాత మళ్ళీ పిలుస్తామని కమిషన్ అన్నదన్నారు. నిజమైన దోషులకు శిక్ష పడాలి అనేదే తమ ఉద్దేశమని వి.ప్రకాష్ పేర్కొన్నారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com